

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 349

శనివారం 11-3-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కందేపి రాణీప్రసాద్

● సాక్షరం

రాయని రోజు లేదు

30 ఏళ్ల అక్షరయానం.
46 పుస్తకాల ఆవిష్కరణ.
ఆ దారిలో మరో 40 పుస్తకాలు.
అంతా పిల్లల సాహిత్యమే.
బాలల నీతి కథలు కావవి...
సామాన్యశాస్త్ర కథలు.
సామాన్యులకు అర్థమయ్యే కథలు.
పిల్లలకు జ్ఞాపకముండే కథలు.
ఆ సేవకు అందిన పురస్కారమే...
ఈ రచయిత్రి అందుకున్న సత్కారం.



మంత్రి సత్యవతి రాథోడ్ నుంచి సత్కారం అందుకుంటూ...

కందేపి రాణీప్రసాద్ అసలు పేరు సులోచనారాణి. యద్దనపూడి సులోచనారాణి అంతటి రచయిత్రి కావాలనే ఆకాంక్షతో ఆమె తండ్రి పెట్టుకున్న పేర ది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, బాపట్ల జిల్లా, చీరాలలో సాహితీకారుల కుటుంబంలో పుట్టిన రాణీప్రసాద్ పెళ్లితో తెలంగాణ రాష్ట్రం సిరిసిల్లలో అడుగుపెట్టారు. సిరిసిల్ల ఆమె సృజనాత్మకతకు వేదిక అయింది. ముప్పై ఏళ్లలో రాయని రోజంటూ లేకుండా సాగింది ఆమె అక్షరప్రస్థానం. బాలసాహిత్యానికి ఆమె చేసిన సేవకు గుర్తింపుగా తెలంగాణ ప్రభుత్వం ఆమెను అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా మార్చి ఎనిమిదవ తేదీన వరంగల్, కాకతీయ యూనివర్సిటీలో సత్కరించింది. ఈ సందర్భంగా ఆమె తన సంతోషాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

■ అక్షరం 'మొగ్గ' తొడిగింది!

"అవార్డు అందుకోవడం ఎవరికైనా సంతోషకరమే. అవార్డు అందుకున్న రోజు ఒక్కటే కాదు, ప్రతి కవిత రాసినప్పుడు, కథ రాసినప్పుడు కూడా సంతోషమేస్తుంది. మాది ప్రకాశం జిల్లా (అప్పట్లో) చీరాల, నా అక్షరాభ్యాసం నాటికి ఇంకొల్లులో ఉన్నాం. మా నాన్న ఎంతటి సాహిత్యాభిలాషి అంటే నా అక్షరాభ్యాసాన్ని రావూరి భరద్వాజ, విశ్వనాథ సత్యనారాయణ, కొండూరి రాఘవాచారి, భుజంగరాయశర్మ వంటి ప్రముఖ కవుల సమక్షంలో చేశారు. చదువుకునే రోజుల్లో సైన్స్ వ్యాసాలు రాశాను. పెళ్లితో సిరిసిల్లలో అడుగుపెట్టాను. పెద్ద బాబు పుట్టినప్పుడు నాకు ఆపరేషన్ కావడంతో చాలాకాలం కదలకుండా ఉండాల్సి వచ్చింది. అప్పుడు మొదలు పెట్టిన రచనావ్యాసంగం నిరంతరాయంగా కొనసాగుతోంది. నా కవితకు స్వాతి పత్రిక వారిచ్చిన పారితోషికం పది రూపాయల నోటును ఇప్పటికీ భద్రంగా దాచుకున్నాను.

■ రాయడమే వినోదం

డాక్టర్ల భార్యలు కూడా డాక్టర్లైతేనే వృత్తి బాధలు అర్థమవుతాయి. సినిమాలు, పిక్నిక్‌లు, సరదాగా గడిపే టైమ్ ఉండదు. నేను వైద్యపరమైన డాక్టర్‌ని కాదు, కానీ పీహెచ్‌డీ డాక్టర్‌ని. మా వారు పిల్లలకు వైద్యం చేయడంలో బిజీ. నేను పిల్లలకు బొమ్మలు చేయడం, కథలు రాయడంలో బిజీ. దేహ భాగాలు, వాటి పనులతో పొడుపు కథలు రాశాను. అనారోగ్యాల గురించి కవితలు, బాలగేయాలు రాశాను. చెట్ల విడిభాగాలతో 750 బొమ్మలను బాలికా వికాసం థీమ్‌తో చేశాను. సైన్స్ పాఠాలు సామాన్యులకు కూడా అర్థమయ్యేలా 'జలచక్రం' వంటి కథలతో ఏడు పుస్తకాలు రాశాను. ఇప్పుడు బాలల మాసపత్రికలకు, దిన పత్రికలకు కాలమ్స్ రాస్తున్నాను.

■ ఇంటి గోడలే మ్యూజియాలు

హాస్పిటల్ నుంచి సేకరించిన వేస్ట్ మెటీరియల్‌తో అందమైన బొమ్మలు చేయడం నా హాబీ. షో పీస్‌లు, టీచింగ్ ఎయిడ్‌ల కోసం నాలుగు వేల బొమ్మలు చేశాను. 15 వందల చార్టులు 30కి పైగా థీమ్‌లతో చేశాను. మా ఇంట్లో నేను పని చేసుకునే గది 'మిల్కీ మ్యూజియం', ఊరి వాళ్ల కోసం కేటాయించిన లైబ్రరీ గది పేరు 'స్వీటీ లైబ్రరీ', హాస్పిటల్ ల్యాబ్‌లో శాస్త్రవేత్తల చిత్రాలు, ఒక గదిలో స్వాతంత్ర్య సమరయోధులు, భారతీయ చిత్రకళ, శిల్పకళ, ఆటోమొబైల్ ఇండస్ట్రీ పరిణామ క్రమం, అరుదైన మొక్కలు, అంతరించి పోతున్న జంతువులు... ఇలా గదికో థీమ్ అన్నమాట. 75 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలకు 75 జాతీయ పతాకాలతో ప్రదర్శన పెట్టాను. ఆ ప్రదర్శన చూసిన మా వారి స్నేహితులు 'ప్రసాద్ అర్ధరాత్రి వరకు హాస్పిటల్‌లో ఉంటాడు. ఈవిడకు బొమ్మలు చేసుకోవడానికి, కథలు రాసుకోవడానికి కావలసినంత టైమ్ ఇస్తున్నాడు' అని చమత్కరించారు. సిరిసిల్ల వంటి చిన్న పట్టణంలో నాకు ఆనందం నేను రాసుకునే అక్షరాల్లోనే దొరుకుతోంది. అదే నా జీవనశైలిగా మారింది. వంద పుస్తకాలు పూర్తి చేయాలనేది నా ఆకాంక్ష. పూర్తి చేయగలననే నమ్మకం ఉంది" అని సాలోచనగా అన్నారు సులోచనా రాణీప్రసాద్.

– వాకా మంజులారెడ్డి



కెప్టెన్ దీక్షా సి.ఎం.

కెప్టెన్ దీక్షా సి.ఎం. పారా స్పెషల్ ఫోర్సెస్‌లో ఎంపికైన
తొలి, ఏకైక మహిళా ఆఫీసర్.
స్పెషల్ ఫోర్సెస్‌లో మహిళలను తీసుకోరు.
కాని దీక్ష ఆర్మీ డాక్టర్ కావడంతో అటాచ్ చేశారు.
స్పెషల్ ఫోర్సెస్‌లో చేరాక ఇతర సభ్యులతో పాటుగా
కఠినమైన కమెండో శిక్షణ తీసుకోవాల్సిందే.
అది ఆమె పూర్తి చేసింది.
'నన్ను భిన్నంగా ఉంచే పని చేస్తూ
దేశానికి సేవ చేయాలన్నదే నా లక్ష్యం' అంటోంది దీక్షా.
ఆమె శిక్షణ ఫొటోలను చూసి దేశం గర్వపడుతోందిప్పుడు.

● న్యూస్ మేకర్

డాక్టర్ ట ఫైటర్



ఆర్మీలో డాక్టర్ అంటే క్షతగాత్రులకు వైద్యం చేసే డాక్టర్లే గుర్తుకు వస్తారు. కాని ఈ డాక్టర్ వేరు. ఈ డాక్టర్ అవసరం అయితే ఏ.కె.47 ఉపయోగించగలదు. దేశద్రోహులను తుద ముట్టించగలదు. మంటల్లో దూసుకుపోగలదు. కుండపోత వానలో శతృవుతో తలపడగలదు. అదే సమయంలో తన వారికి వైద్యం చేసి భుజాల మీద మోసుకొని స్థావరానికి చేర్చగలదు. ఇండియన్ ఆర్మీకి చెందిన పారాచూట్ రెజిమెంట్‌లోని పారా స్పెషల్ ఫోర్స్‌లో నియామకమైన కెప్టెన్ దీక్షా సి.ఎం. ప్రత్యేకత ఇది.

■ కర్నాటక యోధురాలు

దీక్షా సి.ఎం.ది కర్ణాటకలోని దావణగెరె. బాల్యం నుంచి ఎన్.సి.సిలో శిక్షణ పొందింది. ఆ సమయంలో సైన్య కార్యకలాపాలు తెలుసుకుంటూ ఆర్మీలో చేరాలని, ప్రత్యేకమైన ముద్ర నిరూపించుకోవాలని భావించింది. వైద్య విద్య అభ్యసించాక 2019లో ఎస్.ఎస్.సి (షార్ట్ సర్వీస్ కమిషన్) రాసి ఆర్మీకి ఎంపికైంది. కొద్ది కాలం గోల్కొండ మిలటరీ హాస్పిటల్‌లో పని చేశాక ఆర్మీ డాక్టర్లకు తప్పనిసరి అయిన ఎం.ఓ.బి.సి (మెడికల్ ఆఫీసర్స్ బేసిక్ కోర్స్) శిక్షణ కోసం లక్నో వెళ్లింది. వైద్యం చేయడమే డాక్టర్ల పని అయినప్పటికీ ఆర్మీలో చేరాక సైన్యం తాలూకు కనీస పరిజ్ఞానం, శారీరక దారుఢ్యం, ప్రత్యేక పరిస్థితుల్లో సైనికులకు ఎటువంటి వైద్యం చేయాలి అనే విషయాల మీద ఆ కోర్స్ ఉంటుంది. అది పూర్తి చేశాక లేహ్‌లోని టంగ్‌సే మిలటరీ హాస్పిటల్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

■ మైనస్ 40 డిగ్రీల వద్ద

టంగ్‌సే మిలటరీ హాస్పిటల్‌లో పని చేయడం మహిళా ఆఫీసర్లకు చాలెంజ్. అక్కడ ఉష్ణోగ్రతలు మైనస్ 40 వరకూ పడిపోతుంటాయి. అయినా సరే తన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రశంసలు అందుకుంది దీక్ష. కాని ఆమెకు ఇతర మహిళా ఆఫీసర్లు చేరని స్థాయికి చేరాలనే కోరిక ఉండిపోయింది. పారా స్పెషల్ ఫోర్స్‌లో చేరితే ఆ స్థాయికి ఉన్న గొప్పదనం వేరు అని తెలుసుకుంది. పారా స్పెషల్ ఫోర్స్‌లో మహిళలను నేరుగా తీసుకోరు. కాని స్త్రీ/పురుష డాక్టర్లు ఆ ఫోర్స్‌లో భాగం కావచ్చు. ఇప్పటి వరకూ ఒక్క మహిళా డాక్టర్ కూడా అందుకు ముందుకు రాలేదు. కెప్టెన్ దీక్ష మొదటిసారి ప్రయత్నించింది. 2021లో పారా స్పెషల్ ఫోర్స్‌కు ఎంపికైతే నాలుగు నెలల ప్రొబెషన్ ఇచ్చారు. అంటే కఠినమైన కమెండో శిక్షణ. మగ ఆఫీసర్లతో కలిసి అన్ని రకాల యుద్ధ విద్యలను నేర్వాలి. ఇందుకు భౌతిక శక్తి చాలా కావాలి. ఆ భౌతిక శక్తిని ప్రదర్శించలేక విఫలమైంది దీక్ష. అధికారులు ఆమెను లేహ్‌కు తిరిగి పంపించేశారు.

■ రెండోసారి ప్రయత్నించి...

పారా స్పెషల్ ఫోర్స్‌లో చేరాలన్న కోరిక నెరవేరకుండా తిరిగి వచ్చిన దీక్ష మెడికల్ ఆఫీసర్‌గా విధులను కొనసాగించింది. కాని ఆమె కమాండింగ్ ఆఫీసర్‌గా ఉన్న శివేష్ సింగ్ 'నీ కలను సగంలో ముగించకు' అని ఉత్సాహపరిచాడు. అతని ప్రోత్సాహంతో రెండోసారి 2022లో పారా ఫోర్స్‌కు ఎంపికై ప్రొబెషన్‌కు వెళ్లింది. ఈసారి ఆమె అద్భుతమైన శక్తిని, బలాన్ని, ధైర్యాన్ని, దీక్షను ప్రదర్శించింది. ట్రయినింగ్‌లో కాలికి గాయమైనా అధికారులు ఆమె పట్టుదలను చూసి పారా స్పెషల్‌ఫోర్స్‌కు ఎంపిక చేశారు. అలా భారతదేశంలో ఈ స్థాయికి వచ్చిన తొలి మహిళగా రికార్డు సాధించింది.

■ ఎన్నో సవాళ్లు

'పారా స్పెషల్ ఫోర్స్ విధులు చాలా అనూహ్యంగా ఉంటాయి. ఒక్కోసారి యుద్ధ క్షేత్రానికి వెళ్లాలి. మరోసారి గెరిల్లా దళాలతో తలపడాలి. భూకంపాలలో చిక్కుకున్నవారిని కాపాడాలి. జనావాసాలలో నక్కిన టెర్రరిస్టులను హతమార్చాలి. ఈ పనుల్లో ఆర్మీకి గాయాలవక తప్పదు. వైద్య సేవలు అందించక తప్పదు. అందుకని ఒకవైపు నేను పోరాటం చేస్తూనే మరోవైపు గాయపడకుండా, జబ్బు పడకుండా కాపాడుకోవాలి. నేను ఆరోగ్యంగా ఉంటేనే నా జట్టుకు వైద్యం చేయగలను' అంటుంది దీక్ష.

టర్కీలో వచ్చిన భూకంప బాధితులను కాపాడడానికి వెళ్లిన బృందంలో దీక్ష కూడా ఉంది. 'ఇండియన్ ఆర్మీలో స్త్రీలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ ఎలాంటి వివక్ష లేదు. నేటి యువతులు వారి సంశయాలను విడిచి ధైర్యంగా ముందుకొస్తే మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చు' అంటుంది దీక్ష.

బ్యూటిప్



తాజా కొబ్బరి పాలతో ముఖాన్ని మర్దన చేస్తే చర్మం తెల్లబడుతుంది. పెదవులు నల్లగా ఉన్నా పొడిబారి ఉన్నా కొబ్బరి పాలతో మర్దన చేస్తే నలుపు వదులుతుంది, పెదవులు మృదుత్వాన్ని సంతరించుకుంటాయి.

అనుకుంటాంగానీ...
సుఖంలోనూ కష్టం ఉంటుంది.
'అయ్యో! ఏమీ చెయ్యలేకపోతున్నానే' అని.
కష్టంలోనూ బోలెడు సుఖం ఉంటుంది.
'నేను కష్టపడుతున్నాను.
ఇప్పుడు ఎంత సుఖంగా ఉందో'
ఢిల్లీ అమ్మాయి తాప్సీ ఉపాధ్యాయ్‌ను చూస్తే
'నిజమే సుమీ!' అనిపిస్తుంది...

వైరల్



పానీపూరి వాలీ, బీటెక్





'నా చదువుకు తగ్గ ఉద్యోగం దొరికితేగానీ ఉద్యోగం చేయను' అనుకునే వాళ్లు కొందరు.

'చిన్న ఉద్యోగం అయినా సరే ఖాళీగా మాత్రం కూర్చోను' అనుకునేవాళ్లు కొందరు.

తాప్సీ ఉపాధ్యాయ్ రెండో కోవకు చెందిన వ్యక్తి. బీటెక్ చేసిన తాప్సీ ఢిల్లీ తిలక్‌నగర్‌లో ఉన్న మెట్రోస్టేషన్‌కు సమీపంలో పానీపూరి స్టాల్ నడుపుతుంది.

21 సంవత్సరాల తాప్సీ తనను తాను 'బీటెక్ పానీపూరి వాలీ'గా పిలుచుకుంటుంది.

స్టాల్ దగ్గర ఆమెకు రోజూ తప్పనిసరిగా ఎదురయ్యే ప్రశ్న...

'బీటెక్ చేసి పానీపూరి స్టాల్ నడపడం ఏమిటి?'

అయితే వారి ప్రశ్నకు ప్రశ్నతోనే జవాబు ఇస్తుంది తాప్సీ.

'బీటెక్ చేసిన వాళ్లు పానీపూరి స్టాల్ నడపవద్దని ఎక్కడైనా రాసి పెట్టి ఉందా?'

ఇది ఇలా ఉండగా ఒక ఫుడ్‌బ్లాగర్ తాప్సీ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఈ వీడియోలో తాప్సీ దర్జాగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మీద వస్తున్న దృశ్యం, పానీపూరి అమ్ముతున్న దృశ్యాలు ఉంటాయి. ఈ వీడియోకు అయిదు మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.

తాప్సీ వీడియో రకరకాల కామెంట్స్‌తో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

'ఇతరులు మన గురించి ఏమనుకుంటారో అంటూ జీవితాంతం ఇతరుల గురించి ఆలోచిస్తూ తమను తాము మరచిపోయి, ఏమీ సాధించకుండా మిగిలిపోయేవారు ఎందరో ఉన్నారు. ఇలాంటి వాళ్లకు తాప్సీ కనువిప్పు కలిగిస్తుంది. కష్టాన్ని ఎప్పుడూ గౌరవించాల్సిందే'

'ఆర్థిక స్వాతంత్ర్యం గురించి అక్షరాల్లో కాదు దృశ్యరూపంలో చూసినట్లు ఉంది. తాప్సీ తనకు తానే బాస్. తనకు తానే ఉద్యోగి'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి. ఆకాశానికెత్తే కామెంట్స్ మాత్రమే కాదు...

'బీటెక్ చేసిన వాళ్లు టెక్నాలజీ, కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టకుండా ఈ పనిచేయడం ఏమిటో! చదివిన చదువు వృథా అయిపోవడం లేదా!!' అంటూ సన్నాయి నొక్కులు నొక్కిన వారు కూడా ఉన్నారు.

అయితే దీనికి ఒకరు ఇలా సమాధానం ఇచ్చారు...'మీరు చెప్పింది నిజమే కావచ్చుగానీ, ఏ పని చేయకుండా ఇంట్లో ఖాళీగా కూర్చున్నంత మాత్రాన కొత్త ఆవిష్కరణలు జరుగుతాయా?'

సరే, వీటి సంగతి పక్కన పెడితే ఎంటర్‌ప్రెన్యూర్ కావాలనేది తాప్సీ ఉపాధ్యాయ్ కల. అందులో పానీపూరి స్టాల్ తొలి అడుగు మాత్రమే.

* అస్తిత్వ

కళే ఉపాధి అయింది

ఒక చిన్న గది నుంచి మధుబని పెయింటింగ్ వేయడం మొదలుపెట్టింది ఆమె. గది నుంచి పట్టణ వీధులు దాటుకుంటూ పెయింటింగ్స్‌తో అలంకరించిన చీరలు, డ్రెస్సులు, బ్యాగులకు దేశవ్యాప్తంగా డిమాండ్ తీసుకువచ్చింది. ఆమె తపనకు గుర్తింపు లభించింది. ఆమె కృషికి మెచ్చుకోలుగా ఎన్నో అవార్డులు వెదుక్కుంటూ వచ్చాయి. ఆమె పేరు ఉషా ఝా. బీహార్‌వాసి. ప్రముఖ మధుబని కళాకారిణులలో ఒకరిగా పేరుతెచ్చుకున్న ఆమె కృషి, పట్టుదల ఆమె పనితనం ద్వారానే మన కళ్లకు కడతాయి.

"భర్త, పిల్లలు, సపోర్టునిచ్చే కుటుంబం ఉంది. కానీ ఇంకా ఏదో వెలితిగానే ఉండేది. ఏదో చేయాలనే తపన నన్ను ఇంత దూరం తీసుకువచ్చింది" అని చెప్పే ఈ కళాకారిణి నేడు 300 మందికి పైగా మహిళా కళాకారులు ఆమెతో వారితో చేరారు. తమ జీవితాలనూ మెరుగుపరుచుకుంటున్నారు. ఆమె అంతరంగం మనకు ఓ పాఠం.



ఉషా ఝా

"చిన్న వయసులోనే పెళ్లయినా చదువు మాత్రం కొనసాగించాను. బీహార్‌లోని భద్రేశ్వర్ అనే చిన్న గ్రామంలో పుట్టి పెరిగాను. చిన్న పట్టణాల్లో అమ్మాయిలకు చిన్న వయసులోనే జరుగుతాయి. దాంతో 10వ తరగతి పాస్ అయిన వెంటనే మా తల్లిదండ్రులు నాకు పెళ్లి చేశారు. ఆ తర్వాత భర్తతో కలిసి పట్నం వచ్చాను. మనసులో ఎన్నో కలలు చెదిరిపోయాయి. ఇంక చేసేదేముంది అని లోలోపల భయపడ్డాను. చాలా మంది అమ్మాయిలకు పెళ్లి తర్వాత తదుపరి చదువులు ఆగిపోతాయి. కానీ అదృష్టవశాత్తూ, మా అత్తమామల ఇంట్లో అందరూ నా చదువు కొనసాగించాలనే నా నిర్ణయాన్ని ఎవరూ వ్యతిరేకించలేదు. అలాగని, ఎవరూ సపోర్ట్ చేయలేదు. ప్రైవేట్ ట్యూషన్, కరస్పాండెన్స్ ద్వారా మాస్టర్స్ డిగ్రీ చేశాను.

చిన్ననాటి నుంచి వస్తున్న కళ

చదువుతో పాటు నాకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలనే తపన ఉండేది. పిల్లలు పుట్టడం, వారు పెద్దవడం, కుటుంబ పనులతో తీరికలేని రోజులు ఒక్కొక్కటి దాటుకుంటూ వచ్చేశాను. పిల్లలు పెద్దయ్యేనాటికి నాకు చాలా ఖాళీ సమయం ఉండేది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకొని నాదైన ముద్ర వేయాలని నిర్ణయించుకున్నాను. 'ఏం చెయ్యాలి' అనేది ప్రతీక్షణం ఆలోచన. మిథిలా కళలో నా చేతి కళను ప్రయత్నించడం ప్రారంభించాను. భవిష్యత్తులో ఇదే నా గుర్తింపుగా మారుతుందని అప్పుడు నాకు తెలియదు. కుటుంబంలో ఎవరిఎవరి వైనా వివాహాలు జరిగేటప్పుడు కోహ్బర్ (ఆవు పేడ, ఎరుపు రంగుతో కలిపి వేసే పెయింటింగ్) వేసేదాన్ని. ఇది మిథిలా కళ. ఆ రోజుల్లో మేం కోహ్బర్ నుండి వేడుకను ప్రారంభించేవాళ్లం. మొదట్లో గోడలపై మధుబని పెయింటింగ్స్ వేయడం మొదలు పెట్టాను. తర్వాత చీరలు, ఇతర క్లాత్స్, కాగితంపై పెయింటింగ్ కూడా వేశా. ఆ రోజుల్లో గోడపై పెయింటింగ్ చేస్తున్నప్పుడు డబ్బు సంపాదించడానికి, కుటుంబాన్ని పోషించడానికి సాధనం అవుతుందనుకోలేదు. కాలక్రమేణా అది ఉపాధిగా మారింది.

కొద్ది మందితో ప్రారంభమై..

1991లో పాట్నాలోని బోరింగ్ రోడ్‌లోని మా ఇంటి నుంచి 'పెటల్స్ క్రాఫ్ట్' ప్రారంభించాను. మొదట్లో ఒక గదిలో పెయింటింగ్ వేయడం మొదలుపెట్టాను. దీని తర్వాత పని బాగా పెరిగి, ఇప్పుడు ఆర్టిస్టులతో ఇంటింటా పెయింటింగ్ వర్క్ చేయిస్తున్నాను. నా కస్టమర్ల కోసం మధుబని కళతో అలంకరించిన చీరలు, బ్యాగులు, స్టోల్స్‌ని డిజైన్ చేస్తాను. ఇతర గృహోపకరణాలు వంటి 50 రకాల ఉత్పత్తులపై మధుబని పెయింటింగ్ వేస్తుంటాను. ప్రభుత్వం నుండి అనేక మంది పర్యాటకులు, ప్రపంచం నలుమూలల నుండి ప్రసిద్ధ వ్యక్తులు మా కస్టమర్లు అయ్యారు. మొదట్లో ఇద్దరు కళాకారులు నాతో పని చేసేవాళ్లు. ఈ రోజు నాతో పని చేస్తున్న 300 మందికి పైగా మహిళలు జీవనోపాధిని పొందుతున్నారు.



మధుబని పెయింటింగ్ చేస్తున్న మహిళలు

సొంత వ్యాపారాలు


2008లో గ్రామాల్లో నేను చేస్తున్న పనులను అధికారికం చేయాలని భావించి 'మిథిలా వికాస కేంద్రం' ఏర్పాటు చేసి, దాని ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాం. మహిళలు అక్షరాస్యులైతే తమ పిల్లలకు మంచి చదువులు చెప్పించగలుగుతారు. అలాగే మహిళా కళాకారులకు వారి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తాం. నా దగ్గర మధుబని ఆర్ట్‌లో శిక్షణ పొందిన చాలా మంది మహిళలు సొంతంగా వ్యాపారాలు ప్రారంభించుకున్నారు. నేను మిథిలా పెయింటింగ్స్ అమ్మడం ప్రారంభించినప్పుడు ఆన్‌లైన్‌లో అమ్మే ప్లాట్‌ఫారమ్‌లు లేవు. నేను నా పెయింటింగ్‌లను అమ్మడానికి ఇంటింటికీ, నగరానికి, విదేశాలకు కూడా వెళ్ళాను. అక్కడ పెయింటింగ్ స్టాల్ ఏర్పాటు చేసేదాన్ని.

రాష్ట్రపతి భవన్‌లో

నేను నా ఉత్పత్తులను ఎప్పుడూ మార్కెట్ చేయలేదు కానీ నా పనిని ఇష్టపడే వ్యక్తులు నా పెయింటింగ్‌లను కొనుగోలు చేసి, వాటిని మెచ్చుకునేవారు. ఈ ప్రశంసల ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతోంది. ఇప్పుడు సాంకేతికత, ఆన్‌లైన్ అమ్మకం నా పనిని చాలా సులభతరం చేశాయి. ఇప్పుడు వాట్సాప్‌లోనూ ఆర్డర్లు తీసుకుంటున్నాం. మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ బీహార్‌లో పర్యటించినప్పుడు ఆమెకు 14 అడుగుల మధుబని పెయింటింగ్‌ను బహుమతిగా ఇచ్చాను. నేటికీ ఆ పెయింటింగ్ రాష్ట్రపతి భవన్‌లో దానిని చూడచ్చు.

మహిళా ఉద్యోగ్ సంఘ్ కార్యదర్శి

కొన్నేళ్లుగా పాట్నాలోని ఒక కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పిల్లలకు బోధించాను. 17 సంవత్సరాలు బీహార్ మహిళా ఉద్యోగ్ సంఘ్‌కి కార్యదర్శిగా ఉన్నాను. తొలినాళ్లలో ఆర్ట్ ట్రెనింగ్ ఇచ్చిన చాలా మంది మహిళలు ఇప్పుడు కొత్త తరం మహిళలకు మధుబని ఆర్ట్ ట్రెనింగ్ ఇస్తున్నారు. ఇక్కడితో ఆగిపోకూడదనుకుంటున్నా.. ఇంకా ముందుకు వెళితే బీహార్ నేపాల్ సరిహద్దుల్లోని గ్రామాలు, పట్టణాల్లో మరిన్ని శిక్షణా కేంద్రాలను ప్రారంభించాలనుకుంటున్నాను. నేటికీ ప్రభుత్వం రాని చోట్ల అనేకం ఉన్నాయి. మరింత మంది మహిళలు నాతో చేరి స్వావలంబన కావాలని కోరుకుంటున్నాను. నా విజయాలకు ఉమెన్స్ ఎకనామిక్ ఫోరమ్ నుంచి అవార్డు కూడా అందుకున్నాను. నేను చేయగలిగినప్పుడు మీరూ చేయగలరనేది నా నమ్మకం" అని వివరించే ఈ కళాకారిణి ప్రయాణం ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిదాయకం.


'సంక్షేమ పథకాల అమలే
సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 349

శనివారం 11-3-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఒత్తిడికి దూరంగా ఉండాలంటే..?

ఈ రోజుల్లో చాలా మంది ఒత్తిడికి గురవుతున్నారు. దీనికి కారణం సరైన జీవనశైలి, మంచి ఆహారపు అలవాట్లు లేకపోవడమే. డైట్ నుంచి కొన్ని ఆహారాలని మినహాయించడం వల్ల డిప్రెషన్ నుంచి బయటపడవచ్చు. వాటి గురించి వివరంగా తెలుసుకుందాం...

చక్కెర

మీరు ఎప్పుడూ ఒత్తిడికి లోనవుతున్నట్లయితే ముందుగా ఆహారం నుంచి చక్కెరను మినహాయించండి. ఎందుకంటే తీపి పదార్థాలు మీ శక్తి స్థాయిని ప్రభావితం చేస్తాయి. శరీర అసమతుల్యతను కలిగిస్తాయి. దీనివల్ల మనిషిలో టెన్షన్ పెరగడం మొదలవుతుంది. అందుకే డిప్రెషన్‌తో బాధపడేవారు చక్కెరను ఎక్కువగా తినకూడదు.

ఆల్కహాల్

ఆల్కహాల్ కాలేయానికి మాత్రమే కాకుండా మొత్తం ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. ఆల్కహాల్ మెదడులోని సెరోటోనిన్ చర్యను మారుస్తుంది. ఇది ఆందోళనను పెంచుతుంది. అందుకే మద్యం తాగకూడదు. ఆల్కహాల్ తీసుకోవడం వల్ల ఆందోళన పెరుగుతుంది.

కెఫిన్

కెఫిన్ కలిగిన పానీయాలు అధికంగా తీసుకోవడం వల్ల ఆందోళన, ఒత్తిడి, నిద్రలేమికి కారణమవుతాయి. కెఫిన్ అనేది కాఫీలోనే కాదు, టీలో కూడా ఉంటుంది. అందువల్ల కాఫీ, టీ, చాక్లెట్లు, కొన్ని రకాల శీతల పానీయాలలో కూడా కెఫిన్ ఉంటుంది కాబట్టి వీటిని ఎక్కువగా తీసుకోకూడదు. ఎందుకంటే వీటివల్ల డిప్రెషన్‌కు గురవుతారు.

ఉప్పు

ఉప్పు మానసిక స్థితిని పాడు చేస్తుంది. మీరు అలసిపోయేలా చేస్తుంది. అలాగని ఉప్పు తీసుకోవడాన్ని పూర్తిగా మానేయకూడదు. తగ్గించి తీసుకుంటే ఉత్తమం. కొందరికి మజ్జిగన్నంలో ఉప్పు తప్పనిసరి. ప్రాసెస్డ్ ఫుడ్ అంటే నిల్వ పచ్చళ్లు, అప్పడాలు, వడియాలలో ఉప్పు ఎక్కువగా ఉంటుంది. అందువల్ల అలాంటి వాటికి దూరంగా ఉండటం మంచిది.

ఆరోగ్య రసాలు

వేసవి వచ్చేసింది. చలికాలంలో లాగే వేసవిలో కూడా చర్మ సంరక్షణ చాలా అవసరం. ఎందుకంటే, వేసవిలో చర్మం ట్యానింగ్, నిగారింపు కోల్పోవడం, పొడిగా మారడం వంటి సమస్యలు ఎదుర్కొంటుంది. ఈ సమస్యల్నించి ఉపశమనం పొందాలంటే రోజూ ఈ డ్రింక్స్ తప్పనిసరిగా తీసుకోవల్సిందే. వీటివల్ల చర్మకాంతి పెరిగి యౌవనంగా కనిపిస్తారు.



దానిమ్మ జ్యూస్

శరీరానికి కావలసిన అన్ని రకాల విటమిన్లు సమృద్ధిగా ఉండేది దానిమ్మలోనే. అందువల్ల రోజూ దానిమ్మ జ్యూస్ సేవించడం ద్వారా చర్మంలో నిగారింపు వస్తుంది. ముఖంలో కాంతి వస్తుంది. షుగర్ వ్యాధిగ్రస్థులు కూడా దానిమ్మ జ్యూస్ తీసుకోవచ్చు. అయితే అందులో రుచికి పంచదార కలుపుకోకూడదు.



ఆరెంజ్ జ్యూస్

చర్మకాంతిని పెంచే విటమిన్ సి సమృద్ధిగా ఉండేవాటిలో నారింజ లేదా కమలా పండ్లు ముందుంటాయి. నారింజ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదం చేస్తుంది కాబట్టి క్రమం తప్పకుండా ఆరంజ్ జ్యూస్ తీసుకుంటే మంచి ఫలితాలుంటాయి.



టొమాటో జ్యూస్

టొమాటోలో ఎన్నో రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి వ్యాధి నిరోధకత శక్తిని కలిగిస్తాయి. రోజూ టొమాటో జ్యూస్ తీసుకోవడం వల్ల చర్మం యౌవనంగా, కాంతిమంతంగా ఉంటుంది. టొమాటోను సలాడ్ రూపంలో కూడా తీసుకోవచ్చు.



బీట్ రూట్ జ్యూస్

ఆరోగ్యానికి అద్భుత ఔషధం బీట్ రూట్ జ్యూస్. ప్రతిరోజూ బీట్‌రూట్ జ్యూస్ తీసుకోవడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.



గ్రీన్ టీ

కేవలం బరువు తగ్గించేందుకే కాకుండా చర్మ సంరక్షణకు అద్భుతంగా పనిచేస్తుంది గ్రీన్ టీ. రోజుకు రెండు సార్లు గ్రీన్ టీ తీసుకుంటే మంచి ఫలితాలుంటాయి





మీకు తెలుసా

- రోజూ ఉదయాన్నే రెండు లేదా మూడు టొమాటోలను తింటే చాలా మంచిది. టొమాటోలలో ఉన్న విటమిన్ కె, కాల్షియం, లైకోపీన్ ఎముకలను బలోపేతం చేయడానికి, వాటి పనితనాన్ని మెరుగుపరచడానికి ఉపయోగపడతాయి.
- బరువు తగ్గాలనుకునేవారు రోజూ ఉదయం ఖాళీ కడుపుతో రెండు గ్లాసుల టమాటా రసం తాగాలి. ఇలా చేయడం వల్ల బరువు త్వరగా తగ్గి, కొద్ది రోజుల్లోనే స్థూలకాయన్ని దూరం చేసుకోవచ్చు.
- టమోటాలో బీటా కెరోటిన్ అధిక మోతాదులో ఉంటుంది కనక టమోటాను తీసుకుంటే.. శరీరానికి కావలసిన ఎనర్జీ అందుతుంది. దాంతో చర్మం, జుట్టు, అధిక బరువు సమస్య కూడా రాదు.
- టమోటాలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్స్ ఖనిజాలు అధికం. ఇవి క్యాన్సర్ వ్యాధి నుండి ఉపశమనం కలిగేలా చేస్తాయి. టమోటా తీసుకుంటే.. శరీరంలోని 80 శాతం చెడు కొలెస్ట్రాల్ పోతుంది.
- చాలామందికి గుండె వ్యాధుల కారణంగా రక్తపోటు వస్తూ ఉంటుంది. అందుకు ఏం చేయాలంటే.. టమోటాలు తీసుకోవాలి. టమోటాలోని పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది.



పిల్లలకు తగిన సమయం కేటాయిస్తున్నారా?

నేటి బిజీ లైఫ్‌లో గజిబిజి సమయాలతో పిల్లలు చెప్పే కబుర్లు వినగలిగే స్థిమితం కోల్పోతున్నారు తల్లిదండ్రులు. అయితే దానివల్ల ఎన్నో అనర్థాలు తలెత్తే ప్రమాదం ఉంది. ఎందుకంటే, పిల్లలు సహజంగానే తల్లిదండ్రులతో ప్రతి విషయాన్నీ పంచుకోవాలని చూస్తారు. చాలాసార్లు తల్లిదండ్రులు ఆ అవకాశాన్ని పిల్లలకు ఇవ్వరు. నిర్లక్ష్యం చేస్తారు. దాంతో పిల్లల్లో మొండితనం పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల అసలు పిల్లలు ఏం చెప్పాలనుకుంటున్నారు అనేది తెలుసుకోవడం అవసరం. వాళ్ళు చెప్పే చిన్న చిన్న ఫిర్యాదులు వినండి. వారికి సమయాన్ని ఇచ్చి చూడండి.

పిల్లల మీద అరవకండి. మాట వినడం లేదని బలవంతం చేయకండి. ఎందుకంటే పిల్లల మీద అరవడం వల్ల వాళ్ళు ఆందోళకు గురవుతారు. దీనితో దూకుడుగా మారి, మొండిగా ప్రవర్తిస్తారు. వాళ్ళతో ప్రశాంతంగా... నెమ్మదిగా మాట్లాడాలి. పదేపదే పిల్లలకు నువ్వు క్రమశిక్షణతో ఉండాలని, నేను చెప్పినట్లు వినాలి అంటూ బెదిరింపు ధోరణితో చెప్పటం వల్ల మరింత మొండిగా మారే అవకాశాలున్నాయి. అందువల్ల ఓపికగా, నేర్పుగా వారిని దారిలోకి తెచ్చుకోవాలి. అప్పుడప్పుడు కథలు చెప్పడం, వారికి నచ్చే మంచి సినిమాలు చూపించడం లేదా పార్కులకు తీసుకెళ్లడం వంటి వాటివల్ల వారు మన దారిలోకి వస్తారని గుర్తించాలి.

హెల్త్ టిప్స్



- కప్పు నీళ్ళల్లో గుప్పెడు తులసి ఆకులు, చెంచా మిరియాల పొడి వేసి బాగా మరిగించి అందులో కాస్తంత తేనె లేదా పంచదార కలిపి వేడిగా తాగితే జలుబు, దగ్గు తగ్గుతాయి.
- వేపాకులను మజ్జిగలో మెత్తగా రుబ్బి ఆ పేస్టును కాలిన గాయాలపై రాస్తే ఉపశమనంగా ఉంటుంది.
- శరీరం పై కాలిన చోట పాలమీగడ రాస్తే బాధ తగ్గటమే కాదు, శరీరం రంగు కూడా మారుతుంది.
- మూత్ర విసర్జనలో బాధగా లేదా మంటగా ఉంటే క్యాబేజీని తినకూడదు

సినిమా


● దీపికా పదుకోన్ ● జాన్వీ కపూర్

ఈ గ్లామర్ ముంబై ఫ్లేవర్

తెలుగు తెరపై ముంబై హీరోయిన్లు మెరవడం అనేది కొత్తేం కాదు. ఈ ముంబై గ్లామర్ ఫ్లేవర్ ఈ ఏడాది బాగానే కనిపిస్తోంది. మరి.. బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ టాలీవుడ్ స్క్రీన్‌పై మెరవనున్న ఆ కథానాయికలు చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

ప్రాజెక్ట్ కె పిలిచింది

బాలీవుడ్ టాప్ హీరోయిన్స్‌లో ఒకరైన దీపికా పదుకోన్ ఇండస్ట్రీకి వచ్చిన పదిహేనేళ్ల తర్వాత తొలి తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆమెను టాలీవుడ్‌కు పిలిచిన కథ 'ప్రాజెక్ట్ కె'. ఈ సినిమాలో దీపికా పాత్రకు యాక్షన్ సీన్స్ కూడా ఉంటాయన్నది ఫిల్మ్‌నగర్ సమాచారం. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ మూవీకి నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. యాభై శాతానికి పైగా ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ సినిమాను ముందు ఈ ఏడాది దసరాకు రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 12న రిలీజ్ చేయనున్నట్లు ఇటీవల అధికారికంగా ప్రకటించారు. ఈ సంగతి ఇలా ఉంచితే... ఈ నెల 12న లాస్ ఏంజిల్స్‌లో జరగనున్న ఆస్కార్ అవార్డుల వేడుకలో దీపికా పదుకోన్ ఓ ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్న సంగతి తెలిసిందే. ఈ వేడుకలో పాల్గొనడానికి శుక్రవారం దీపికా ముంబై నుంచి లాస్ ఏంజిల్స్ ప్రయాణమయ్యారు.

జాన్వీ ఎంట్రీ షురూ

తెలుగు ప్రేక్షకులకు దివంగత ప్రముఖ నటి శ్రీదేవితో ప్రత్యేకమైన ఎమోషనల్ బాండింగ్ ఉంటుందనడంలో సందేహం లేదు. తెలుగు ప్రేక్షకుల నుంచి అంత గొప్ప ప్రేమను పొందారామె. మరి.. అలాంటి శ్రీదేవి కుమార్తె అయిన జాన్వీ కపూర్ (ఇద్దరు కుమార్తెలు జాన్వీ కపూర్, చిన్న కుమార్తె ఖుషీ కపూర్) హీరోయిన్‌గా కెరీర్‌ను ఆరంభించినప్పుడు తెలుగు ప్రేక్షకులు ఆమె రాక కోసం ఎదురు చూడకుండా ఉంటారా? ఆ ఎదురు చూపుల నిరీక్షణ ఐదేళ్లకు ఫలించింది. 2018లో వచ్చిన హిందీ చిత్రం 'ధడక్'తో హీరోయిన్‌గా పరిచయమైన జాన్వీ కపూర్ ఐదేళ్ల తర్వాత తొలి తెలుగు సినిమాకు సైన్ చేశారు. 'జనతా గ్యారేజ్' చిత్రం తర్వాత ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం ఈ నెల 18న జరుగుతుందని, నెలాఖర్లో షూటింగ్‌ను ఆరంభించాలనుకుంటున్నారని సమాచారం. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఆల్రెడీ ప్రకటించింది.

ఢిల్లీ టు హైదరాబాద్

ఒకే సినిమాతో ఇద్దరు ఢిల్లీ బ్యూటీలు తెలుగుకు వస్తున్నారు. టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా రవితేజ టైటిల్ రోల్‌లో 'టైగర్ నాగేశ్వరరావు' సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు నూపుర్ సనన్. అలాగే మరో ఢిల్లీ బ్యూటీ గాయత్రీ భరద్వాజ్ కూడా ఇదే సినిమాతో టాలీవుడ్‌కు ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. తెలుగులో మహేశ్‌బాబు 'వన్: నేనొక్కడినే', నాగచైతన్య 'దోచేయ్' చిత్రాల్లో నటించిన కృతీ సనన్ తాజాగా ప్రభాస్ సరసన 'ఆదిపురుష్'లో హీరోయిన్‌గా నటించారు. కృతీ చెల్లెలే నూపుర్.

ప్రపంచ సుందరికి స్వాగతం

ఐదేళ్ల క్రితం.. అంటే 2017లో మిస్ వరల్డ్‌గా నిలిచి అందరి దృష్టినీ ఆకర్షించారు మానుషీ చిల్లర్. గతంలో మిస్ వరల్డ్‌గా నిలిచి, సినిమాల్లోకి వచ్చిన లారా దత్తా, ఐశ్వర్యా రాయ్, సుస్మితా సేన్, ప్రియాంకా చోప్రా తదితరుల మాదిరిగానే మానుషీ చిల్లర్ కూడా నటనను ఓ వృత్తిగా తీసుకున్నారు. హిందీలో అక్షయ్ కుమార్ నటించిన 'సామ్రాట్ పృథ్వీరాజ్' హీరోయిన్‌గా మానుషీ చిల్లర్‌కు తొలి సినిమా. ఇక ఈ బ్యూటీ రీసెంట్‌గా తెలుగు, హిందీ భాషల్లో ఏక కాలంలో రూపొందుతున్న ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వరుణ్ తేజ్ హీరోగా హిందీకి పరిచయం అవుతున్న ఈ సినిమాతో శక్తి ప్రతాప్ సింగ్ దర్శకుడిగా తొలిసారి మెగాఫోన్ పట్టారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవలే మొదలైంది. ఈ చిత్రంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా వరుణ్ తేజ్, రాడార్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్‌గా మానుషీ చిల్లర్ నటిస్తున్నారు.

మోడల్ టు యాక్టర్

మోడల్‌గా కెరీర్ ఆరంభించి, ఆ తర్వాత హీరోయిన్‌గా సెటిలైన బాలీవుడ్ అమ్మాయిల జాబితా చాలానే ఉంది. ఈ లిస్ట్‌లో తాజాగా సాక్షీ వైద్య చేరారు. అఖిల్ హీరోగా నటిస్తున్న 'ఏజెంట్' సినిమాతో సాక్షీ వైద్య హీరోయిన్‌గా తెలుగుకు పరిచయం అవుతున్నారు. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్నట్లుగా తెలిసింది. అఖిల్, సాక్షీలపై ఓ పాటను చిత్రీకరిస్తున్నారట. ఈ చిత్రం ఏప్రిల్ 28న విడుదల కానుంది.

వీరితోపాటు మరి కొంతమంది హిందీ తారలు తెలుగు తెరకు పరిచయం కానున్నారు.


● నూపుర్ ● మానుషీ చిల్లర్ ● సాక్షీ వైద్య



ఆ క్షణం కోసం ఎదురు చూస్తున్నా! - ఎన్టీఆర్

'ఆర్ఆర్ఆర్' చిత్రబృందం ప్రస్తుతం అమెరికాలో సందడి చేస్తోంది. ఆస్కార్ అవార్డుల వేడుక ఈ నెల 12న (భారత కాలమానం ప్రకారం 13) జరగనుంది. 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు..' పాట బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో నామినేట్ అయిన సంగతి తెలిసిందే. దీంతో అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో ఇంటర్వ్యూలు, టీవీ షోలు, ప్రమోషన్స్‌తో బిజీబిజీగా గడుపుతోంది 'ఆర్ఆర్ఆర్' టీమ్. మంగళవారం లాస్ ఏంజిల్స్ చేరుకున్న ఎన్టీఆర్ ఓ టాక్ షోలో రెడ్ కార్పెట్‌పై నడవడం గురించి మాట్లాడుతూ– ''రెడ్ కార్పెట్‌పై నడవనున్నది ఎన్టీఆర్ లేదా కొమురం భీమ్ ('ఆర్ఆర్ఆర్'లో ఎన్టీఆర్ పాత్ర) అని నేను అనుకోను. అలాగే రాజమౌళి, రామ్ చరణ్ అని కూడా అనుకోవడం లేదు. రెడ్ కార్పెట్‌పై మేము నడిచేటప్పుడు మొత్తం భారతదేశాన్ని మా హృదయాల్లో మోయనున్నాం.. ఆ క్షణం కోసం ఎదురుచూస్తున్నాను. ఆస్కార్ వేదికపై 'నాటు నాటు..' పాటను లైవ్‌లో చూడాలని ఆసక్తిగా ఉన్నాను. ఆ పాటకు నేను, రామ్ చరణ్ డ్యాన్స్ వేస్తామని కచ్చితంగా చెప్పలేను. ఎందుకంటే మాకు రిహార్సల్స్ చేసే టైమ్ లేదు. అయితే ఆ పాట ఎప్పుడు విన్నా నా కాళ్లు డ్యాన్స్ చేస్తుంటాయి'' అన్నారు.

ఉగాదికి భయపెట్టనున్న కాజల్

హీరోయిన్ కాజల్ అగర్వాల్ ఈ ఉగాదికి ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమయ్యారు. కాజల్ అగర్వాల్, రాధికా శరత్ కుమార్, యోగిబాబు ప్రధాన పాత్రల్లో కళ్యాణ్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ చిత్రం 'ఘోస్టీ'. ఈ చిత్రం గంగ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై తెలుగులో విడుదల కానుంది. ''ఘోస్టీ'లో పోలీస్‌గా, సినిమా హీరోయిన్‌గా కాజల్ ద్విపాత్రాభినయం చేశారు. ఆత్మలకు, కాజల్ పాత్రలకు సంబంధం ఏంటి? అనేది ఆసక్తిగా ఉంటుంది. ప్రేక్షకులను నవ్వించడంతో పాటు ఉత్కంఠకు గురి చేసే చిత్రమిది. ఉగాదికి తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


● కాజల్

మధ్య తరగతి కుటుంబ కథ


● రాహుల్, నవ్య స్వామి


''ప్రేక్షకులు చిన్న చిత్రాలను ఆదరించాలి. ముఖ్యంగా 'ఇంటింటి రామాయణం' లాంటి మంచి చిత్రాలను ప్రోత్సహించాలి'' అన్నారు డైరెక్టర్ మారుతి. వీకే నరేష్, రాహుల్ రామకృష్ణ, నవ్య స్వామి, సురభి ప్రభావతి, గంగవ్వ ప్రధాన పాత్రల్లో సురేష్ నరెడ్ల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఇంటింటి రామాయణం'. ఎస్. నాగవంశీ, మారుతి టీమ్ సమర్పణలో వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ యిన్నమూరి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. నాగవంశీ మాట్లాడుతూ– ''ఇంటింటి రామాయణం'ని ముందు ఓటీటీ కోసమే ప్రారంభించాం. అవుట్‌పుట్ చూశాక థియేటర్‌లో రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''గ్రామీణ నేపథ్యంలో మధ్యతరగతి కుటుంబ కథగా తెరకెక్కిన చిత్రం ఇది'' అన్నారు సురేష్ నరెడ్ల. ''మాకు మద్దతుగా నిలిచిన నాగవంశీ, మారుతిలకు థ్యాంక్స్'' అన్నారు వెంకట్, గోపీచంద్.

● నరేశ్, పవిత్ర


సినిమా పెళ్లి?

'ఒక పవిత్ర బంధం.. రెండు మనసులు.. మూడు ముళ్లు.. ఏడడుగులు.. మీ ఆశీస్సులు కోరుకుంటూ.. ఇట్లు పవిత్రానరేశ్' అంటూ ట్విట్టర్‌లో ఓ వీడియోను షేర్ చేశారు వీకే నరేశ్. ఈ పెళ్లి వీడియో ఓ సినిమాకి సంబంధించినది అనే ప్రచారం సాగుతోంది. కాగా 'ఇంటింటి రామాయణం' సినిమా ప్రెస్‌మీట్‌లో వీకే నరేశ్‌ని పెళ్లి వీడియో గురించి ప్రశ్నించగా.. ''అందరికీ వ్యక్తిగత జీవితం ఉంటుంది. నాకూ రీల్ లైఫ్, రియల్ లైఫ్ ఉన్నాయి. ఈ అంశంపై (పెళ్లి) త్వరలో మాట్లాడతాను. అప్పటిదాకా ఓపిక పట్టండి'' అన్నారు.

భీష్మ పర్వం షురూ


● చేతన్ శీను

'రాజుగారి గది, మంత్ర 2, విద్యార్థి, జెంటిల్ మేన్ 2' వంటి చిత్రాల్లో నటించిన చేతన్ శీను హీరోగా 'భీష్మ పర్వం' సినిమా రూపొందుతోంది. ప్రేమ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రోషిని సహోతా కథానాయిక. ప్రేమ్ కుమార్, చేతన్ శీను నిర్మాతలు. తొలి సీన్‌కి బెక్కం వేణుగోపాల్ క్లాప్ కొట్టగా, ఎర్రవెల్లి భాస్కర్, ఎర్రవెల్లి ప్రవీణ్, తరణి భాస్కర్, జయశంకర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ''ఈ చిత్రం కోసం వేసిన 40 అడుగుల కాళీ మాత సెట్‌లో వంద మంది ఫైటర్లతో భారీ యాక్షన్ సీన్స్ చిత్రీకరిస్తాం'' అన్నారు దర్శక–నిర్మాతలు.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 349

శనివారం 11-3-2023



'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



మన బ్యాటర్లపైనే భారం..

తొలి ఇన్నింగ్స్‌లో కామెరాన్ సెంచరీ.. 480 పరుగులకు ఆసీస్ ఆలౌట్ - IVలో



మార్కెట్‌కు గ్లోబల్ షాక్

సెన్సెక్స్ 671 పాయింట్లు డౌన్.. 177 నష్టంతో 17,413కు నిఫ్టీ - IVలో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



తేజస్వీ నివాసంలో ఈడీ సోదాలు

'ల్యాండ్ ఫర్ జాబ్స్' కేసులో బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ సహా ఆర్జేడీ నేతల నివాసాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది.

వివరాలు 6లో ▸



ఆలయాలపై దాడులు ఆందోళనకరం

ఆస్ట్రేలియాలో హిందూ ఆలయాలపై జరిగిన దాడులపై ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ వద్ద ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు.

వివరాలు 6లో ▸



చరిత్ర సృష్టించిన జిన్‌పింగ్

దేశాధ్యక్షుడిగా, సైన్యాధిపతిగా వరుసగా మూడోసారి ఎన్నికవడం ద్వారా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ చరిత్ర సృష్టించారు.

వివరాలు 6లో ▸



ఈడీ కస్టడీకి సిసోడియా

ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టయిన ఆప్ నేత మనీశ్ సిసోడియాను కోర్టు ఈనెల 17 వరకు ఈడీ కస్టడీకి అప్పగించింది.

వివరాలు 6లో ▸

సింగపూర్ రూటులో 'స్కిల్' లూటీ!



- సీమెన్స్ పేరిట షెల్ కంపెనీలతో టీడీపీ పెద్దల స్కామ్
- సింగపూర్ నుంచి హవాలా ద్వారా తిరిగి వారి ఖాతాల్లోకి
- కీలక ఆధారాలు లభ్యం.. సూత్రధారుల అరెస్టులకు ఈడీ రెడీ
- దీనికోసమే ఆ నలుగురినీ తమ కస్టడీకి ఇవ్వాలంటూ పిటిషన్

7లో





చక్కని చదువు.. సొంతిల్లు

విద్య, గృహ నిర్మాణాల పట్ల సానుకూలంగా అడుగు వేయండి

రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో సీఎం వైఎస్ జగన్

- 30.75 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం..
- వచ్చే నెలలో 3 లక్షల ఇళ్లతో కలిపి దాదాపు 25 లక్షల ఇళ్లు నిర్మించబోతున్నాం
- ఉచితంగా ఇసుక, సబ్సిడీతో సిమెంట్, స్టీలు సరఫరా.. లబ్ధిదారులకు 3 శాతం వడ్డీతో రూ.35 వేల రుణం.. ఈ వడ్డీని పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది
- రూ.35 వేల రుణం తీసుకోని వారికి త్వరగా మంజూరు చేయాలి
- ఇళ్ల నిర్మాణాలు ఊపందుకుంటే గ్రామీణ ఆర్థిక రంగం త్వరితగతిన అభివృద్ధి
- రైతులతో పాటు కౌలు రైతులకూ మరింత బాసటగా నిలవాలి
- స్వయం సహాయక సంఘాల రుణాలపై వడ్డీ తగ్గించే విషయం పరిశీలించాలి
- వారు దాచుకున్న డబ్బుపై ఇస్తోంది 4 శాతం వడ్డీ మాత్రమే
- డిజిటల్ లైబ్రరీల నిర్మాణంపై క్రియాశీలకంగా స్పందించాలి



సాక్షి, అమరావతి : విద్య, గృహ నిర్మాణ రంగాలు సామాజిక ఆర్థిక ప్రగతిలో కీలకమని, ఈ రెండు రంగాల పట్ల బ్యాంకింగ్ రంగం మరింత సానుకూల దృక్పథంతో.. అనుకూల కార్యాచరణతో ముందడుగు వేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం తన అధ్యక్షతన క్యాంపు కార్యాలయంలో జరిగిన 222వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది ఎంత మేర రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకున్నారు.. ఏ రంగాల్లో వెనుకబడి ఉన్నారో వివరిస్తూ మార్గ నిర్దేశం చేశారు. రాష్ట్రంలో బ్యాంకింగ్ వ్యవస్థ 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి 9 నెలల్లోనే వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలకు మించి సాధించిందని, ఇది 124.69%గా ఉందని చెప్పడానికి సంతోషకరంగా ఉందని ప్రశంసించారు. అయితే విద్య, గృహ నిర్మాణ రంగాలకు సంబంధించి నిర్దేశించుకున్న లక్ష్యాల స్థాయి కన్నా

మిగతా 2వ పేజీలో ▶

మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదించే వరకు పోరాటం

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష
- ఏచూరి సహా పలు పార్టీల నేతలు హాజరు



9లో



9లో

ముందస్తు ఎన్నికల ప్రసక్తే లేదు

తెలంగాణ రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదని, షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని ఆ రాష్ట్ర సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కక్ష పూరిత వైఖరిని జనం ముందు పెట్టాలని తెలిపారు.



అవినాశ్‌పై తొందరపాటు చర్యలొద్దు

సోమవారం వరకు అరెస్టు సహా.. ఏ చర్యలూ వద్దన్న తెలంగాణ హైకోర్టు

- సీబీఐకి మధ్యంతర ఉత్తర్వులు
- వైఎస్ వివేకా హత్య కేసు ఫైళ్లు, రికార్డులు కోర్టు ముందుంచాలి
- ఎంపీ విచారణ పెన్‌డ్రైవ్/ హార్డ్‌డిస్క్‌లను సీల్డ్ కవర్‌లో సమర్పించాలి.. అవినాశ్ వెంట ఆయన న్యాయవాదిని అనుమతించాలి
- తదుపరి విచారణ 13కు వాయిదా
- అప్పటి వరకు ఎలాంటి బలవంతపు చర్యలొద్దని ఆదేశం
- విచారణ పారదర్శకంగా సాగడం లేదన్న పిటిషనర్ న్యాయవాది
- ఊహాజనిత స్క్రిప్ట్‌తో సాక్షులను సిద్ధం చేస్తున్నారు
- నిందితుడు దస్తగిరిని అనుకూలంగా మలచుకుని దర్యాప్తు
- హత్య జరిగిన చోట దొరికిన లేఖపై ఎందుకు దృష్టి పెట్టలేదు?
- వివేకా అల్లుడే హత్య చేశారంటే ఆ దిశగా ఎందుకు విచారించరు?
- శివశంకర్‌రెడ్డి భార్య ఫిర్యాదును ఎందుకు పట్టించుకోలేదు?
- దర్యాప్తు నిష్పక్షపాతంగా సాగేలా ఆదేశాలు ఇవ్వాలని వాదనలు

8లో

వివేకాది ఆస్తి కోసం జరిగిన హత్య



సీబీఐ విచారణ అనంతరం మీడియాతో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

- ఆయన పేరు మార్చుకుని ఓ ముస్లిం మహిళను పెళ్లాడారు
- వారికి ఓ కుమారుడు.. తననే వారసుడిగా ప్రకటించాలనుకున్నారు
- వారికి ఆస్తిని కేటాయిస్తూ విల్లు కూడా రాశారంటున్నారు..
- హత్య జరిగిన రోజు బహుశా ఈ పత్రాల కోసమే వెతికి ఉండొచ్చు
- మరి, ఈ హత్యలో ఎవరి ప్రమేయం ఉందనుకోవాలి?
- నేను ఏ తప్పూ చేయలేదు.. న్యాయ పోరాటానికి సిద్ధం

8లో





త్రిసభ్య కమిటీ భేటీని వాయిదా వేయండి

కృష్ణా బోర్డుకు ఈఎన్‌సీ నారాయణరెడ్డి లేఖ

సాక్షి, అమరావతి: ప్రస్తుత నీటి సంవత్సరంలో రెండు రాష్ట్రాలు ఇప్పటిదాకా వినియోగించుకున్న నీటి లెక్కలు తేల్చడానికి ఈనెల 13న ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సమావేశాన్ని వాయిదా వేయాలని కోరుతూ కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురేకు ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉండడం వల్ల 13న సమావేశానికి హాజరు కాలేనని.. మరో రోజున త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఆ లేఖలో కోరారు. రబీలో సాగు నీటి అవసరాలు.. వేసవిలో తాగునీటి అవసరాలపై చర్చించి, లభ్యత ఆధారంగా త్రిసభ్య కమిటీ నీటి కేటాయింపులు చేయనుంది.

బ్యాంకులకు ఉగాది, చవితికి సెలవులు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: నెగోషబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ (ఎన్‌ఐ) కింద ఉగాది, వినాయక చవితులను సెలవు దినాలుగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2023 సంవత్సరానికి సంబంధించి డిసెంబర్ 15న విడుదల చేసిన జాబితాపై రాష్ట్ర బ్యాంకర్ల కమిటీ నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ మేరకు జీవో నంబర్ 2693లో మార్చి 22 బుధవారం, సెప్టెంబర్ 18 సోమవారంను ఎన్‌ఐ యాక్ట్ కింద సెలవు దినాలుగా సవరణ చేసినట్లు పేర్కొన్నారు.

విపత్తుల స్పందన విభాగం డీజీగా సునీల్ కుమార్



సాక్షి, అమరావతి: సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ రాష్ట్ర విపత్తులు స్పందన విభాగం, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు ఈ మేరకు పోస్టింగ్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

విపత్తుల నుంచి రక్షణకు ఆర్థికసాయం చేయాలి

కేంద్రానికి ఏపీ హోంమంత్రి వనిత వినతి



సాక్షి, న్యూఢిల్లీ: విపత్తుల నుంచి రక్షించుకోవడానికి తీరప్రాంత రాష్ట్రాలకు ఆర్థికసాయం చేయాలని ఏపీ హోం శాఖ మంత్రి తానేటి వనిత కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అవసరమైన అన్ని జిల్లాల్లోనూ మల్టీపర్పస్ సైక్లోన్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన నేషనల్ ప్లాట్‌ఫామ్ ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ (ఎన్‌పీడీఆర్‌ఆర్) సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఏటా ఒకటి, అంతకన్నా ఎక్కువ విపత్తులు ఎదుర్కొంటోందని చెప్పారు. తమ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో ఆలోచించడంతో విపత్తు నిర్వహణ శాఖ విపత్తులు ఎదుర్కోవడంలో విజయం సాధిస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఎలాంటి కరవు లేదని చెప్పారు. ప్రతి సంవత్సరం తీర ప్రాంతాలను తుపానులు అతలాకుతం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2020వ సంవత్సరం నవంబర్ నెలలో నివర్ తుపాను తీవ్ర ప్రభావం చూపిందని తెలిపారు. తుపానుల ప్రభావం నుంచి కోలుకోవడానికి సహాయం కోరుతున్నట్లు చెప్పారు. ప్రపంచబ్యాంకు నిధులతో నేషనల్ సైక్లోన్ రిస్క్ మిటిగేషన్ ప్రాజెక్టు (ఎన్‌సీఆర్‌ఎంపీ) సహాయంతో తొమ్మిది తీర ప్రాంత జిల్లాల్లో 219 మల్టీ పర్పస్ సైక్లోన్ షెల్టర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరికొన్ని జిల్లాల్లో కూడా వాటి ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి తానేటి వనిత విజ్ఞప్తి చేశారు. తమ సీఎం రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కోసం గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలు ప్రవేశపెట్టారని చెప్పారు. ఈ వలంటీర్లకు శిక్షణ ఇవ్వడంతో విపత్తులు వచ్చినప్పుడు తగిన సేవలు అందిస్తున్నారని తెలిపారు. తీరప్రాంతాల్లో మడ తోటలు, షెల్టర్ బెల్ట్ ప్లాంటేషన్, ఇతర నిర్మాణాత్మక చర్యలు ఎంతో అవసరమన్నారు. ఎన్‌సీఆర్‌ఎంపీ మౌలిక సదుపాయాల కింద వంతెనల ఏర్పాటు, తుపాను షెల్టర్లకు అనుసంధానించే రహదారుల నిర్మాణం వంటివి చేపట్టాలని ఆమె కోరారు.

రూ.1,654 కోట్లకు కేంద్రానికి ప్రతిపాదనలు

- ఆర్‌కేవీవై కింద రూ.1148 కోట్లు
- క్రిషోన్నతి యోజన కింద రూ.506 కోట్లు
- వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వివిధ కార్యక్రమాల అమలుకు రాష్ట్రీయ కృషి వికాస యోజన (ఆర్‌కేవీవై), క్రిషోన్నతి పథకాల కింద 2023–24 సంవత్సరానికి రూ.1,654 కోట్లు కేటాయించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్టు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టే పథకాలకు నిధుల కేటాయింపుపై శుక్రవారం సచివాలయంలో జరిగిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో వివిధ పంటల సాగు విస్తీర్ణం, ఉత్పత్తి పెంచడంతో పాటు వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్‌కేవీవై, క్రిషోన్నతి యోజన కింద నిధుల కోసం కేంద్రం ప్రతిపాదనలు కోరిందని ఈ సందర్భంగా చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తూ ఏటా ఈ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. ఆర్‌కేవీవై కింద ఈ ఏడాది రూ. 1,148 కోట్లకు కార్యాచరణ రూపొందించామని చెప్పారు. ఈ నిధులతో కిసాన్ డ్రోన్ టెక్నాలజీ ప్రోత్సాహం, భూసార పరిరక్షణ, సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు బిందు సేద్యానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం, పొగాకుకు బదులుగా అపరాలు, నూనె గింజలసాగు పెంచడం వంటి కార్యక్రమాలు అమలు చేస్తామని తెలిపారు. అదేవిధంగా క్రిషోన్నతి యోజన కింద ఈ ఏడాది 506 కోట్ల రూపాయాలతో కార్యాచరణ రూపొందించామని చెప్పారు. వీటితోపాటు జాతీయ ఆహార భద్రత పథకం కింద 70 కోట్ల రూపాయలుర, జాతీయ నూనె గింజల పథకం కింద 29.50 కోట్ల రూపాయలు, రైతులకు నాణ్యమైన, ధ్రువీకరించిన విత్తనాలు అందించేందుకు 19 కోట్ల రూపాయలు, వ్యవసాయ విస్తరణ, శిక్షణకు రూ.36 కోట్లు, సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం కింద రూ.200 కోట్లు మంజూరు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతున్నట్టు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్‌తో పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహన యజమానులకూ వాహనమిత్ర

సాక్షి, అమరావతి : పౌర సరఫరాల శాఖ ఇంటింటికీ రేషన్ సరఫరా కోసం ఉపయోగిస్తున్న వాహనాల (ఎండీయూ–మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) యజమానులకు కూడా వైఎస్సార్ వాహనమిత్ర పథకం వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలోని 9,260 మంది ఎండీయూ వాహన యజమానులకు ఈ ప్రయోజనం కలగనుంది. సొంత వాహనం కలిగిన అర్హులైన ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం 'వైఎస్సార్ వాహనమిత్ర పథకం' ద్వారా ఏటా రూ.10వేలు చొప్పున ఆర్థిక సహాయం చేస్తోంది. అదే రీతిలో అర్హులైన ఎండీయూ వాహనాల యజమానులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. వాహనమిత్ర పథకం లబ్ధిదారులకు ఉద్దేశించిన అర్హతలు కలిగిన ఎండీయూ వాహన యజమానులకు కూడా ఈ పథకాన్ని ఈ ఏడాది నుంచి వర్తింపజేస్తామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కళల కలనేత.. చేనేత

స్వదేశీ నినాదం ఊపందుకోవడంతో చేనేత వస్త్రాలకు పెరుగుతున్న ఆదరణ

- వ్యవసాయం తర్వాత అతిపెద్ద ఉపాధి రంగం ఇదే
- దేశవ్యాప్తంగా 70 లక్షలకు పైగా కుటుంబాలకు చేనేతే ఆధారం
- ప్రపంచంలో 90 శాతం చేనేత వస్త్రాలు మన దేశానివే
- ఏపీలో ఉత్పత్తి అయ్యే చేనేత వస్త్రాల్లో వేటికవే ప్రత్యేకం



కృష్ణాజిల్లా రాయవరం గ్రామంలో మంగళగిరిచీరలకు పట్టును తయారీని చేస్తున్న మహిళ విజయలక్ష్మి

సాక్షి, అమరావతి: చేనేత రంగం పూర్వవైభవం సంతరించుకుంటోంది. స్వదేశీ నినాదం ఊపందుకోవడంతో దేశవ్యాప్తంగా చేనేతకు క్రేజ్ పెరుగుతోంది. ప్రతి భారతీయుడు కొనుగోలు చేసే దుప్పట్లు, టవల్స్, కర్టెన్లు, గలీబులు, చీరలు, ప్యాంట్లు, షర్టులు వంటి వస్త్రాల్లో కనీసం 15 నుంచి 20 శాతం చేనేత కార్మికులు తయారు చేసినవి వాడగలిగితే.. ఆ రంగానికి ఊతమిచ్చినట్టేననే బలమైన నినాదం ప్రజల్లోకి వెళ్లింది. మన ప్రాచీన సాంస్కృతిక సంపద, వారసత్వం నిరంతరం జీవించగలిగేలా చేనేత రంగానికి ఊతమిచ్చే చర్యలు ఇటీవల దేశవ్యాప్తంగా ఊపందుకుంటున్నాయి. అన్నిటికన్నా మిన్నగా ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేనేత కార్మికులకు ఏటా రూ.24 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. అంతేకాకుండా చేనేత రంగానికి ఊతమిచ్చే అనేక చర్యలు చేపట్టింది. ఫలితంగా దేశవ్యాప్తంగా తెలుగు చేనేత కార్మికులు మార్కెట్‌లో పోటీ పడుతున్నారు.

చేనేత పేరు పలకగానే.. పట్టుపావడా కుచ్చిళ్లు కాళ్లకు అడ్డం పడుతున్నా పరుగులు ఆపని పకపక నవ్వుల పాపాయి గుర్తు రాకుండా ఎలా ఉంటుంది. ఐలారం.. చీరాల పేరాల సుతిమెత్తని చీరల్లో అమ్మ మడతపెట్టి తెచ్చిన పుట్టింటి జ్ఞాపకాలు ఎలా మరిచిపోగలం. చేనేత మాటెత్తగానే.. వెంకటగిరి జరీ వెలుగులు.. మంగళగిరి ఫ్యాన్సీ జిలుగులు.. ఉప్పాడ.. ధర్మవరం పట్టుచీరలు, పావడాలు.. పొందూరు ఖద్దరు.. పెడన కలంకారీ అద్దకాలు.. గూడవల్లి చావిట్లో మగ్గం చప్పుళ్లు.. రాజోలు, అంబాజీపేట వాకిళ్లలో గంగాళాల్లో నానబోసిన రంగురంగుల దారాల కండెలు.. ఇంటిముందు రంగులద్దిన తడి నూలు ఆరబోతలు.. పడుగు–పేకల కలబోతతో నాజూకు కలనేత కళ్లముందు ఇట్టే కదలాడుతాయి.



ఏపీలో అద్భుత నేత

- ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో చేనేత కేంద్రాలు అనేక ప్రత్యేకతలు సంతరించుకున్నాయి. ఒక్కో చోట ఒక్కోతరహా అద్భుతమైన నేతతో ఆకట్టుకుంటున్నాయి.
- పెడన, మచిలీపట్నంలలో సహజసిద్ధంగా తయారు చేసిన రంగులతో కాంతులీనే అద్దకం వస్త్రాలకు జాతీయ, అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. స్థానికంగా ఉండే చెట్లు, పువ్వుల నుంచి రంగుల సారం, బంక మన్ను, నదులలోని ఇసుక నుంచి రసాయనాలు తయారు చేసి వాటిని వస్త్రాలకు బ్లాక్ ప్రింట్స్‌తో అద్దకం చేసే మన కళాకారులు అనేక అవార్డులను సైతం దక్కించుకున్నారు.
- వెంకటగిరి జరీ, మంగళగిరి ఫ్యాన్సీ, పట్టు చీరలు, కాటన్ వస్త్రాలు, పెడన కలంకారీ అద్దకాలు, పొందూరు ఖద్దరు వంటి అనేక ప్రత్యేకతలు మన రాష్ట్రంలోని చేనేత కళాకారుల సొంతం.
- శ్రీకాళహస్తిలో హ్యాండ్ ప్రింట్స్ (చేత్తో గీసే డిజైన్లు) ప్రత్యేకం. వారి కళా నైపుణ్యానికి జాతీయ అవార్డులు సైతం దక్కాయి.
- ఉప్పాడ జాందాని జరీ చీరలు, ధర్మవరం కాటన్, పట్టు చీరలకు ప్రత్యేకం. బ్లాక్–ప్రింట్స్(కలంకారీ) చేనేతలో ఆంధ్రప్రదేశ్ ఖ్యాతి ఘనమైనది.

ఒక్కో చోట.. ఒక్కో రకం

భారతదేశంలో దాదాపు 150 చేనేత ఉత్పత్తి కేంద్రాలు ఉన్నట్టు ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ధారించింది. వాటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మైసూరు, ఒడిశా,బిహార్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, సూరత్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కాశ్మీర్ వంటి రాష్ట్రాల్లోని అనేక చేనేత కేంద్రాల్లో ఒక్కో ప్రాంతానికి ఒక్కో రకమైన నేత ప్రత్యేకం. ఇక్కత్, జాందాని, పట్టు, జరీ చీరలు టై–డై కలంకారీ, పుల్కారి, ఢకై, బాలుచరి సిల్క్, మూగా సిల్క్, పటోల డిజైన్, చందేరి సిల్క్, పైథాని సిల్క్, కోటా పేపర్ సిల్క్, టసర్ సిల్క్, ఖాదీ సిల్క్, మైసూరు సిల్క్, కాశ్మీర్ సిల్క్, ఎరిముడి సిల్క్, కాశ్మీర్ పష్మినా, శాహత్రాష్ పల్చని ఉన్ని వంటి ఉత్పత్తులకు నిరంతరం డిమాండ్ ఉంటుంది. ఈశాన్య రాష్ట్రాల గిరిజన జాతులు రకరకాల చిహ్నాల రంగుల వస్త్రాలు, బిహార్ మధుబని, మహారాష్ట్ర వర్లి డిజైన్లతోపాటు ఆయా రాష్ట్రాల సంప్రదాయ దుస్తులకు చేనేత ఊతమిస్తోంది.





కలంకారి వస్త్రాలను తయారు చేస్తున్న మహిళలు

నిత్య నూతన డిజైన్లతో..

నిత్య నూతనమైన డిజైన్లతో చేనేత సంప్రదాయం కొత్త పుంతలు తొక్కుతోంది. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలను బట్టి.. మారుతున్న ప్రజల అభిరుచులకు అనుగుణంగా చేనేత కళాకారులు నైపుణ్యాలను పెంచుకుంటూ పోటీ మార్కెట్‌లో నిలదొక్కుకుంటున్నారు. భారతీయ చేనేతకు ప్రపంచ వ్యాప్తంగా ఘన చరిత్రే ఉంది. పురాతన కాలం నుంచీ భారతీయ చేనేత వస్త్రాలు ప్రపంచమంతా ఎగుమతి అయ్యేవి. సుమారు 2 వేళ్ల ఏళ్ల క్రితం 'హంస' డిజైన్లతో కూడిన భారతీయ వస్త్రాలు ఈజిప్టులోని కైరో నగరంలో లభ్యమయ్యాయి. అగ్గిపెట్టెలో పట్టే మస్లిన్ చీరలను నేసిన ఘనత కూడా భారతీయులదే. 1905 ఆగస్టు 7న కోల్‌కతాలో స్వదేశీ ఉద్యమం ప్రారంభం కాగా.. విదేశీ వస్తు బహిష్కరణకు పిలుపునిచ్చిన స్వాతంత్ర్య ఉద్యమకారులు చేనేత తదితర స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలని పిలుపునిచ్చారు. దేశంలో కుటీర పరిశ్రమగా భాసిల్లుతున్న చేనేత రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 70 లక్షల మందికి పైగా ఆధారపడి జీవిస్తున్నట్టు అంచనా. ప్రపంచవ్యాప్తంగా వినియోగిస్తున్న చేనేత ఉత్పత్తుల్లో 90 శాతం మన దేశానికి చెందినవే కావడం విశేషం.

చక్కని చదువు.. సొంతిల్లు

మొదటి పేజీ తరువాయి

రుణాలు తక్కువగా ఉన్నాయని అన్నారు. విద్యా రంగానికి కేవలం 42.91 శాతం, గృహ నిర్మాణ రంగానికి 33.58 శాతం మాత్రమే రుణాలు ఇచ్చారని.. సామాజిక–ఆర్థిక ప్రగతిలో ఈ రెండు కీలక రంగాలు అయినందున బ్యాంకింగ్ రంగం వీటి పట్ల మరింత సానుకూల దృక్పథంతో ముందడుగు వేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

గృహ నిర్మాణాలకు ఊతమివ్వాలి

- 30.75 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం. ప్రభుత్వమే ఈ ఇళ్ల స్థలాలు సేకరించి, లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేసింది. ఈ ఏప్రిల్‌లో మరో 3 లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభించబోతున్నాం. వీటితో కలిపి దాదాపు 25 లక్షల ఇళ్లు నిర్మించబోతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తోంది. సిమెంట్, స్టీలు సబ్సిడీ ధరలకు అందిస్తోంది. వీటికి అదనంగా ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు రూ.35 వేలు రుణం 3 శాతం వడ్డీతో అందించాలని బ్యాంకులతో చర్చించాం. ఈ వడ్డీని ప్రభుత్వమే భరిస్తుంది.
- ఈ ఇళ్ల లబ్ధిదారులందరూ మహిళలే. వారి పేరు మీద ఇళ్ల పట్టాలు ఇచ్చాం. రూ.35 వేల రుణం తీసుకోని వారికి త్వరగా మంజూరు చేయాలని కోరుతున్నాం. ఇళ్ల నిర్మాణం ఊపందుకుంటే.. స్టీల్, సిమెంట్ వినియోగం వల్ల గ్రామీణ ఆర్థిక రంగ అభివృద్ధికి గణనీయమైన ఊతమొస్తుంది. మొత్తం 30.75 లక్షల ఇళ్ల నిర్మాణం జరగబోతుంది. ఇలా కడుతున్న ఒక్కో ఇంటి మార్కెట్ విలువ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉండబోతుంది. ఈ నేపథ్యంలో గృహ నిర్మాణ రంగానికి బ్యాంకులు మరింతగా సహకరించాల్సిన అవసరం ఉంది.

తక్కువ వడ్డీతో మహిళలకు రుణాలు

- మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాలపై వడ్డీ విషయంలో బ్యాంకులు పునః పరిశీలన చేయాలి. మహిళలు దాచుకున్న డబ్బుపై కేవలం 4 శాతం వడ్డీ ఇస్తున్నారు. కానీ వారికిచ్చే రుణాలపై అధిక వడ్డీ వేస్తున్నారు. ఈ విషయాన్ని పరిశీలించి, తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చేలా చూడాలి.
- ఈ వడ్డీ రేట్లను పర్యవేక్షించడానికి.. అధికారులు, బ్యాంకర్లు కలిసి సమావేశం కావాలి. ఇది చాలా ముఖ్యమైన అంశం. దాదాపు కోటి మందికి పైగా మహిళలు ఈ రంగంలో ఉన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా ఈ రంగంలో ఇప్పుడు ఎన్‌పీఏలు లేరు. వీరిపట్ల బ్యాంకులు ఉదారతతో ఉండాలి. సున్నా వడ్డీ, చేయూత, ఆసరా వంటి పథకాల వల్ల నేడు ఆంధ్రప్రదేశ్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారు.

జూలైలో జగనన్న తోడు

- చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారి అవసరాలు తీర్చడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జగనన్న తోడు పథకాన్ని ప్రవేశపెట్టింది. రూ.10,000 చొప్పున రుణాలు అందిస్తూ.. వీటిపై వడ్డీ భారాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. ఇప్పటి వరకూ 25 లక్షల మంది రుణాలు పొందారు.
- వీరికి రుణాలు ఇవ్వడానికి బ్యాంకింగ్ రంగం కూడా ఉత్సాహాన్ని ప్రదర్శించింది. ఈ ఏడాది కూడా అదే ఉత్సాహాన్ని కొనసాగించాలని కోరుతున్నాను. జగనన్న తోడు తదుపరి దశను 2023 జూలైలో ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధమవుతోంది.

> ప్రభుత్వ చురుకైన విధానాల వల్ల 2021-22 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం 11.43% జీఎస్‌డీపీ వృద్ధి రేటు సాధించింది. ఇది దేశంలోనే అత్యధికం. ఇదే సమయంలో ఎంఎస్‌ఎంఈలు ఉపాధి కల్పనతో పాటు రాష్ట్ర సామాజిక ఆర్థిక పురోగతికి ఎంతో తోడ్పడ్డాయి. వీటి పురోగతికి అపారమైన అవకాశాలు ఉన్నాయి. విదేశాల్లో వీటి పనితీరు అధ్యయనం చేసి, మంచి విధానాలను ఇక్కడ అమలు చేయడం ద్వారా మరింత చేయూత ఇవ్వాలని ఇప్పటికే అధికారులను ఆదేశించాం. ఈ దృష్ట్యా రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సూక్ష్మ, చిన్న, మీడియం పరిశ్రమలను ప్రోత్సహించడం చాలా అవసరం. ఇందులో భాగంగా రూ.50 వేల కోట్ల రుణ లక్ష్యాన్ని మరింత పెంచాలి.
> – ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

కౌలు రైతులకు మరింత బాసట

- వ్యవసాయ రంగంలో స్వల్ప కాలిక పంట రుణాల విషయంలో నిర్దేశించుకున్న లక్ష్యంలో 83.36 శాతానికి చేరుకున్నాం. వంద శాతానికి చేరుకోక పోవడంపై దృష్టి పెట్టి ఎస్‌ఎల్బీసీ సరైన చర్యలు తీసుకోవాలి.
- కౌలు రైతుల రుణాలకు సంబంధించి 2022 డిసెంబర్ వరకు కేవలం 49.37% మాత్రమే వార్షిక లక్ష్యాన్ని సాధించాం. 1,63,811 మంది కౌలు రైతు ఖాతాలకు మాత్రమే క్రెడిట్‌ను పొడిగించారు. కౌలు రైతుల రుణాల లక్ష్యం రూ.4,000 కోట్లు కాగా, మొదటి 9 నెలల్లో కేవలం రూ.1,126 కోట్లు మాత్రమే మంజూరు చేశారు. ఈ దృష్ట్యా వీరికి బ్యాంకులు మరింత బాసటగా నిలవాలి.
- రాష్ట్రంలో సాగయ్యే ప్రతి ఎకరా భూమికి ఇ–క్రాపింగ్ చేస్తున్నాం. డిజిటల్, ఫిజికల్ రశీదులు కూడా ఇస్తున్నాం. సాగు చేసే రైతు పేరు, విస్తీర్ణం, సాగు చేసిన పంట వివరాలన్నీ డిజిటలైజేషన్ చేస్తున్నాం. విత్తనం నుంచి పంట విక్రయం దాకా తోడుగా నిలిచే ఆర్బీకే వ్యవస్థ రాష్ట్రంలో సమర్థవంతంగా పని చేస్తోంది.
- కౌలు రైతులకు దేశంలో ఎక్కడా లేని విధంగా వైఎస్సార్ రైతు భరోసా అందిస్తున్నాం. భూ యజమానుల హక్కులకు భంగం లేకుండా కౌలు చేసుకునేందుకు ఇద్దరి మధ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు అవసరమైన పత్రాలను గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంచాం. అందువల్ల కౌలు రైతులకు రుణాల విషయంలో బ్యాంకులు ఎలాంటి సందేహాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు.

డిజిటల్ లైబ్రరీలకు సహకరించాలి

- సుమారు 15 వేల గ్రామ, వార్డు సచివాలయాలు నిర్మించాం. ప్రతి ఊళ్లో ఇంగ్లిష్ మీడియం స్కూలు, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లు కనిపిస్తాయి. అక్కడే డిజిటల్ లైబ్రరీలు కూడా ఏర్పాటు చేస్తున్నా. అన్ లిమిటెడ్ బ్యాండ్‌విడ్త్‌తో వర్క్ ఫ్రం హోం సౌలభ్యాన్ని కల్పించనున్నాం. కంప్యూటర్లు, వర్క్ ఫ్రం హోం సౌలభ్యంతో డిజిటల్ లైబ్రరీలు గ్రామాల స్వరూపాన్ని మార్చబోతున్నాయి. వీటి నిర్మాణానికి నాబార్డు, బ్యాంకులు సహకరించాల్సిన అవసరం ఉంది.
- యువతీ యువకులను సుశిక్షితంగా తయారు చేసేందుకు, వారికి ఉపాధి కల్పనను మెరుగు పరిచేందుకు ప్రతి నియోజకవర్గంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. పాఠ్య ప్రణాళిక, కోర్సుల బోధన, శిక్షణ కార్యక్రమాలను నిర్దేశించేందుకు ఒక యూనివర్సిటీ ఏర్పాటు కానుంది. ఈ కార్యక్రమాలకు బ్యాంకులు బాసటగా నిలవాలి.

గత ఏడాది లక్ష్యం మేరకు రుణాలు : ఎస్‌ఎల్‌బీసీ వెల్లడి

- ప్రాథమిక రంగానికి ఇవ్వాల్సిన రుణాలన్నీ దాదాపు ఇచ్చాం. మిగిలిన రంగాలకు నిర్దేశించుకున్న లక్ష్యాల కంటే ఎక్కువ రుణాలు ఇచ్చాం. ప్రాథమిక రంగానికి 2022-23 రుణ ప్రణాళిక లక్ష్యం రూ.2,35,680 కోట్లు కాగా, రూ.2,34,442 కోట్ల రుణాలు ఇచ్చాం. 99.47% లక్ష్యాన్ని చేరుకున్నాం.
- వ్యవసాయ రంగానికి రుణాల లక్ష్యం రూ.1,64,740 కోట్లు కాగా 1,72,225 కోట్లతో 104.54 శాతం మేర ఇచ్చాం. ఎంఎస్ఎంఈ రంగానికి రుణాల లక్ష్యం రూ.50,100 కోట్లు కాగా, రూ.53,149 కోట్లతో 106.09 శాతం ఇచ్చాం.
- ప్రాథమికేతర రంగానికి రూ.83,800 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా, రూ.1,63,903 కోట్లు ఇచ్చాం. దాదాపుగా రెట్టింపు స్థాయిలో 195.59% మేర ఇచ్చాం.

ఆంధ్రప్రదేశ్‌లో స్థిరంగా అభివృద్ధి

దార్శనికత గల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్థిరంగా అభివృద్ధి చెందుతోంది. సామాజిక, ఆర్థిక, అభివృద్ధి కార్యకలాపాలతో పాటు అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తోంది. కోవిడ్–19 తర్వాత సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాల పునర్వ్యవస్థీకరణ త్వరితగతిన అభివృద్ధికి దోహద పడుతుంది. వరుసగా మూడేళ్లు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానంలో ఉండటం గొప్ప విషయం. తద్వారా పారిశ్రామికాభివృద్ధి పరుగులు తీస్తుంది. కొత్త వ్యాపార మార్గాలు లభిస్తాయి. కోవిడ్ పరిస్థితుల్లోనూ గత ఆర్థిక ఏడాది దేశంలోనే అత్యధికంగా 11.43 శాతం వృద్ధి నమోదు చేయడం చెప్పుకోదగిన అంశం. విశాఖ జీఐఎస్ పారిశ్రామిక అభివృద్ధికి మరింతగా ఊతమిస్తుంది. ఓడరేవులు, ఫిషింగ్ హార్బర్లు పెద్ద సంఖ్యలో రానున్నందున ఎగుమతి వ్యాపారాలకు బ్యాంకులు రుణాలు ఇచ్చే అవకాశాలు బాగా పెరుగుతాయి. వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, ఏపీ టిడ్కో హౌసింగ్ (పీఎంఏవై) వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అత్యంత పారదర్శకంగా చివరి మైలు వరకు చేరుకునేలా అమలు చేస్తుండటం ప్రశంసనీయం. ఇవన్నీ బడుగు, బలహీన వర్గాల జీవన శైలిలో కచ్చితంగా మార్పులు తీసుకువస్తాయి. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు అంతర్జాతీయ సంస్థల నుంచి ప్రశంసలు అందుకున్నాయి. డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఉచిత విద్యుత్, వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ పంట రుణాలు దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయి. నాడు–నేడు కింద వైద్య, విద్యా రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. వైద్య రంగంలో మౌలిక సదుపాయాల్లో త్వరలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తుంది. చాలా విషయాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ బాగా మెరుగుపడింది. వ్యవసాయ అనుబంధ రంగాలైన పశు సంవర్థక, మత్స్య రంగాలను మరింత ప్రోత్సహించేలా బ్యాంకులు చొరవ చూపాలి. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు చురుకైన భాగస్వామిగా మద్దతు ఇవ్వాలి.

– ఎ.మణిమేఖలై, ఎస్‌ఎల్‌బీసీ ప్రెసిడెంట్, యూనియన్ బ్యాంకు ఎండీ అండ్ సీఈవో

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, ఆర్థిక శాఖ కార్యదర్శి వీకేవీ సత్యనారాయణ, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, ఏపీ టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, వ్యవసాయ శాఖ కమిషనర్ సీహెచ్ హరికిరణ్, ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీ జి సృజన, ఇతర ఉన్నతాధికారులు, ఎస్‌ఎల్‌బీసీ ప్రెసిడెంట్, యూనియన్ బ్యాంకు ఎండీ అండ్ సీఈవో ఎ.మణిమేకలై, ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్ నవనీత్ కుమార్, నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్, ఆర్‌బీఐ డీజీఎం వికాస్ జైస్వాల్, పలువురు బ్యాంకర్లు పాల్గొన్నారు.

జీతాలపై దుష్ప్రచారం చేస్తున్నారు

- నెలాఖరులోగా పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం అంగీకరించింది
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి
- ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోకుండా ఉద్యోగుల జీతాల విషయంలో ప్రభుత్వంపై కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సచివాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చాక అదనంగా రెండున్నర లక్షలమందికిపైగా ఉద్యోగాలు ఇచ్చిందని, వారంతా ప్రభుత్వంలో కొత్తగా చేరిన విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. ఆర్టీసీ విలీనం వల్ల వారు ప్రభుత్వ ఉద్యోగులయ్యారని, గ్రామ సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ పెద్ద ఎత్తున ఉద్యోగులను నియమించాయని, వీటివల్ల జీతాల భారం పెరిగిందని వివరించారు. ప్రభుత్వ సొంత ఆదాయం ఏడాదికి రూ.1.25 లక్షల కోట్ల మేర వస్తుంటే, రూ.90 వేల కోట్లు జీతాలకే సరిపోతోందని చెప్పారు. సీపీఎస్ రద్దు అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు. ఈ నెలాఖరులోగా ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రూ.3 వేల కోట్లకుపైగా చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు. పీఆర్సీ బకాయిల చెల్లింపులపై ఈ నెల 16వ తేదీన ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మంత్రివర్గ ఉపసంఘంతో జరిగిన చర్చల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. కానీ బయటకు వెళ్లాక ఉద్యమాన్ని ఎందుకు కొనసాగిస్తున్నారో తెలియడం లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

తప్పుడు రాతలు తగవు: మంత్రి బొత్స



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

బొండపల్లి: ప్రభుత్వానికి ఉద్యోగులకు మధ్య అంతరం పెంచేలా ఎల్లోమీడియా వార్తలు ప్రచురించడం తగదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా నిధుల సర్దుబాటులో ఉద్యోగుల జీతాలు రెండుమూడు రోజులు అటుఇటుగా జమవుతున్నాయని, కొద్దిరోజుల్లో అంతా గాడిలోపడుతుందని పేర్కొన్నారు. ఆయన శుక్రవారం విజయనగరం జిల్లా గొట్లాం గ్రామంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి విడతలో నాడు-నేడు పనులు పూర్తయిన స్కూళ్లల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి స్మార్ట్‌టీవీలతోపాటు ప్లానర్స్‌ను ఏర్పాటుచేసి డిజిటల్ బోధన చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సాధించిన ప్రగతిపై వార్తలు ప్రచురించాలని ఎల్లోమీడియాకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు, ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య, వైఎస్సార్‌సీపీ యూత్ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ విక్రమ్ పాల్గొన్నారు.

బీసీలకు 11 ఎమ్మెల్సీ సీట్లు ఇచ్చిన ఘనత జగన్‌దే

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

సత్తుపల్లి: దేశంలో ఎక్కడా లేని విధంగా, బీసీల దామాషా కంటే ఎక్కువగా 11 ఎమ్మెల్సీ సీట్లు ఇచ్చిన ఘనత ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో జరిగిన జిల్లా బీసీ గర్జన మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాను ఏపీ వాసిని కాకపోయినా బీసీలకందిస్తున్న సేవలను గుర్తించి ఏపీ సీఎం తనకు రాజ్యసభ సీటు ఇచ్చారని చెప్పారు. బీసీలు ఐకమత్యంతో పోరాడితేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని అన్నారు. కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు, అగ్రవర్ణాల పాలనను అంతమొందించేందుకు బీసీలంతా కొట్లాడాలని ఆయన పిలుపునిచ్చారు.

సర్వ కర్మలన్నీ నాలో వదిలి, నన్నే లక్ష్యముగా ధ్యానిస్తూ ఎవరు ఉపాసిస్తారో, వాళ్ళను మృత్యుసంసార సాగరం నుండి నేనే ఉద్ధరిస్తాను.
– భగవద్గీత

సాక్షి
శనివారం, మార్చి, 11

భారత్–ఆస్ట్రేలియా బంధం

దేశాల మధ్య బంధాలు బలపడటం, అవి కొత్త పుంతలు తొక్కటం, కూటమిగా కలిసి కదలాలను కోవటంవంటి పరిణామాలు మారుతున్న అంతర్జాతీయ స్థితిగతులకు అద్దం పడతాయి. ప్రస్తుతం మన దేశంలో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ ప్రధాని నరేంద్ర మోదీతో జరిపిన చర్చల సందర్భంగా రెండు దేశాలమధ్యా పలు ఒప్పందాలు కుదరటం ఆ కోణంలో కీలక పరిణామమనే చెప్పాలి. రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య ఏడాదికిపైగా సాగుతున్న లడాయి కారణంగా చైనాపై మునుపటంత దృష్టి కేంద్రీకరించటం లేదని అంతర్జాతీయ నిపుణులు భావిస్తున్న తరుణంలో గతవారం ఢిల్లీలో చతుర్భుజ కూటమి(క్వాడ్) విదేశాంగ మంత్రుల సదస్సు జరిగింది. అందులో మన విదేశాంగమంత్రి జైశంకర్‌తోపాటు అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, జపాన్ విదేశాంగ మంత్రి హయాషీ యొషిమసా, ఆస్ట్రేలియా విదేశాంగమంత్రి పెన్నీ వాంగ్‌లు పాల్గొన్నారు. దానికి కొనసాగింపుగానే ఆల్బనీస్ బుధవారం మన దేశం వచ్చారు. వచ్చేవారం జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా రాబోతున్నారు. ఈ సందడంతా సహజంగానే చైనాకు కంటగింపుగా ఉంటుంది. దక్షిణాసియాలో, హిందూ మహా సముద్ర ప్రాంతంలో తన ప్రాబల్యాన్ని పెంచుకోవటానికి ప్రయత్నించటం, బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బీఆర్ఐ) పేరిట మన వ్యూహాత్మక ప్రాంతాలను తాకేలా ప్రాజెక్టు రూపకల్పన చేయటం వగైరా పనులు చైనావైపు నుంచి ముమ్మరమయ్యాక మన దేశం క్వాడ్‌పై ఆసక్తి ప్రదర్శించటం మొదలుపెట్టింది. వాస్తవాధీన రేఖ వద్ద చైనా గిల్లికజ్జాలు పెట్టుకునే రీతిలో వ్యవహరించటం కూడా మన దేశానికి ఆగ్రహం తెప్పించింది. మొదట పదహారేళ్లక్రితం క్వాడ్ ఏర్పాటు ప్రతిపాదన వచ్చినప్పుడు భారత్ పెద్దగా స్పందించలేదు. కేవలం చైనా వ్యతిరేకత ఒక్కటే క్వాడ్‌కు ప్రాతిపదిక కారాదని చెప్పింది. వాస్తవానికి చైనాతో మనకన్నా జపాన్‌కూ, ఆస్ట్రేలియాకూ సమస్యలు అధికం. దక్షిణ చైనా సముద్ర జలాల్లో జపాన్‌కూ, పశ్చిమ పసిఫిక్ ప్రాంతంలో ఆస్ట్రేలియాకూ చైనా తలనొప్పిగా మారింది. ఇక చైనాతో అమెరికాకు ఉన్న సమస్యలు సరేసరి. ప్రపంచ ఆధిపత్యం కోసం చైనా తనతో పోటీపడుతోందని, దీన్ని సకాలంలో కట్టడి చేయకపోతే తన పలుకుబడి తగ్గినా తగ్గొచ్చని అమెరికా ఎప్పటినుంచో భావిస్తోంది. అందువల్లే దీర్ఘకాలంగా తనకు నమ్మదగ్గ మిత్రులుగా ఉన్న నాటో కూటమినీ, ఆస్ట్రేలియా, జపాన్‌లనూ అందుకు అనుగుణంగా అడుగులేయిస్తోంది. తాజాగా మలబార్ తీరంలో తమ ఆధ్వర్యంలో తొలి సారి క్వాడ్ దేశాల నావికా దళాల విన్యాసాలు నిర్వహించటంతోపాటు ఆస్ట్రేలియాలో జరపబోయే నావికాదళ విన్యాసాలకు భారత్‌ను ఆహ్వానిస్తున్నామని ఆల్బనీస్ ప్రకటించటం భద్రత, రక్షణ రంగాల్లో రెండు దేశాలమధ్యా పెరిగిన సహకారాన్ని సూచిస్తోంది.

ఇతరేతర రంగాలకు సైతం క్వాడ్ దేశాల సహకారం పెంపొందాలని రెండేళ్లక్రితం ఆన్‌లైన్ వేదికగా జరిగిన తొలి శిఖరాగ్ర సదస్సు నిర్ణయించింది. అటుపై అనేకానేక అంశాలపై క్వాడ్ దేశాల మధ్య ఒప్పందాలు కుదురుతున్నాయి. కరోనా వైరస్ వ్యాక్సిన్ ఉత్పత్తి, వాతావరణ మార్పులు, కీలక సాంకేతిక పరిజ్ఞానం బదలాయింపువంటి అంశాలపై పరస్పర అవగాహన ఏర్పడింది. ఆంథోనీ ఆల్బనీస్ పర్యటన దానికి కొనసాగింపే. నిరుడు రెండు దేశాలూ ఆర్థిక సహకార, వాణిజ్య ఒప్పందం (ఈసీటీఏ) కుదుర్చుకున్నాయి. అయితే అంతకు చాన్నాళ్లముందే... అంటే 2011లో మొదలై 2016 వరకూ చర్చలు సాగి అర్థంతరంగా నిలిచిపోయిన సమగ్ర ఆర్థిక సహకారం ఒప్పందం(సీఈసీఏ)పై మాత్రం కదలిక లేదు. రెండేళ్లనుంచీ మళ్లీ చర్చలు సాగుతున్నా ఇంతవరకూ అవి ఓ కొలిక్కి రాలేదు. కానీ ఆల్బనీస్ మాత్రం ఈ ఏడాదే ఆ ఒప్పందంపై సంతకాలవుతాయని ఘంటాపథంగా చెబుతున్నారు. దాని సంగతలావుంచి విద్యారంగంలో ఇరు దేశాలమధ్యా చాన్నాళ్లనుంచి తలెత్తిన సమస్యలు పరిష్కారం కావటం లక్షలాదిమంది విద్యార్థులకు ఊరటనిస్తుంది. నిరుడు మన దేశంనుంచి 7.7 లక్షలమంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియా, కెనడా, అమెరికా, బ్రిటన్ తదితర దేశాలకు వెళ్లారు. అక్కడ లక్షలాది రూపాయలు వ్యయం చేసి చదువుకుని డిగ్రీలు, డిప్లొమోలు తెచ్చుకున్నా మన దేశంలో ఉద్యోగాలకు వాటిని పరిగణనలోకి తీసుకోవటం లేదు. ఈ సమస్య పరిష్కారానికి భారత్, ఆస్ట్రేలియాలు రెండూ తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. రెండు దేశాల విశ్వవిద్యాలయాలూ తాము విద్యార్థులకు ప్రదానం చేసే పట్టాలను పరస్పరం గుర్తించాలన్న నిర్ణయం జరిగింది.

వాతావరణం, సౌర శక్తి, హైడ్రోజన్ వంటి హరిత ఇంధనాల విషయంలో సహకారం మరింత పెంపొందాలని ఇరు దేశాలూ భావించాయి. ఇప్పటికే వ్యవసాయం, దుస్తులు, రైల్వే ఇంజిన్లు, టెలికాం పరికరాలు తదితరాలు మన దేశం నుంచి ఆస్ట్రేలియాకు ఎగుమతి అవుతుండగా, అక్కడి నుంచి మన పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలూ, ఖనిజ ఉత్పత్తులు దిగుమతి అవుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ, ఆంథోనీ ఆల్బనీస్‌ల మధ్య జరిగిన చర్చల్లో ఖనిజాల ఎగుమతులు, దిగుమతులపై మరింత శ్రద్ధ పెట్టాలని నిర్ణయించటం ద్వైపాక్షిక వాణిజ్య విస్తరణకు తోడ్పడుతుంది. వచ్చే మే నెలలో ఆస్ట్రేలియాలో క్వాడ్ దేశాల శిఖరాగ్ర సమావేశం జరగబోతోంది. పరస్పర సహకారం, సమానత్వ ప్రాతిపదికన దౌత్య సంబంధాలు దేశాల చెలిమిని కొత్త పుంతలు తొక్కిస్తాయి. దేశాలమధ్య వైషమ్యాలు, ఘర్షణలు అంతిమంగా ఆ దేశాలు నష్టపోవటానికే దోహదపడతాయి. ఈ సంగతిని అందరూ గ్రహించినప్పుడే ప్రపంచ శాంతి సాధ్యమవుతుంది.

పంజాబ్‌లో పొంచి ఉన్న ముప్పు

విశ్లేషణ



జూలియో రిబేరో

'రాడికల్ మతబోధకుడు' అమృత్‌పాల్ సింగ్ గత సంవత్సరం దాకా నీట్‌గా షేవ్ చేసుకున్నాడు. తనలోని సహజ ప్రతిభలకు అవకాశం లభించనుందని గ్రహించి గడ్డం పెంచడం ప్రారంభించాడు. పోలీసులు చర్య తీసుకోవడాన్ని అడ్డుకునేందుకు గురు గ్రంథ్ సాహిబ్‌ను తన అనుచరులు నిత్యం వెంట ఉంచుకునేలా చేశాడు. ఇప్పుడు సమస్యల్లా పంజాబ్‌లో ఉగ్రవాదం తిరిగి పొడసూపే అవకాశం ఉండటమే. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన మన పొరుగుదేశం మళ్లీ సరిహద్దు పొడవునా ఘర్షణలు రేపడానికి ప్రయత్నించవచ్చు. అందుకే ఆప్ సర్కారు వైఫల్యం పేరుతో తనకు స్వాగతం పలకని రాష్ట్రంలో ప్రయోజనాలు పొందడానికి కేంద్రం ప్రయత్నించకూడదు. ఈ సమస్యను ఎదుర్కోవడానికి ద్విముఖ వ్యూహం అవసరం.

'రాడికల్ మతబోధకుడి'గా అభివర్ణిస్తున్న అమృత్‌పాల్ సింగ్ మరో భింద్రాన్‌వాలే కావాలని ఆశ పడుతున్నాడు. అయితే, ఈ లక్ష్యాన్ని సాధించడం అంత సులభం కాదు. తప్పుదోవ పట్టిన రాజకీయ తంత్రాల ఉత్పత్తి – భింద్రాన్‌వాలే. నిరుద్యోగం, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల, తీవ్రరూపం దాల్చిన రష్యా–ఉక్రెయిన్ ఘర్షణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కలిగించిన ప్రభావాలు వంటి వాటి కారణంగా పంజాబ్ యువతలో ఏర్పడిన ప్రస్తుత నిస్పృహ స్థితిని వాడుకోవాలని అమృత్‌పాల్ స్పష్టంగా కోరుకుంటున్నాడు.

మీడియా నివేదికల ప్రకారం, అమృత్‌పాల్ అనుయాయుల్లో ఒకరైన లవ్ ప్రీత్ సింగ్ 'తూఫాన్'ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చామ్‌కౌర్ సాహిబ్‌కు చెందిన వరీందర్ సింగ్‌ను అపహరించి, దాడి చేశారనే ఆరోపణలపై అతడిని అరెస్టు చేశారు. దీనిపై అజ్‌నాలా పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌లో అమృత్‌పాల్ పేరు కూడా జోడించారు. లవ్‌ప్రీత్ విడుదలకు డిమాండ్ చేస్తూ పోలీసు స్టేషన్ వరకు మార్చ్ చేయాలని అమృత్‌పాల్ ప్రకటించాడు. సమస్య తీవ్రతను గ్రహించడంతో చుట్టుపక్కల పోలీసు స్టేషన్ల నుంచి పోలీసు బలగాలను రప్పించి అజ్‌నాలా వద్ద మోహరించారు.

అమృత్‌పాల్, అతడి 'వారిస్ పంజాబ్ దే' సంస్థకు చెందిన మద్దతు దారులు భారీస్థాయిలో కత్తులు, కొందరు తుపాకులు కూడా ధరించి బారికేడ్లను ఛేదించుకుని పోలీసు స్టేషన్‌లో ప్రవేశించారు. ప్రభుత్వ ఆస్తికి భారీ నష్టం కలిగించారు. గుంపు తమపై దాడిచేస్తే ఏం చేయాలనే విషయమై వందమంది శిక్షణ పొందిన పోలీసులకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చివుంటే సాధారణ పరిస్థితుల్లో వీరు గుంపుతో సమర్థంగా వ్యవహరించి వారిని చెదరగొట్టి ఉండేవారు. అయితే మూకహింసను ఎదుర్కోవడానికి ఎంతమేరకు బలాన్ని ప్రయోగించవచ్చో స్పష్టంగా వారికి చెప్పనట్లయితే, పరిస్థితి అదుపు తప్పడానికే ఆస్కార ముంటుంది. అదే జరిగింది కూడా. సదరు పోలీసు స్టేషన్‌లో జరిగిన ఘటన పోలీసు నాయకత్వం, రాష్ట్ర రాజకీయ నాయకత్వం వైఫల్యమేనని నేను కచ్చితంగా చెబుతాను.

వార్తల ప్రకారం సీనియర్ ఐపీఎస్ అధికారులు తర్వాత స్పందించి, అమృత్‌పాల్‌తో మాట్లాడారు. వరీందర్ కిడ్నాప్ వ్యవహారంలో లవ్‌ప్రీత్ పాత్ర లేదని అమృత్‌సర్ పోలీస్ కమిషనర్, అజ్‌నాలా ఎస్ఎస్‌పీకి అమృత్‌పాల్ నచ్చజెప్పినట్లు కనబడుతోంది. దాంతో లవ్‌ప్రీత్‌ను విడుదల చేయడానికి సీనియర్ అధికారులు అంగీకరించారు. ఇలా లొంగిపోవడం ఇకనుంచీ పోలీసు, రాజకీయ నాయకత్వానికి సమస్యలు తీసుకొస్తుంది.

తన ప్రాథమిక ఫిర్యాదులో లవ్‌ప్రీత్ పేరును వరీందర్ బయట పెట్టారు. అలాంటప్పుడు నిజంగా కిడ్నాప్ ఘటన జరిగిందా అని



పోలీసులు తనిఖీ చేసివుండవలసింది. వరీందర్‌ను కొట్టిందెవరు? అమృత్‌పాల్ వ్యాఖ్యలను అతడు వ్యతిరేకించినట్లు చెబుతున్నారు. అదే నిజమైతే, దాడి వెనుక ఉద్దేశం అర్థమవుతోంది.

ఇలాంటి ముఖ్యమైన రాజకీయ పరిణామం పట్ల అజ్‌నాలా పోలీసులు తమ పైఅధికార్లను లూపులో పెట్టివుండవచ్చు. అయిదు పోలీసు స్టేషన్లపై అధికారం కలిగిన ఆఫీసర్ మాత్రమే సమీప పోలీసు స్టేషన్ల నుంచి అదనపు బలగాల మోహరింపునకు ఆదేశాలు ఇవ్వగలడు. ఒకవేళ సాయుధ బటాలియన్ నుంచి రిజర్వ్ బలగాలను తరలించి ఉంటే, అలాంటి ఆదేశం రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి మాత్రమే వచ్చి ఉంటుంది. అలాంటప్పుడు ఎఫ్ఐఆర్‌లో పొందుపర్చిన వ్యక్తిని అరెస్టు చేయాలనే నిర్ణయం గురించి తమకు తెలీదని సీనియర్లు చెప్పుకొనే అవకాశమే లేదు.

చట్టవిరుద్ధమైన డిమాండ్లకు లొంగిపోవడంలో రాజకీయ నాయకత్వం పాత్రను నేను చూస్తున్నాను. ఈ విషయాలన్నీ ముఖ్యమంత్రికి తెలీకుండా పోయే ప్రశ్నే లేదు. భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం ఇంకా భద్రతా రంగంపై పట్టు సాధించవలసే ఉంది. లేదంటే ఇది 'ఆప్' ప్రభుత్వ ఆయువు పట్టును దెబ్బకొడుతుంది.

ఇప్పుడు ఇంకా ఘోరమైన విషయం ఏమిటంటే, అతి సున్నితమైన ఈ సరిహద్దు రాష్ట్రంలో ఉగ్రవాదం తిరిగి పొడసూపే అవకాశం ఉండటమే. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన మన పొరుగుదేశం మళ్లీ సరిహద్దు పొడవునా ఘర్షణలు రేపడానికి ప్రయత్నించవచ్చు. 1980లలో మన పొరుగు దేశమే ఖాలిస్తానీ ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి ఆశ్రయం కల్పించింది. పైగా సరిహద్దు పొడవునా ఆయుధాలను సరఫరా చేసింది. అమృత్‌పాల్‌తో కూడా మన పొరుగు దేశం సంబంధాలు పెట్టుకోవచ్చు. ఇప్పటికే ఆ ప్రయత్నం జరిగిందో!

ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి తగిన వ్యక్తి– జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోబాల్. ఏం చేయాలో ఆయనకు తెలుసు. ఇదంతా ఎలా జరిగింది, దీన్ని పరిష్కరించడానికి ఎవరిపై విశ్వాసం ఉంచాలి వంటి వివరాలు ఆయనకు తెలుసు. అమృత్‌పాల్‌కు అసమంజసమైన ఆకర్షణ రావడాన్ని అనుమతించకూడదు. జయింపశక్యం కాని వలయం అతడి చుట్టూ ఏర్పడకముందే అతడిని అదుపు చేయాలి. అజ్‌నాలాలో అతడు విజయాన్ని రుచిచూశాడు. దానికి అనుగుణంగా పంజాబ్‌లో అతడికి మద్దతు పెరుగుతుంది.

బీజేపీకి స్వాగతం పలకని రాష్ట్రంలో రాజకీయ ప్రయోజనం పొందడానికి అజ్‌నాలాలో పంజాబ్ ప్రభుత్వ వైఫల్యాన్ని ముందు పీటికి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించవచ్చు. అలా చేస్తే అది కూడా తప్పిదమే అవుతుంది. ఆప్ భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. ఆప్ సిక్కు ముఖచిత్రంగా మాన్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. బీజేపీ కూడా కెప్టెన్ అమరీందర్ సింగ్‌ను తన పార్టీ సిక్కు ముఖంగా తీసుకొచ్చింది. కానీ అతడి బలం పనిచేయలేదు. మోదీ ప్రభుత్వం ముందున్న తెలివైన ఎంపిక ఏమిటంటే, పంజాబ్‌ను దాని మానాన దాన్ని వదిలేయడమే. లేకుంటే తన చేతులను తానే కాల్చుకోవలసి వస్తుంది.

దీనికంటే మించిన చెత్త ఎంపిక ఏమిటంటే, రాజకీయాలు ఆడటమే. ఎందుకంటే మాన్, ఆయన పార్టీని ఒక పిల్లకాకి విపత్కర పరిస్థితుల్లోకి నెట్టేశాడు. ఇతగాడు గత సంవత్సరం దాకా నీట్‌గా షేవ్ చేసుకుని దుబాయ్‌లో ఇదమిత్థం కాని జీవితం గడుపుతుండేవాడు. తనలోని సహజ ప్రతిభలకు అవకాశం లభించనుందని గ్రహించిన అమృత్‌పాల్ అప్పటినుంచి గడ్డం పెంచడమే కాకుండా, భింద్రాన్‌వాలేను అనుకరిస్తూ దుస్తులను ధరించడం ప్రారంభించాడు. పోలీసులు చర్య తీసుకోవడాన్ని అడ్డుకునేందుకు గురు గ్రంథ్ సాహిబ్‌ను తన అనుచరులు నిత్యం వెంట ఉంచుకునేలా చేశాడు.

సమస్యను మొగ్గలోనే తుంచేసే అవకాశం లేకుండా పోయింది. రాజకీయ, పోలీసు నాయకత్వం చేయవలసిన పని క్లిష్టతరమైంది. ఆప్ ప్రభుత్వం డోబాల్ సహాయం తీసుకోవాలి. సలహాదారుగా తన పాత్రను ప్రకటించకుండానే తెర వెనుక ఆయన చాలా చేయగలడు. ఈ సమస్యకు ద్విముఖ వ్యూహం అవసరం. పంజాబ్ జనాభాలో చాలా భాగం, ముఖ్యంగా గ్రామాల్లోని జాట్ సిక్కు రైతులు 1980, 90ల మొదట్లో ఉగ్రవాదం బీభత్సంతో తీవ్ర బాధలకు గురయ్యారు. ప్రజారాశులతో కమ్యూనికేషన్ మార్గాలు పెరిగినందున, అమృత్‌పాల్, అతడి అనుయాయులను అదుపులోకి తీసుకోవాలి. రాజకీయ ప్రతిపక్షాలు, విమర్శకులకు వ్యతిరేకంగా అన్ని చట్టాలను ఉపయోగిస్తున్న బీజేపీ... రాష్ట్ర ప్రభుత్వాన్ని, కేంద్రాన్ని కాటు వేయడానికి ముందే ఉగ్రవాదంపై ఆ చట్టాలను ఉపయోగించాలి.

వ్యాసకర్త పోలీస్ మాజీ ఉన్నతాధికారి, 'పద్మభూషణ్'
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



ఎలా వదిలేస్తారు?



ద్వేషం, హింసలను ప్రేరేపించడానికి ఫేక్ వీడియోలు వాడిన అందరినీ చట్టపరంగా శిక్షించాలి. అంతమాత్రాన తమిళనాడులోని హిందీ మాట్లాడే జనాల పట్ల బహిరంగంగా హింసను రెచ్చగొడుతున్న వాళ్లు నిర్దోషులైపోరు. విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన 'నామ్ తమిళియర్ కచ్చి' పార్టీ సీమన్ లాంటివాళ్ల మీద ఎందుకు చర్యలు తీసుకోరు?

– ప్రశాంత్ కిశోర్, రాజకీయ వ్యూహకర్త

పెద్దవాడే...



ఒక అబ్బాయికి ఒక మహిళను అత్యాచారం చేయగలిగేంత శారీరక సామర్థ్యం ఉంటే, అతడి మీద 'జువెనైల్' (బాలుడు)గా కాకుండా పెద్దవాడిగానే విచారణ జరపాలి.

– ఐశ్వర్యా ముద్గిల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఎందుకిలా?



టాయ్‌లెట్‌ను వాడిన తర్వాత ఇండియన్లు ఎందుకు ఆ మొత్తం టాయ్‌లెట్‌ను తడిపేస్తారు? మలం తర్వాత అంత జలం ఎందుకో!

– శ్రీరామ్ వి., ఆంట్రప్రెన్యూర్

మనకోసమైనా...



ప్రియమైనవాళ్ల ఆరోగ్యం గురించి తరచుగా ఆందోళన చెందకుండా ఎలా జీవించాలో నేర్చుకుంటున్నాను. అది చాలా కష్టం. కానీ ఒక రకంగా ఆలోచిస్తే, అవసరం కూడా.

– షబ్నమ్ ఖాన్, కాలమిస్ట్

మూక తత్వం



అన్ని హోలీ హింస వీడియోల్లోనూ ఉన్నది కొందరు మూక మగవాళ్లు, ఒంటరి అమ్మాయి. ఇది మగవాళ్ల పిరికితనం గురించి ఎంతగానో చెబుతుంది. వాళ్లు గొప్పగా చెప్పుకొనే 'ప్రతాపం' అంతా కేవలం వాళ్ల తలకాయల్లో మాత్రమే ఉంటుంది.

– సంగీతా నంజి, రచయిత్రి

వాళ్లు మాట్లాడరు



హిందూ మహిళల స్వేచ్ఛ బొట్టు పెట్టుకోకుండా ఉండటంలో, ముస్లిం మహిళల స్వేచ్ఛ బుర్ఖా ధరించడంలో ఉంది... ఇదీ మొత్తంగా ఇండియా లోని ఉదార వాదుల వైఖరి! ఒక హిందూ మహిళ బొట్టు పెట్టుకోవాలో వద్దో ఆమె ఎంపిక, దానికి నేను మద్దతి స్తాను. కానీ కశ్మీర్‌లో ఒక మహిళ హిజాబ్ ధరించనందుకు చంపుతామంటూ వచ్చిన బెదిరింపుల పట్ల ఉదారవాదులు, స్త్రీవాదులు మౌనం వహించడం గమనించాను.

– అమనా బేగమ్ అన్సారీ, పాలసీ అనలిస్ట్

ఎక్కువగా ఆలోచించకుండా...



'చాట్‌జీపీటీ' ఇప్పుడున్న రూపంలో జనాలు మరింత, మరింత తక్కువగా నేర్చుకునేట్టు, ఆలోచించేట్టు చేయడానికి నయాఉదారవాదం, దాని ప్రియ రాజకీయ నాయకులు ప్రారంభించిన అత్యంత అధునాతన ఆయుధం. అప్పుడే వాళ్లు పడక వినియోగదారుల (కౌచ్ కన్జ్యూమర్స్) ఆదర్శానికి సమీపించగలరు!

– తబీష్ ఖైర్, రచయిత

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.చవితి రా.8.16 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** స్వాతి పూర్తి (24గంటలు), **వర్జ్యం:** ప.11.41 నుండి 1.19 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.17 నుండి 7.51 వరకు, **అమృతఘడియలు:** రా.9.24 నుండి 11.02 వరకు.

సూర్యోదయం : 6.16
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

వయసు పుష్కరం... విజయాలు పుష్కలం

సందర్భం



డా. డి.వి.జి. శంకర రావు

ఈ మార్చి 12న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 13వ పుట్టినరోజు జరుపుకొంటోంది. 2011లో ఆవిర్భవించిన ఈ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో నేడు రాజకీయ రంగాన్ని శాసిస్తోంది. తన నడకలో తొమ్మిదేళ్ల ప్రతిపక్షంగా, మూడేళ్ల అధికారపక్షంగా పూర్తి చేసుకుని భవిష్యత్ వైపు ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తోంది. పార్టీ అధ్యక్షుడిగా నేటి ముఖ్యమంత్రి జగన్ వేసిన తొలి ఒంటరి అడుగు, రానురాను లక్షలాది పార్టీ శ్రేణులతో కలిసి ప్రజా ప్రవాహమై సాగుతోంది. ప్రజల్లో ప్రవహిస్తోంది.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పుట్టుక ఒక తిరుగుబాటు బావుటా. దేశాన్ని అప్పుడు పాలిస్తున్న ఒక జాతీయ పార్టీ అహంకారానికి వ్యతిరేకంగా బలంగా నిలబడ్డ ఒక ప్రాంతీయ ఆత్మ గౌరవం. జాతీయ పార్టీ కాంగ్రెస్‌కి జీవిత కాలం సేవలందించి అకాల మరణం పొందిన జననేత నాటి ముఖ్యమంత్రి వైఎస్సార్. ఆయన మృతి వార్త విని తట్టుకోలేక పదుల సంఖ్యలో అభిమానులు అసువులు బాశారు. ఆ కుటుంబాల్ని ఓదార్పు యాత్ర ద్వారా పరామర్శిద్దామని ఆయన తనయుడు జగన్ తలిస్తే, అధిష్టానం వద్దని అంది. అది సబబు కాదని ఆయన అధిష్టానాన్ని ధిక్కరిస్తూ యాత్ర కొనసాగించారు. అక్కడి నుండే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బీజం పడింది. ఆ తర్వాత ప్రజల్లోనే ఉంటూ, ప్రజలతోనే నడుస్తూ, వారి ఆశీస్సులతోనే ఎదిగింది.



రాష్ట్ర విభజన అనంతరం 2014 ఎన్నికల్లో 44 శాతం ఓట్లు సంపాదించి త్రుటిలో అధికారాన్ని కోల్పోయింది. నాడు అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ, తమ పార్టీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను ప్రలోభ పర్చుకున్నా వెనకడుగు వెయ్యలేదు. అడుగు ముందుకే పడింది. అనంతరం వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్ర ఒక కీలక ఘట్టం. ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల్ని తెలుసుకుంటూ వాటి ఆధారంగా తమ పార్టీ మ్యానిఫెస్టో తయారు చేసుకున్నారు. 2019 ఎన్నికల్లో 151 స్థానాలతో తిరుగులేని విజయాన్ని పొంది ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టారు.

ఈ మూడేళ్లలో మ్యానిఫెస్టోలోని 95 శాతం హామీల్ని కార్యరూపం లోకి తీసుకురావడం, పూర్తి చెయ్యడం దేశంలోనే ఒక రికార్డు. సచివాలయాలు ఏర్పాటుచేశారు. వలంటీరు వ్యవస్థ ద్వారా గ్రామాల్లో పాలనను ప్రజల గడప దగ్గరకు తీసుకు వచ్చారు. అర్హులకు నేరుగా లబ్ధి చేకూర్చారు. విద్య, ఆరోగ్య సేవలపై దృష్టి పెట్టి గణనీయమైన మార్పులు తెచ్చారు. వాటి ఫలితంగా మానవ వనరుల అభివృద్ధి సూచీల్లో రాష్ట్రం ర్యాంకు మెరుగు పడింది. కరోనా వంటి విపత్కర కాలంలో కూడా సంక్షేమం ప్రజల చెంతకు చేరింది. జిల్లాల వికేంద్రీకరణ ద్వారా పాలన చేరువైంది. ఎన్నికల్లోనే కాకుండా ఎంపికలోనూ, పదవుల్లోనే కాకుండా పనుల్లోనూ సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని వర్గాలకూ పెద్దపీట వేస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధి, సాధికారికత దిశగా రాష్ట్రం పయనిస్తోంది. ఇప్పుడు రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక బలమైన శక్తి. ప్రజాబలం పుష్కలంగా ఉన్న పార్టీ. 13వ జన్మదిన శుభాకాంక్షలు!

వ్యాసకర్త మాజీ ఎంపీ, పార్వతీపురం । 94408 36931

ఈ సామాన్య మహిళ ఓ చైతన్య దీప్తి!

నివాళి



చల్లపల్లి స్వరూపరాణి

1990ల్లో జరిగిన మహిళల సారా వ్యతిరేక ఉద్యమాన్ని పెత్తందారీ కులాల స్త్రీలు ఎంచక్కా కబ్జా చేశారు. తాగుబోతు భర్తలతో పడలేక బాధిత దళిత ఆదివాసీ స్త్రీలు... ప్రభుత్వం గ్రామాలలో సారా దుకాణాలను బంద్ పెట్టాలని అనేక చోట్ల రోడ్డెక్కి నినదించడమే కాదు ప్రభుత్వాల మెడలు వంచారు. వాళ్ళంతా పోలీసుల లాఠీ దెబ్బలు తిని ఇంటికెళ్తే లోపలికి రావద్దని భర్తలచేత గెంటేయ బడ్డారు. అయినా ఉద్యమాన్ని కొనసాగించారు. ఇంతలో పట్టణాల నుంచి వచ్చిన సిద్ధాంతాలు తెలిసిన పెత్తందారీ కులాల స్త్రీలు సారా వ్యతిరేక ఉద్యమ విజయాన్ని తమ ఖాతాలో జమ చేసుకుని వెళ్ళారు. సారా వ్యతిరేక ఉద్యమాన్ని అట్టడుగు కులాల స్త్రీలు నడిపితే ఆ ఉద్యమానికి నాయకురాలిగా పెద్ద కులానికి చెందిన దూబగుంట రోశమ్మ పేరు ప్రసిద్ధికెక్కింది. అణగారిన కులాల స్త్రీల పేర్లు మచ్చుకైనా కనబడకపోవడం యాదృచ్ఛికం కాదు. ఈ నేపథ్యం నుండి జయ భాగ్యమ్మ వచ్చింది.

ఇటీవల దళిత ఉద్యమాన్ని ప్రతిఘటనా స్థాయికి తీసుకెళ్ళి అటు ప్రభుత్వాలకు, ఇటు పెత్తందారీ కులాల దౌర్జన్యకారులకు మింగుడు పడకుండా వార్తలలో వ్యక్తిగా అసాధారణమైన గుర్తింపును పొందింది భాగ్యమ్మ. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం, పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన నిరక్షరాస్యురాలైన డెబ్బైయ్యేడేళ్ల ఈమె జీవితం పోరాటాల మయం. రెక్కల కష్టంతో బతుకుతూ సారా ఉద్యమం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేవరకూ తన స్ఫూర్తివంతమైన ప్రస్థానాన్ని సాగించిన భాగ్యమ్మ మార్చి 1న కన్ను మూసింది.

పెదగొట్టిపాడు సగటు భారతీయ గ్రామానికి నిలువెత్తు ప్రతినిధి. అక్కడ కుల భూస్వామ్యం బాహాటంగానే బుసలు కొడుతుంది. అయితే ఆ ఊరిలో మాలా మాదిగలు కలిసి సుమారు వెయ్యి గడప ఉండే దళిత వాడ ఉంది. ఆ వాడ బిడ్డే జయభాగ్యమ్మ. ఆమెకు కనీసం ప్రాథమిక స్థాయి చదువు లేకపోయినప్పటికీ అసాధారణమైన జ్ఞానం ఆమె సొత్తు. భాగ్యమ్మ భర్త తాగుబోతు, పేకాట రాయుడు. వ్యసనపరుడైన తన భర్తతో పాటు... దళిత వాడలో తాగి తందనాలాడుతూ భార్యా బిడ్డలకు కూలీ డబ్బులు కూడా మిగలకుండా చేసే భర్తలందరికీ బుద్ధి చెప్పడానికి ఆమె నడుం కట్టింది. ఆ గ్రామంలో ఉన్న ప్రభుత్వ సారా దుకాణాన్నీ, లైసెన్స్ ఉన్న మరో ప్రైవేటు మద్యం దుకాణాన్నీ మూయించేవరకు ఆమె తన పోరాటాన్ని కొనసాగించింది. జయ భాగ్యమ్మకు అప్పటి నుంచి ఆ గ్రామంలో కొందరు స్త్రీ, పురుషులు అభిమానులుగా మారి ఆమెను తమ నాయకురాలిగా గౌరవించడం మొదలు పెట్టారు.



జొన్నలగడ్డ జయభాగ్యమ్మ

మద్యం దుకాణాల మూసివేత తర్వాత క్రమంగా పెదగొట్టిపాడు దళితవాడ అభివృద్ధి వైపు పయనించడం మొదలు పెట్టిందనవచ్చు. మారని భర్తతో తెగతెంపులు చేసుకుని ముగ్గురు పిల్లల్ని తన రెక్కల కష్టంతో పెంచి, పెద్ద చేసింది. పిల్లలు ఎవరి దారిన వారు వెళ్తే... తనొక్కతే కూలీ నాలీ చేసుకుంటూ బతుకుపోరు సాగించింది. సారా వ్యతిరేక ఉద్యమం ద్వారా సమర్థ నాయకురాలిగా అందరి దృష్టిలో పడిన భాగ్యమ్మను లోక్ సత్తా పార్టీ జయప్రకాష్ నారాయణ గుర్తించి ఆమెకు పార్టీ సీటివ్వడంతో 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేసింది.

2018లో గొట్టిపాడు దళితవాడపై అక్కడి పెత్తందారీ కులస్థులు చేసిన దాడికి నిరసనగా వెల్లువెత్తిన ఉద్యమంలో జయభాగ్యమ్మ ఒక నిర్ణయాత్మకమైన పాత్ర పోషించింది. ఆ ఉద్యమం ప్రతిఘటనా స్థాయికి వెళ్ళడంలో ఆమె అందించిన తోడ్పాటు ఎంతో కీలకమైనది. గత ఫిబ్రవరి మాసంలో ఆమె గొట్టిపాడు బాధిత దళిత మహిళలను సమీకరించి వారితో గ్రామంలో నిరాహార దీక్షా కార్యక్రమాన్ని నిర్వహించి దళిత ప్రతిఘటనా ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది. ఇంతలోనే మృత్యువు కబళించింది. ఆమె ఎన్నటికీ అగచాట్ల సుడిగుండాల్లో చిక్కుకున్న సామాన్య మహిళలకు చైతన్య దీప్తే!

వ్యాసకర్త కవయిత్రి, నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్, లా కాలేజ్ ప్రిన్సిపల్
(2023 మార్చి 1న జయభాగ్యమ్మ తుదిశ్వాస విడిచారు.)

'హవాలా' దోపిడీ ముఠా సభ్యుల అరెస్టు

- కేరళకు చెందిన నలుగురిని అరెస్టు చేసిన 'అనంత' పోలీసులు
- రూ.1.89 కోట్ల నగదు, 2 కార్లు, 5 మొబైల్ ఫోన్ల స్వాధీనం


నగదును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: హవాలా మార్గంలో తరలుతున్న డబ్బుపై కన్నేసి.. దారిదోపిడీ చేసే ముఠాలోని నలుగురు సభ్యులను అనంతపురం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.89 కోట్లు, 2 కార్లు, 5 మొబైల్స్, 13 నంబరు ప్లేట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ డాక్టర్ కె.ఫక్కీరప్ప శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాలులో వెల్లడించారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని హంపాపురం వద్ద 44వ జాతీయ రహదారిపై గత నెల 26న దారి దోపిడీ జరిగింది. హైదరాబాదులో బంగారం అమ్ముకుని నగదుతో బెంగళూరుకు తిరిగి వెళుతున్న వారిపై ముఠా దాడి చేసి డబ్బుతో ఉడాయించింది. ఈ కేసును పోలీసులు సవాలుగా తీసుకుని దర్యాప్తు చేపట్టారు. 25 బృందాలను రంగంలోకి దింపారు. ఎట్టకేలకు తమిళనాడు రాష్ట్రం తుత్తుకూడిలో కీలక సమాచారం సేకరించారు. హవాలా దోపిడీలలో పేరుమోసిన కేరళ శ్రీధరన్ ఆధ్వర్యంలో పలు గ్యాంగులు ఈ తరహా దోపిడీలు చేస్తున్నట్లు ఆధారాలు సేకరించారు. ఆ దిశగా దర్యాప్తు చేపట్టి రాప్తాడు పరిధిలో దారిదోపిడీలో పాలుపంచుకున్న కేరళ రాష్ట్రం ఎర్నాకుళం జిల్లా ఆలువ వెస్ట్ గ్రామానికి చెందిన కొలపురంబిల్ అబు నిషాద్, కొట్టాయం జిల్లా చెంగానచేపూర్‌కు చెందిన జాక్సన్ ఫిలిప్, అలప్పుజ జిల్లా వేలంకులంగరకు చెందిన కన్నన్ రియాగు, కాలికట్ జిల్లా వడకర గ్రామానికి చెందిన ఓతవాత్ షమీంలను పోలీసులు అరెస్టు చేశారు.

శ్రీధరన్ ఆట కట్టిస్తాం: ఎస్పీ


'హవాలా' దోపిడీల్లో ఆరితేరిన కేరళ శ్రీధరన్ ఆటకట్టిస్తామని ఎస్పీ ఫక్కీరప్ప తెలిపారు. హవాలా సొమ్మును కారులో తరలిస్తున్న భరత్, రామచంద్రలను కూడా అదుపులోకి తీసుకుని హవాలా సొమ్ము మూలాల గురించి క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అనంత పోలీసులను డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి అభినందించినట్లు తెలిపారు.

సాగరతీరాన్ని శోధిద్దాం..

డాల్ఫిన్ నోస్‌పై కోస్టల్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు

- రూ.62 కోట్లతో 5.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం
- రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తీర పరిశోధనకు ప్రణాళికలు
- నేడు భూమి పూజ చేయనున్న ఎన్‌సీసీఆర్


కోస్టల్ రీసెర్చ్ సెంటర్ నిర్మాణ నమూనా


డాల్ఫిన్ నోస్ పర్వతం

సాక్షి, విశాఖపట్నం: ఉష్ణమండల తుపాన్లు, రుతుపవన సీజన్‌లో వచ్చే వరదలు, సముద్ర మట్టాల పెరుగుదల, మడ అడవుల విస్తీర్ణం తగ్గుదల, కాలుష్య కారకాలు పెరుగుతున్న నేపథ్యంలో సాగర తీరంలో పెను మార్పులు సంభవిస్తున్నాయి. ఇటీవల కాలంలో దేశంలోనే రెండో అతి పెద్ద తీర రేఖ కలిగి ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తీరం కోతకు గురవుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. వీటిని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పరిశోధనలు చేస్తోంది. ఈ తరుణంలో మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ అనుబంధ సంస్థ నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్(ఎన్‌సీసీఆర్) ఏపీ తీర ప్రాంత పరిరక్షణకు నడుం బిగించింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తీరంలో తలెత్తుతున్న అలజడులపై పరిశోధనలు నిర్వహిస్తూ.. సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలకు ఉపక్రమించేలా పక్కా ప్రణాళికలతో అడుగులేస్తోంది.

డాల్ఫిన్ నోస్‌పై 5.5 ఎకరాల విస్తీర్ణంలో..

విశాఖ నగరానికి పెట్టని కోటలా.. రక్షణ వ్యవస్థకు పెద్దన్నలా వ్యవహరిస్తున్న డాల్ఫిన్ నోస్‌పై ఈ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రూ.62 కోట్ల వ్యయంతో 5.5 ఎకరాల విస్తీర్ణంలో ఈ భవన నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేయనున్నారు. పరిశోధన కేంద్రంతో పాటు ఎర్త్‌సైన్స్ విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని కూడా నిర్మిస్తున్నారు. లేబొరేటరీ భవనం, పరిశోధన భవనం, వర్క్‌షాప్, ఆడిటోరియం, సెమినార్‌హాల్, గెస్ట్ హౌస్, హాస్టల్‌తో పాటు ఇతర భవనాలను నిర్మించనున్నారు. మన తీరంలో ఉన్న సమస్యలపై ముఖ్యంగా ఈ కేంద్రం పరిశోధనలు చేయనుంది. ప్రతి సమస్యపై పరిశోధనలు నిర్వహించి వాటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి.. సమస్య నివారణకు తగిన చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా షోర్‌లైన్ మేనేజ్‌మెంట్ అట్లాస్ సిద్ధం చేసిన ఎన్‌సీసీఆర్.. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ షోర్‌లైన్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను తయారు చేయనుంది. దీని ద్వారా ఏపీ తీర ప్రాంతాలు కోతకు గురవుతున్నాయి? వాటిని ఎలా పరిష్కరించాలనే విషయంలో ముందు జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది. తీరంలో ఎక్కడెక్కడ ఎంత మేర కాలుష్యం ఉంది? దీనివల్ల మత్స్య సంపద, జీవరాశులకు ఎలాంటి విఘాతం కలుగుతోంది? దీని వల్ల సముద్రాల్లో వస్తున్న మార్పులు, మడ అడవులు విస్తీర్ణం తగ్గడం వల్ల తలెత్తుతున్న ప్రమాదాలు.. తదితర వాటిపై నిరంతరం పరిశోధనలు ఇకపై విశాఖ కేంద్రంగా జరగనున్నాయి.

ఏపీ సముద్ర జలాల పరిరక్షణకు కృషి



విశాఖలో నిర్మిస్తున్న పరిశోధన కేంద్రం ద్వారా సముద్రజలాల నాణ్యత మానిటరింగ్, ప్రిడిక్షన్ ఆఫ్ కోస్టల్ వాటర్ క్వాలిటీ(పీడబ్ల్యూక్యూ), ఎకోసిస్టమ్ సర్వీస్, సముద్ర తీర ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు.. తదితర అంశాలపై పరిశోధనలు చేస్తాం. సముద్రంలో చేరుతున్న కాలుష్య కారకాలు, పెరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలపైనా దృష్టి సారిస్తాం. ఈ కేంద్రం ద్వారా ఏపీ సముద్ర జలాల పరిరక్షణకు ఎన్‌సీసీఆర్ పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని విశ్వసిస్తున్నాం. – డా.ఎంవీ రమణమూర్తి, ఎన్‌సీసీఆర్ డైరెక్టర్

తిరుపతి ఎస్వీ జూపార్కుకు పులి కూనలు


గదిలో సురక్షితంగా ఉన్న పులికూనలు

తిరుపతి అలిపిరి: తల్లికి దూరమైన పులి కూనలను అటవీశాఖ అధికారులు శుక్రవారం సురక్షితంగా తిరుపతి శ్రీవేంకటేశ్వర జూ పార్క్‌కు చేర్చారు. నంద్యాల జిల్లా గువ్వలకుంట-బి రిజర్వ్ ఫారెస్ట్‌లో నాలుగు పులి కూనలను తల్లి పులి వదిలి వెళ్లడం తెలిసిందే. 50–60 రోజుల వయస్సు ఉన్న పులి కూనలను నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ వెటర్నరీ డాక్టర్లు విస్లీ, జుబేరీ, ఎస్కార్ట్ సిబ్బందితో కలసి తీసుకువచ్చారు. జూ పార్కులో అన్ని సదుపాయాలతో కూడిన గదిలో ఉంచి జూ వెటర్నరీ డాక్టర్లు సత్యప్రకాష్ అరుణ్, డాక్టర్ థోయిబా సింగ్ సంరక్షణలో కూనల ఆలనా పాలన చూసుకుంటున్నారు.

వెంకన్న సన్నిధిలో ఒక్కటైన ఐఏఎస్‌లు

ఘనంగా ఐఏఎస్ అధికారులు పృథ్వీతేజ్, జాహ్నవి వివాహం


నూతన దంపతులు పృథ్వీతేజ్, జాహ్నవిలతో తోటి అధికారులు

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలకు చెందిన ఐఏఎస్ అధికారి ఇమ్మడి పృథ్వీతేజ్ (హెచ్ఆర్ అండ్ అడ్మినిస్ట్రేషన్), ఐఏఎస్ అధికారిణి జాహ్నవి వివాహ వేడుక శ్రీవారి కొండపైన మాధవ కల్యాణ మండపంలో శుక్రవారం అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ప్రిన్సిపల్ కార్యదర్శులు ప్రద్యుమ్న, శ్రీలక్ష్మి, దయానంద్, ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, పలు జిల్లాల ఐఏఎస్ అధికారులు హాజరై పృథ్వీతేజ్, జాహ్నవి దంపతులను ఆశీర్వదించారు.

ల్యాప్రోస్కోపిక్‌తో కిడ్నీ, బ్లాడర్ తొలగింపు

- కర్నూలు పెద్దాస్పత్రిలో అత్యాధునిక వైద్యం
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్లు


ఆపరేషన్ చేయించుకున్న రోగులతో వైద్య బృందం

కర్నూలు(హాస్పిటల్): కార్పొరేట్ ఆస్పత్రుల్లో నిర్వహించే అత్యాధునిక శస్త్ర చికిత్సలు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రారంభమయ్యాయి. క్యాన్సర్ సోకిన కిడ్నీ, బ్లాడర్‌లను ల్యాప్రోస్కోపిక్ విధానంలో తొలగించి రోగులకు ప్రాణం పోశారు. ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, యూరాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సీతారామయ్య శుక్రవారం దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. గతంలో కిడ్నీ, బ్లాడర్(మూత్రాశయం) ఆపరేషన్లను సాధారణ పద్ధతిలో పెద్దగా కోత కోసి నిర్వహించేవారు. తాజాగా ల్యాప్రోస్కోపిక్ విధానంలో చిన్న కోతతో శస్త్రచికిత్స చేస్తున్నారు. గత రెండు నెలల కాలంలో కిడ్నీకి క్యాన్సర్ సోకిన రామాంజనేయులు, శ్రీనివాసులుతో పాటు బ్లాడర్‌కు క్యాన్సర్ సోకిన మహబూబ్‌బాషా, తిమ్మయ్య, చందునాయక్, హనుమంతరాయుడులకు ల్యాప్రోస్కోపిక్ పరికరం ద్వారా ఆపరేషన్ చేసి అవయవాలను తొలగించారు. దీనివల్ల పెద్దగా కోత పడకపోవడం, రక్తస్రావం తక్కువగా ఉండటంతో రోగి త్వరగా కోలుకుంటాడు. వీరందరికీ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్‌లు చేసినట్టు డాక్టర్ సీతారామయ్య తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఇలాంటి ఆపరేషన్లు చేయడం ఇదే మొదటిసారని చెప్పారు. శస్త్రచికిత్సలు చేసిన వారిలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ముత్యశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ బాలరవితేజ, పీజీలు డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ భాస్కరరెడ్డి, డాక్టర్ హిమజ, డాక్టర్ లైక్ ఫాతిమా, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

• విశాఖపట్నం నుంచి నంద్యాలకు అక్రమంగా గంజాయి తరలించి విక్రయిస్తున్న 18 మందిని నంద్యాల జిల్లా పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వీరి నుంచి 41 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశాఖ జిల్లా చింతలపల్లికి చెందిన రాజారావు, విజయవాడకు చెందిన పద్మ, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన కొర్రా వెంకటరమణ కలిసి నంద్యాల జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయించేవారు. శుక్రవారం గంజాయి తీసుకొస్తున్నారనే సమాచారం మేరకు రెల్వేస్టేషన్‌లో పట్టుకున్నారు.

మాకు ఉద్యోగం కల్పించింది సీఎం జగనే

- ఆయన మేలు సచివాలయ ఉద్యోగులు ఎప్పటికీ మరువరు
- ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ఉద్యోగుల ఆందోళనలో సచివాలయ ఉద్యోగులు పాల్గొనద్దు
- ఒక సంఘం వారి అవసరాల కోసం, వారి స్వార్థం కోసమే ఆందోళనలు
- సహచర ఉద్యోగులకు గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఒక ఉద్యోగ సంఘం వారి అవసరాల కోసం, వారి స్వార్థం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలకు పిలుపునిచ్చి, అందులో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కూడా పాల్గొనాలంటూ ప్రలోభాలకు గురిచేస్తోందని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ తప్పుపట్టింది. ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీ అంకమరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్‌కృష్ణ, అదనపు ప్రధాన కార్యదర్శి బీఆర్ఆర్ కిషోర్‌లు శుక్రవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో వారేమన్నారంటే.. 'అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకే నోటిఫికేషన్ ద్వారా 1.34 లక్షల ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నిరుద్యోగులుగా ఉన్న లక్షల మందికి ఉద్యోగావకాశం కల్పించి, రెగ్యులర్ ఉద్యోగులుగా చేయడమే కాక.. ఈహెచ్ఎస్, ఏపీజీఎల్ఐ, 010 పద్దు ద్వారా ఒకటో తేదీనే జీతాలు, వివిధ రకాల ఆర్జిత సెలవులు తదితర ఎన్నో సదుపాయాలు కూడా కల్పించారు. ఇంతటి మేలును గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులం ఎప్పటికీ మర్చిపోలేం. మనకు ఇంత మేలుచేసిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ఆందోళనలో ఏ ఒక్క ఉద్యోగి పాల్గొనద్దు. ప్రజలకు ఉన్నత సేవలు అందిస్తూ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చి, మన సమస్యలు ఏమున్నా ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తూ రావాల్సిన ప్రయోజనాలను సాధించుకుందాం'.. అని వారు పేర్కొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ ముగ్గురికే మద్దతు..

ఇక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్, పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, వెన్నపూస రవీంద్రరెడ్డిలకు తాము మద్దతు ఇస్తున్నట్లు ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు బీ అంకమరావు, విప్పర్తి నిఖిల్ కృష్ణ, బీఆర్ఆర్ కిషోర్‌లు అదే ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి వీరికి సంపూర్ణ మద్దతు ప్రకటించారని.. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌లో తమ సంఘం ఒక భాగంగా కొనసాగుతుందని తెలిపారు. అలాగే, కాకర్ల వెంకటరామిరెడ్డి సూచన మేరకు మన సభ్య సంఘాలలో ఉండే గ్రాడ్యుయేట్ ఓటర్లు అందరూ ఆ ముగ్గురు అభ్యర్థులను గెలిపించుకునేందుకు బాధ్యతతో పనిచేస్తారని తెలిపారు. ఇక మార్చి 13న జరిగే ఎన్నికల్లో వారిని గెలిపించాల్సిన బాధ్యత ఎంప్లాయీస్ అసోసియేషన్ సంఘ సభ్యులందరూ తీసుకుని పనిచేయాలని కోరారు.

ఎలక్ట్రానిక్ రంగంలో భారీ పెట్టుబడులు



- మొత్తం రూ.15,711 కోట్లు పెట్టేందుకు 23 సంస్థలు సంసిద్ధత
- వీటిద్వారా 57,640 మందికి ఉపాధి
- ఆసక్తి చూపిస్తున్న సంస్థల్లో ప్రధానమైనవి టీసీఎల్, సన్నీఆప్టెక్, డైకిన్, రఫే ఎంఫిబిర్, సెల్‌కాన్ రెజల్యూట్
- మరికొన్ని కంపెనీలు సైతం ఆసక్తి..

ప్రధాన కంపెనీల పెట్టుబడి ఒప్పంద వివరాలు..

కంపెనీ	పెట్టుబడి (రూ.కోట్లల్లో)	ఎంతమందికి ఉపాధి
టీసీఎల్ గ్రూపు	5,000	5,000
డైకిన్	2,600	5,000
సన్నీ ఆప్టెక్	2,500	10,000
సెల్‌కాన్ రెజల్యూట్	1200	5,500
రఫే ఎంఫిబిర్	1,000	500
ఎస్2పీ సోలార్ సిస్టమ్స్	850	900
బ్లూస్టార్	550	1,000
నియోలింక్ గ్రూపు	300	3,000
క్లైయిర్ ఎలక్ట్రానిక్స్	90	3,000
కేకేఎం అగ్రి ప్రాజెక్ట్స్	135	2,400

సాక్షి, అమరావతి : ఎలక్ట్రానిక్స్ అండ్ డిజైనింగ్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం భారీగానే పెట్టుబడులు ఆకర్షించింది. ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సందర్భంగా ఎలక్ట్రానిక్స్ రంగంలో రూ.15,711 కోట్ల విలువైన 23 ఒప్పందాలు జరిగినట్లు రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ వెల్లడించారు. ఈ పెట్టుబడుల ద్వారా 57,640 మందికి ప్రత్యక్షంగా, వేలాది మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న ఎలక్ట్రానిక్స్ కంపెనీలు విస్తరణ చేపట్టేలా ఒప్పందం చేసుకోగా మరికొన్ని కొత్త కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి. ఇందులో అత్యధిక పెట్టుబడులు తిరుపతి, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లోనే వచ్చాయి.

అత్యధికంగా టీసీఎల్ గ్రూప్..

టీసీఎల్ గ్రూపు రాష్ట్రంలో అత్యధికంగా రూ.5,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. టీవీ డిస్‌ప్లే ప్యానల్స్‌ను టీసీఎల్ గ్రూపు ఉత్పత్తి చేయనుంది.

- సెల్‌ఫోన్ కెమెరాలు, ఇయర్ ఫోన్స్ వంటి ఉపకరణాలను తయారుచేసేందుకు సన్నీఆప్టెక్ రూ.2,500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.
- అలాగే, ఇప్పటికే శ్రీసిటీలో పెట్టుబడులు పెట్టిన బ్లూస్టార్, డైకిన్ సంస్థలు తమ విస్తరణ కార్యక్రమాలను ప్రకటించాయి. డైకిన్ సంస్థ రూ.2,600 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం చేసుకోగా.. బ్లూస్టార్ రూ.550 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.
- ఇవికాక.. డ్రోన్స్, లాజిస్టిక్ సొల్యూషన్స్, డిఫెన్స్, వ్యవసాయ రంగాల్లో ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను తయారుచేసే పలు సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రస్తుతం 23 సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోగా మరిన్ని సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరుపుతోందని అపిటా గ్రూపు సీఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇక తిరుపతిలో రెండు, శ్రీసిటీలో ఒకటి, వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో వైఎస్సార్ ఈఎంసీ మొత్తం నాలుగు ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్స్ అందుబాటులో ఉండటంతో ఎలక్ట్రానిక్స్ సంస్థలు రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...

కర్ణాటక ఎన్నికల ప్రచార కమిటీ సారథిగా సీఎం బొమ్మై



న్యూఢిల్లీ: కర్ణాటక అసెంబ్లీకి మరికొద్ది నెలల్లో జరగనున్న ఎన్నికలకు బీజేపీ సమాయత్తమైంది. రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మైను నియమించింది. అదేవిధంగా ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా కేంద్ర మంత్రి శోభా కరంద్లాజెను ప్రకటించింది. ఎన్నికల ప్రచార కమిటీ సభ్యుడిగా మాజీ సీఎం యెడియూరప్పను నియమించింది. ఈ మేరకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు కమిటీలకు రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన లింగాయత్, వొక్కలిగ కులాలకు చెందిన బొమ్మై, కరంద్లాజెలకు సారథ్య బాధ్యతలు అప్పగించడం ద్వారా బీజేపీ జాతీయ నాయకత్వం సమతూకం సాధించేందుకు ప్రయత్నించింది.

బీకేయూ నేత తికాయత్‌కు బెదిరింపులు



ముజఫర్‌నగర్(యూపీ): భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చాయి. రైతు సంఘాల ఆందోళనల నుంచి దూరంగా ఉండకుంటే రాకేశ్ తికాయత్, ఆయన కుటుంబాన్ని బాంబు వేసి చంపుతామంటూ ఓ ఆగంతకుడు ఫోన్ ద్వారా హెచ్చరించాడు. ఈ మేరకు రాకేశ్ తికాయత్ సోదరుడు గౌరవ్ తికాయత్, బీకేయూ అధ్యక్షుడు నరేశ్ తికాయత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వ్యక్తిని గుర్తించి, పట్టుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించామని భవురా కలాన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో అక్షయ్ శర్మ చెప్పారు. రద్దయిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఏడాదిపాటు సాగిన ఆందోళనలకు నాయకత్వం వహించిన రైతు నేతల్లో రాకేశ్ తికాయత్ ఒకరు. చట్టాలు రద్దయిన తర్వాత కూడా ఆయన దేశవ్యాప్తంగా వివిధ సమస్యలపై రైతు సంఘాలు చేపట్టే నిరసనల్లో పాల్గొంటున్నారు.

ఉక్రెయిన్ కోసం ఏడ్చేవాళ్లెవరు?

ఇప్పడెవరికీ పట్టని యుద్ధం.. ప్రపంచ దేశాల ప్రేక్షక పాత్ర

(ఎస్.రాజమహేంద్రారెడ్డి)



సరిగ్గా ఏడాది క్రితం యముని మహిషపు లోహపు గంటల గణగణలు విని ప్రపంచం యావత్తూ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ గణగణలు దిక్కులు పిక్కటిల్లేలా భూగోళమంతా మారుమోగుతాయేమోనని ఆందోళన పడింది. రష్యా సమరనాదం ఉక్రెయిన్‌ను ఉక్కిరిబిక్కిరి చేసి అనివార్యంగా ప్రపంచ దేశాలను రెండుగా చీల్చడం ఖాయమని పరిశీలకులూ భయంభయంగానే అంచనా వేశారు. మిత్ర దేశం బెలారస్ భుజం మీద ట్యాంకులను మోహరించి ఉక్రెయిన్‌పై రష్యా దాడికి దిగింది. చిరుగాలికే వొణికిపోయే చిగురుటాకులా ఉక్రెయిన్ తలవంచడం ఖాయమనే అనుకున్నారంతా! యుద్ధమంటేనే చావులు కదా. మృతదేహాల ఎర్రటి తివాచీ మీద నుంచే విజయం నడిచో, పరుగెత్తో వస్తుంది. యుద్ధం కొనసాగుతున్న కొద్దీ, ప్రపంచం దృష్టంతా రణక్షేత్రంపైనే నిలిచింది. అయ్యో అన్నవాళ్లున్నారు, రెండు కన్నీటి చుక్కలతో జాలి పడ్డవారూ ఉన్నారు. ప్రత్యక్షంగానో పరోక్షంగానో వైరి పక్షాల వైపు నిలిచిన దేశాలు మాట సాయమో, మూట సాయమో, ఆయుధ సాయమో చేసి తమ వంతు పాత్రను పోషిస్తూనే ఉన్నాయి. తటస్థంగా ఉన్నవాళ్లూ ఉన్నారు. చమురు కోసమో, తిండిగింజల కోసమో రష్యాపై ఆధారపడ్డ దేశాలు ఇప్పుడెలా అని తల పట్టుకుని ఆలోచనలో పడ్డాయి. ఒకవైపు రష్యా వైఖరిని వ్యతిరేకిస్తూ మరోవైపు దిగుమతులను స్వాగతించడం ఎలా గన్నదే వాటిముందు నిలిచిన మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇండియాకు ఇవేమీ పట్టలేదు. ఉక్రెయిన్‌లో వైద్యవిద్య అభ్యసిస్తున్న భారత విద్యార్థులను స్వదేశానికి తీసుకు రావడాన్నే యుద్ధం తొలినాళ్లలో లక్ష్యంగా పెట్టుకుంది. ఎందుకంటే భారత్ తటస్థ ధోరణికే కట్టుబడింది. నెలలు గడిచి యేడాది పూర్తయ్యేసరికి రెండు దేశాలు యుద్ధం చేస్తూనే ఉన్నాయి. మిగతా దేశాలు తమ సమస్యలను తమదైన రీతిలో, రష్యా మీద ఆధారపడాల్సిన అవసరం లేనంతగా పరిష్కరించుకున్నాయి. ఇప్పుడు యుద్ధం హాలీవుడ్ వార్ సినిమాయే.. ప్రాణ నష్టం గణాంకాలే! యుద్ధం కూడా రోజువారీ దినచర్యలా రొటీన్‌గా మారిపోయినప్పుడు ఒక్క కన్నీటి బొట్టయినా రాలుతుందా? అయినా ఉక్రెయిన్ కోసం ఏడ్చేవాళ్లెవరు? తండ్రినో, భర్తనో, కొడుకునో కోల్పోయిన అభాగ్యులు తప్ప!

పక్కింటి గొడవ స్థాయికి...

యుద్ధం తొలినాళ్లలో ఇకపై చమురెలా అన్నదే యూరప్‌ను వేధించిన ప్రశ్న. యూరోపియన్ యూనియన్ (ఈయూ) దేశాలు తమ చమురు అవసరాల్లో దాదాపు 40 శాతం రష్యాపైనే ఆధారపడేవి. సహాయ నిరాకరణలో భాగంగా ఆ దిగుమతులను నిలిపివేయక తప్పలేదు. తప్పని పరిస్థితుల్లో జర్మనీ నుంచి ఇటలీ దాకా, పోలండ్ దాకా తమ దిగుమతుల పాలసీని మార్చుకుని ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకున్నాయి. అధిక ధరకు చమురును ఇతర దేశాల నుంచి కొనాల్సి వచ్చినా, పొదుపు మంత్రంవేసి కుదుటపడ్డాయి. ప్రత్యామ్నాయ మార్గం దొరికే వరకు యుద్ధం తమ గుమ్మం ముందే కరాళ నృత్యం చేస్తోందన్నంతగా హడలిపోయి ఉక్రెయిన్ పట్ల కాస్త సానుభూతిని, కాసిన్ని కన్నీటి బొట్లను రాల్చిన ఈ దేశాలన్నీ ఒక్కసారిగా కుదుటపడి ఊపిరి పీల్చుకున్నాయి. ఇప్పుడు యుద్ధం ఈ దేశాలకు పక్కింటి గొడవే..! ఇక భారత్ విషయానికొస్తే నాటో దేశాల సహాయ నిరాకరణతో లాభపడిందనే చెప్పాలి. బ్యారెల్లలో మూలుగుతున్న చమురును ఏదో ఒక ధరకు అమ్మేయాలన్న వ్యాపార సూత్రాన్ని అనుసరించి రష్యా భారత్‌కు డిస్కౌంట్ ఇస్తానని ప్రతిపాదించింది. ఫలితంగా గత ఏడాది మార్చి 31 దాకా రష్యా చమురు ఎగుమతుల్లో కేవలం 0.2 శాతంగా ఉన్న భారత్ వాటా ఈ ఏడాది ఏకంగా 22 శాతానికి చేరింది! యుద్ధమంటే బాంబుల మోత, నేలకొరిగిన సైనికులు, ఉసురు కోల్పోయిన సామాన్య పౌరులు మాత్రమే కాదు, కొందరికి వ్యాపారం కూడా! భారత్‌కు చమురు లాభమైతే ఆయుధ తయారీ దేశాలకు వ్యాపార లాభం. యుద్ధమంటే ఆయుధ నష్టం కూడా. జర్మనీ, ఫ్రాన్స్, చెక్ రిపబ్లిక్, పోలండ్ లాంటి దేశాలు సరిగ్గా దీన్నే తమకు అనుకూలంగా మలుచుకున్నాయి. ఆయుధ ఉత్పత్తిని పెంచి, సొమ్ము చేసుకుంటున్నాయి. ఏడాది తిరిగేసరికి యుద్ధం చుట్టూ పరిస్థితులు ఇంతలా మారితే కదనరంగంలో పిట్టల్లా రాలుతున్న వారి గురించి ఎవరాలోచిస్తారు? ప్రాథమ్యాల జాబితాలో యుద్ధం ఇప్పుడు చిట్టచివరి స్థానానికి నెట్టివేతకు గురైంది. రణక్షేత్రంలోని వైరి పక్షాలకు తప్ప మిగతా దేశాలకు ఇప్పుడది కేవలం ఒక వార్త మాత్రమే!

బావుకున్నదేమీ లేదు

మిత్ర దేశాలు, శత్రు దేశాలు, తటస్థ దేశాలను, వాటి వైఖరులను పక్కన పెడితే వైరి పక్షాలైన రష్యా, ఉక్రెయిన్ కూడా బావుకున్నదేమీ లేదు. ప్రాణనష్టం, ఆయుధ నష్టాల్లో హెచ్చుతగ్గులే తప్ప రెండు దేశాలూ తమ పురోగతిని ఓ నలభై, యాభై ఏళ్ల వెనక్కు నెట్టేసుకున్నట్టే! శ్మశాన వాటికలా మొండి గోడలతో నిలిచిన ఉక్రెయిన్ మునుపటి స్థితికి చేరుకోవడానికి ఎన్నేళ్లు పడుతుందో యుద్ధం ముగిస్తే తప్ప అంచనా వేయలేం. యుద్ధం వల్ల పోగొట్టుకున్న పేరు ప్రతిష్టలను, కోల్పోయిన వీర సైనికులను రష్యా వెనక్కు తెచ్చుకోగలదా? ఏడాదైనా ఉక్రెయిన్‌పై పట్టు బిగించడంలో ఘోరంగా విఫలమైన రష్యా సైనిక శక్తి ప్రపంచం దృష్టిలో ప్రశ్నార్థకం కాలేదా? నియంత పోకడలతో రష్యాను జీవితాంతం ఏలాలన్న అధ్యక్షుడు పుతిన్ పేరు ప్రతిష్టలు యుద్ధంతో పాతాళానికి దిగజారలేదా? ఆయన తన రాజ్యకాంక్షను, తన అహాన్ని మాత్రమే తృప్తి పరచుకోగలిగారే తప్ప... ప్రపంచాన్ని కాదు, తన ప్రజలను కానే కాదు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పరిస్థితి కూడా పుతిన్‌కు భిన్నంగా ఏమీ లేదు. గొంగళి పురుగు సీతాకోక చిలుకగా రూపాంతరం చెందినట్టు జెలెన్‌స్కీ హాస్య నటుడి నుంచి హీరో అయ్యారు. రష్యా క్షిపణి దాడుల్లో దేశం వల్లకాడులా మారుతున్నా జెలెన్‌స్కీపై మాత్రం పొగడ్తల వర్షం కురుస్తూనే ఉంది. ఆయన ఎక్కడికెళ్లినా రాచ మర్యాదలతో స్వాగతం పలుకుతున్నారు. సాహసివంటూ పొగుడుతున్నారు. దేశం నాశనమవుతోందని బాధ పడాలో, ఎగురుతున్న తన కీర్తిబావుటాను చూసి సంతోషించాలో జెలెన్‌స్కీకి అర్థం కావడం లేదు. బహుశా ఆయన త్రిశంకుస్వర్గంలో ఉండి ఉంటారు.

కొసమెరుపు

కదనరంగంలో గెలుపోటములు ఇప్పుడప్పుడే తేలే అవకాశమే లేదు. ఎవరిది పైచేయి అంటే చెప్పడం కూడా కష్టమే. స్థూలంగా చెప్పాలంటే రష్యా ఆక్రమించుకున్న భూభాగంలో 54 శాతాన్ని ఉక్రెయిన్ మళ్లీ తన అధీనంలోకి తెచ్చుకుంది. అన్ని రోజులూ ఒక్కరివి కాదంటారు కదా! ఒకరోజు రష్యాదైతే మరో రోజు ఉక్రెయిన్‌ది..అంతే! ఇప్పుడు ఈ యుద్ధం ప్రపంచానిది ఎంతమాత్రం కాదు, రష్యా–ఉక్రెయిన్‌లది మాత్రమే. కొనసాగించడంతో పాటు ముగించడం కూడా ఆ రెండు దేశాల చేతుల్లోనే ఉంది. అయినా ఈ యుద్ధాన్ని ఎవరు పట్టించుకుంటున్నారిప్పుడు?

మహిళల సారథ్యంలో అభివృద్ధి వైపు భారత్

ఎస్‌హెచ్‌జీలను యూనికార్న్‌ల స్థాయికి తీసుకెళ్తాం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భారతదేశం గత 9 ఏళ్లలో మహిళాభివృద్ధి నుంచి మహిళల నేతృత్వంలో అభివృద్ధి వైపు పయనించిందని ప్రధాని మోదీ అన్నారు. మహిళా స్వయం సహాయక బృందా(ఎస్‌హెచ్‌జీ)లను యూనికార్న్‌ల స్థాయికి తీసుకెళతామని చెప్పారు. మహిళా సాధికారతపై శుక్రవారం జరిగిన పోస్ట్ బడ్జెట్ వెబినార్‌లో ప్రధాని ప్రసంగించారు. 'ఇంజనీరింగ్, సైన్స్, టెక్నాలజీ, మేథ్స్ రంగాల్లో మహిళల భాగస్వామ్యం ప్రస్తుతం 43%కి చేరుకుంది. స్వయం సహాయ సంఘాలను కూడా ఈ ఏడాది యూనికార్న్‌లుగా మార్చాలని బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకోసం ఎస్‌హెచ్‌జీలకు మద్దతుగా నిలుస్తాం. గత 9 ఏళ్లలో ఎస్‌హెచ్‌జీల్లో 7 కోట్ల మంది మహిళలు చేరారు. ఎస్‌హెచ్‌జీల ద్వారా అందించిన రుణాలు రూ.6.25 లక్షల కోట్లకు చేరాయి. వ్యవసాయేతర ప్రతి ఐదు వ్యాపారాల్లో ఒకటి మహిళే నడుపుతున్నారు'అని ఆయన చెప్పారు. స్టాక్ మార్కెట్‌లో నమోదు కాకుండానే 1 బిలియన్ డాలర్ల స్థాయికి ఎదిగిన కంపెనీలనే యూనికార్న్‌లంటారు. 'ముద్రా రుణ గ్రహీతల్లో 70% మంది మహిళలే. వీరు తమ కుటుంబ సంపదను పెంచడంతోపాటు దేశానికి నూతన ఆర్థిక మార్గాలను తెరుస్తున్నారు. మహిళల పట్ల గౌరవం, సమానత్వ భావన స్థాయిలను పెంచడం ద్వారా మాత్రమే దేశం ముందుకు సాగుతుంది'అని ప్రధాని చెప్పారు.

విపత్తులొస్తే నష్టాన్ని తగ్గించుకోగలగాలి

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహకారం తీసుకోవాలని ప్రధానమంత్రి అన్నారు. విపత్తు ముంచుకొచ్చాక స్పందించడం కంటే, ముందుగానే ఫ్యూచర్ టెక్నాలజీని వినియోగించుకొని జరిగే నష్టాన్ని తగ్గించుకోవాలన్నారు. నేషనల్ ప్లాట్‌ఫారమ్ ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ (ఎన్‌పీడీఆర్‌ఆర్) మూడో సదస్సును శుక్రవారం ప్రారంభించి ప్రధాని మాట్లాడారు.

ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం లాలూ కుమార్తెలు, కుమారుడి నివాసాల్లో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ/పట్నా: 'ల్యాండ్ ఫర్ జాబ్స్' కుంభకోణంతో సంబంధం ఉన్న మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణను వేగవంతం చేసింది. బిహార్‌లోని పలు నగరాలతోపాటు ఇతర ప్రాంతాల్లో రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) నేతల నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. ఆర్జేడీ సీనియర్ నేత, బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ముగ్గురు కుమార్తెలు రాగిణి యాదవ్, చందా యాదవ్, హేమా యాదవ్, తనయుడు, బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ నివాసాల్లోనూ సోదాలు జరిగాయి. దర్యాప్తులో భాగంగా పట్నా, పుల్వారీ షరీఫ్, ఢిల్లీ, రాంచీ, ముంబైలో సోదాలు చేపట్టినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. దక్షిణ ఢిల్లీలో తేజస్వీ యాదవ్ ఇంట్లో సోదాలు జరుగుతున్నప్పుడు ఆయన అక్కడ ఉన్నారో లేదో తెలియరాలేదు. సీబీఐ, ఈడీ ఉద్దేశపూర్వకంగానే ప్రతిపక్ష నేతలను వేధింపులకు గురి చేస్తున్నాయని ఆర్జేడీ నాయకుడు మనోజ్ ఝా మండిపడ్డారు. లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబ సభ్యులు, ఆర్జేడీ నేతలు కొందరు యువకుల వద్ద భూములు తీసుకొని, రైల్వేశాఖలో ఉద్యోగాలు కల్పించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఇందులో మనీ లాండరింగ్ కోణం సైతం ఉండడంతో ఈడీ దర్యాప్తు సాగిస్తోంది. లాలూ, ఆయన భార్య రబ్రీదేవితో పాటు మరో 14 మందిపై సీబీఐ ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేసింది.

ఇరాన్, సౌదీ అరేబియా స్నేహగీతం

దుబాయ్: ప్రత్యర్థి దేశాలుగా ఇన్నాళ్లూ కత్తులు దూసుకున్న ఇరాన్, సౌదీ అరేబియా ఇప్పుడు స్నేహగీతం ఆలపిస్తున్నాయి. దౌత్యపరమైన సంబంధాలను పునరుద్ధరించుకొనేందుకు, రాయబార కార్యాలయాలను తెరిచేందుకు ఇరు దేశాలు శుక్రవారం అంగీకారానికొచ్చాయి. ఇరాన్, సౌదీ అరేబియా మధ్య ఏడేళ్ల క్రితం సంబంధాలు తెగిపోయాయి. చైనా చొరవతో మళ్లీ సంబంధాలు మెరుగుపడుతున్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య సాయుధ ఘర్షణ తలెత్తే ప్రమాదం ఇక తప్పినట్లేనని పరిశీలకులు చెబుతున్నారు. గల్ఫ్‌లోని అరబ్ దేశాలు అగ్రరాజ్యం అమెరికా వైపు మొగ్గుచూపకుండా చైనా ఎత్తుగడలు వేస్తోంది. ఇందులో భాగంగా ఇరాన్, సౌదీ అరేబియా నడుమ ఇటీవలే సయోధ్య కుదిర్చింది. ఇది చైనాకు దౌత్యపరంగా అతిపెద్ద విజయమని నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనాతో కుదిరిన ఒప్పందంపై ఇరాన్, సౌదీ అరేబియా ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. అయితే, దీనిపై చైనా మీడియా ఇంకా స్పందించలేదు. యెమెన్‌లో ఇరాన్, సౌదీ అరేబియా ఘర్షణలు కూడా సమసేలా కనిపిస్తున్నాయి.

ఈడీ కస్టడీకి మనీష్ సిసోడియా

సాక్షి, న్యూఢిల్లీ: లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటూ అరెస్టయిన ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను ఈ నెల 17 వరకూ కస్టడీలోకి తీసుకునేందుకు రౌజ్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ ఈడీని అనుమతించారు. సీబీఐ చేతిలో అరెస్టయి తీహార్ జైలులో ఉన్న సిసోడియాను, తాజాగా ఈడీ అధికారులు మనీ లాండరింగ్ కేసులో అరెస్టు చేసి శుక్రవారం ప్రత్యేక కోర్టులో హాజరు పరిచారు. ఆయన్ను పదిరోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని ఈడీ తరఫు న్యాయవాది కోరారు. వాదనల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేరు కూడా ప్రస్తావనకు వచ్చింది. కవితతో ఆప్ నేత విజయ్ నాయర్ భేటీ అయ్యారని చెప్పారు.

సిసోడియా 14 ఫోన్లు ధ్వంసం చేశారు: ఈడీ

ఎక్సైజ్ పాలసీ అమలులో సిసోడియా పాత్ర ఉందని, కొన్ని ప్రైవేటు సంస్థలకు హోల్‌సేల్ వ్యాపార లాభం 12 శాతం ఇవ్వాలనే కుట్రలో భాగంగా ఈ పాలసీ అమలు చేశారని ఈడీ న్యాయవాది ఆరోపించారు. సౌత్ గ్రూపు సభ్యులు 9 జోన్లలో నియంత్రణ తీసుకున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. సాక్ష్యాల ధ్వంసంలో భాగంగా సిసోడియా 14 ఫోన్లు ధ్వంసం చేశారని వీటిలో రెండింటిని మాత్రమే రికవరీ చేయగలిగామని తెలిపారు. విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలు పరిశీలిస్తే మద్యం పాలసీ రూపకల్పనలో సిసోడియా ప్రమేయం ఉన్నట్లు స్పష్టం అవుతోందన్నారు. ఇది రూ.292 కోట్లకు పైగా విలువైన నేరమని, దీనిపై పూర్తిస్థాయిలో విచారించాల్సిన ఉన్నందున సిసోడియాను 10 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఈడీ తరఫు న్యాయవాది కోరారు.

ఎల్జీ క్లియర్ చేసిన తర్వాతే అమల్లోకి..

మనీలాండరింగ్ ఆరోపణలు చేస్తున్నప్పటికీ ఒక రూపాయి కూడా సిసోడియా నుంచి స్వాధీనం చేసుకోలేదని ఆయన తరఫు న్యాయవాది కృష్ణన్ తెలిపారు. పాలసీకి సంబంధించిన ఫైల్ లెఫ్టినెంట్ గవర్నర్ క్లియర్ చేసిన తర్వాతే అమల్లోకి వచ్చిందని, కాబట్టి లెఫ్టినెంట్ గవర్నర్‌ను కూడా ఈడీ ప్రశ్నిస్తుందని భావిస్తున్నామని కృష్ణన్ పేర్కొన్నారు. అనంతరం సిసోడియాను ఈ నెల 17 వరకూ ఈడీ కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. కాగా, లిక్కర్ స్కామ్‌కు సంబంధించి సీబీఐ దాఖలు చేసిన కేసులో బెయిల్ కోరుతూ మనీష్ సిసోడియా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ప్రత్యేక కోర్టు వాయిదా వేసింది. ఈ నెల 21న దీనిపై విచారణ చేపడతామని జడ్జి స్పష్టం చేశారు.

చరిత్రకెక్కిన జిన్‌పింగ్

- చైనా అధ్యక్షుడిగా, సీఎంసీ చైర్మన్‌గా మూడోసారి
- ఏకగ్రీవంగా ఎన్నుకున్న పార్లమెంట్
- మరో ఐదేళ్లు పదవుల్లో కొనసాగనున్న జిన్‌పింగ్



బీజింగ్: డ్రాగన్ దేశం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్(69) సరికొత్త చరిత్ర సృష్టించారు. దేశాధ్యక్షుడిగా, సైన్యాధిపతిగా వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. జిన్‌పింగ్ ఎన్నికకు చైనా పార్లమెంట్ శుక్రవారం ఏకగ్రీవంగా ఆమోదముద్ర వేసింది. ఆయన చైనా అధ్యక్షుడిగా, అత్యంత శక్తివంతమైన సెంట్రల్ మిలటరీ కమిషన్(సీఎంసీ) చైర్మన్‌గా మరో ఐదేళ్లపాటు పదవుల్లో కొనసాగుతారు. ఒకవైపు అమెరికా, యూరోపియన్ యూనియన్(ఈయూ)తో ఉద్రిక్తతలు క్రమంగా పెరుగుతుండడం, మరోవైపు చైనా ఆర్థిక వ్యవస్థ మందగిస్తున్న తరుణంలో జిన్‌పింగ్ వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయన జీవితకాలం ఇదే పదవిలో కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇందుకోసం పార్టీ రాజ్యాంగాన్ని 2018లో సవరించారు.

ఉపాధ్యక్షుడిగా హన్ జెంగ్

జిన్‌పింగ్‌ను మరోసారి దేశాధ్యక్షుడిగా, సీఎంసీ చైర్మన్‌గా నియమిస్తూ అధికార కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా(సీపీసీ) చేసిన ప్రతిపాదనను రబ్బర్ స్టాంప్ పార్లమెంట్‌గా ముద్రపడిన నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్(ఎన్‌పీసీ) లాంఛనంగా ఆమోదించింది. పార్లమెంట్‌లోని 2,952 మంది సభ్యులు అంగీకారం తెలిపారు. చైనాలో ఒక నాయకుడు మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఇదే ప్రథమం. జిన్‌పింగ్ కంటే ముందు పనిచేసిన అధ్యక్షులంతా రెండు పర్యాయాలే(10 సంవత్సరాలు) పదవీలో కొనసాగారు. చైనా మాజీ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు హన్ జెంగ్‌ను ఉపాధ్యక్షుడిగా ఎన్‌పీసీ నియమించింది. గత ఏడాది అక్టోబర్ జరిగిన కమ్యూనిస్టు పార్టీ ప్లీనరీలో జిన్‌పింగ్‌ను పార్టీ ప్రధాన కార్యదర్శిగా మళ్లీ ఎన్నుకున్న సంగతి తెలిసిందే. మావో జెడాంగ్ తర్వాత చైనా కమ్యూనిస్టు పార్టీకి మూడోసారి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైజిన్‌పింగ్ రికార్డుకెక్కారు.

దూకుడు పెంచుతారా?

జిన్‌పింగ్ చేతిలో ప్రస్తుతం మూడు శక్తివంతమైన పదవులు ఉన్నాయి. ఎలాంటి ఆటంకాలు లేకుండా మరోసారి కుర్చీ దక్కడంతో జిన్‌పింగ్ దూకుడు పెంచే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా. పొరుగు దేశం భారత్‌పై ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. ఇరు దేశాల నడుమ ఉద్రిక్తతలు పెచ్చరిల్లే ప్రమాదం ఉందంటున్నారు. సెంట్రల్ కేబినెట్(స్టేట్ కౌన్సిల్)కు నేతృత్వం వహిస్తున్న చైనా ప్రధాని (ప్రీమియర్) లీ కెకియాంగ్ పదవీ కాలం ముగిసింది. ఆయన స్థానంలో జిన్‌పింగ్‌కు సన్నిహితుడైన లీ కియాంగ్‌ను శనివారం ఎన్నుకోనున్నట్లు తెలుస్తోంది.

మాజీ అగ్నివీర్‌లకు బీఎస్ఎఫ్ ఉద్యోగాల్లో 10% రిజర్వేషన్

కేంద్ర హోం శాఖ వెల్లడి

న్యూఢిల్లీ: సైనిక దళాల్లో ఎంపికల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన అగ్నిపథ్ పథకం పట్ల యువతను ఆకర్షితులను చేసే దిశగా కేంద్రం ఒక ప్రకటన చేసింది. అగ్నివీర్ ద్వారా ఎంపికై నిబంధనల మేరకు నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని రిటైరైన అభ్యర్థులకు సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించింది. అంతేకాదు, గరిష్ఠ వయోపరిమితిలో కూడా సడలింపులు ఉంటాయని తెలిపింది. ఇందుకు వీలు కల్పిస్తూ బీఎస్ఎఫ్ జనరల్ డ్యూటీ కేడర్(నాన్ గెజిటెడ్) రిక్రూట్‌మెంట్–2015 నిబంధనల్లో మార్పులు చేపట్టినట్లు వెల్లడించింది. ఇవి మార్చి 9వ తేదీ నుంచే అమల్లోకి వచ్చాయని ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. మొదటి బ్యాచ్ మాజీ అగ్నివీర్‌లకు గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్ల వరకు సడలింపు ఉంటుందని కేంద్ర హోం శాఖ అందులో వివరించింది. ఇతర బ్యాచ్‌ల వారికైతే మూడేళ్ల వరకు సడలింపు ఉంటుంది. మాజీ అగ్నివీర్‌లకు ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ నుంచి మినహాయింపు కూడా ఉంటుంది.

దేశంలో మొదటి హెచ్3ఎన్2 మరణాలు నమోదు

- కేరళ, హరియాణాల్లో ఇద్దరు మృతి
- మార్చి చివరికల్లా కేసులు తగ్గుతాయంటున్న కేంద్రం



న్యూఢిల్లీ: దేశంలో కొత్తరకం ఇన్‌ఫ్లూయెంజా హెచ్3ఎన్2 ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కర్ణాటక, హరియాణాల్లో ఈ సీజనల్ వైరస్ బారిన పడి ఇద్దరు మృతి చెందారు. వైరస్ వ్యాప్తి, కేసులు, మరణాల సంఖ్య తదితర పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. ఈ నెలాఖరుకు కేసులు తగ్గుముఖం పడతాయని భావిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో వివరించింది. పిల్లలు, వృద్ధులు ఈ వైరస్ బారినపడే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. తీవ్రమైన శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ కలిగించే ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌లు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లోనూ సీజనల్‌గా వ్యాప్తి చెందుతుంటాయని పేర్కొంది. మనదేశంలో ఇవి ఏటా జనవరి–మార్చి నెలల మధ్య, రుతుపవనాల సీజన్‌లోనూ ఎక్కువగా కనిపిస్తుంటాయని తెలిపింది. 'కర్ణాటకకు చెందిన హీరె గౌడ(82) హెచ్3ఎన్2 వైరస్ బారిన పడి మార్చి ఒకటో తేదీన చనిపోయారు. ఆయనకు ఇప్పటికే డయాబెటిస్, హైపర్‌టెన్షన్ వంటి సమస్యలున్నాయి. ఫిబ్రవరి 24న ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మార్చి ఒకటో తేదీన చనిపోయారు. అదేవిధంగా, హరియాణాలోని జింద్ జిల్లాకు చెందిన 56 ఏళ్ల లంగ్ కేన్సర్ రోగికి కూడా జనవరి 17న హెచ్3ఎన్2గా నిర్ధారణైంది. ఆయన ఫిబ్రవరి 2న మృతి చెందారు'అని అధికారులు చెప్పారు. దేశంలో జనవరి 2 నుంచి మార్చి 5 వరకు 451 హెచ్3ఎన్2 కేసులు నమోదయ్యాయని ఆరోగ్య శాఖ తెలిపింది. అదేవిధంగా, మార్చి 9వ తేదీనాటికి వివిధ రకాల ఇన్‌ఫ్లూయెంజా కేసులు 3,038 వరకు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదేవిధంగా జనవరిలో ఇన్‌ఫ్లూయెంజా వంటి లక్షణాలతో వివిధ ఆస్పత్రుల్లో 3,97,814 కేసులు నమోదు కాగా, వాటి సంఖ్య ఫిబ్రవరిలో 4,36,523కు, మార్చి 9వ తేదీకల్లా ఇవి 1,33,412కు చేరాయని పేర్కొంది. ఇందులో తీవ్ర శ్వాసకోశ సమస్యల(ఎస్ఏఆర్ఐ)తో జనవరిలో 7,041, ఫిబ్రవరిలో 6,919, మార్చి మొదటి 9 రోజుల్లో 1,866 కేసులు నమోదయ్యాయి.

అప్రమత్తంగా ఉండండి: దేశంలో పెరుగుతున్న హెచ్3ఎన్2 కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ రాష్ట్రాలను కోరారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి నమోదవుతున్న ఇన్‌ఫ్లూయెంజా కేసుల్లో హెచ్3ఎన్2 రకమే ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలతో కలిసి పనిచేస్తున్నామన్నారు.

బీబీసీకి వ్యతిరేకంగా గుజరాత్ అసెంబ్లీ తీర్మానం

గాంధీనగర్: 'ఇండియా: ది మోదీ క్వశ్చన్'పేరుతో 2002లో జరిగిన ఘర్షణలపై బీబీసీ ప్రసారం చేసిన డాక్యుమెంటరీ వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ డాక్యుమెంటరీని ప్రసారం చేసి ప్రధాని మోదీ ప్రతిష్టను దెబ్బతీసిన బీబీసీపై చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరుతూ శుక్రవారం గుజరాత్ అసెంబ్లీ తీర్మానం చేసింది. ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులను స్పీకర్ బహిష్కరించిన అనంతరం బీజేపీ సభ్యుడు విపుల్ వకీల్ ఈ మేరకు తీర్మానం ప్రవేశపెట్టారు.

బీజేపీకి మద్దతు పలికిన స్వతంత్ర ఎంపీ సుమలత




మాండ్య: కర్ణాటకకు చెందిన స్వతంత్ర ఎంపీ సుమలత అంబరీష్ కేంద్రంలోని బీజేపీకి పూర్తిస్థాయి మద్దతు ప్రకటించారు. మోదీ నాయకత్వంలో భారత్‌కు లభించిన సుస్థిరత, దేశం ప్రపంచవ్యాప్తంగా సంపాదించిన ఖ్యాతిని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. 'నాలుగేళ్లపాటు స్వతంత్రంగా వ్యవహరించాను. ఈ సమయంలో బహిరంగ సమావేశాల్లో పాల్గొనడం వంటి విషయాల్లో పలు సవాళ్లను ఎదుర్కొన్నాను. వీటిని దృష్టిలో ఉంచుకునే మద్దతు అవసరమని భావించాను. అందుకే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి పూర్తి స్థాయి మద్దతు ఇస్తున్నాను'అని ఆమె మీడియాతో అన్నారు. కన్నడ అగ్ర నటుడు దివంగత అంబరీష్ భార్య అయిన సుమలత బహు భాషా నటి.

ఆలయాలపై దాడులు ఆందోళనకరం

- ఆస్ట్రేలియాలో ఘటనలతో కలత చెందుతున్నాం: ప్రధాని మోదీ
- భారతీయుల భద్రతకు మాది పూచీ: ఆస్ట్రేలియా ప్రధాని అల్బానీస్

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బానీస్‌తో శుక్రవారం సమావేశమయ్యారు. అంతర్జాతీయ పరిణామాలతోపాటు కీలక ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ప్రతిష్టాత్మకమైన వాణిజ్య ఒప్పందం, ఇండో–పసిఫిక్ ప్రాంతంలో భద్రత, పరస్పర సహకారం వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. క్లీన్ ఎనర్జీ, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, ఖనిజాలు, వలసలు, సప్లై చైన్లు, విద్యా, సాంస్కృతికం, క్రీడల్లో ఇకపై కలిసి పనిచేయాలని, ఒకరికొకరు సహకరించుకోవాలని అంగీకారానికొచ్చారు. ఆస్ట్రేలియాలో హిందూ ఆలయాలపై ఇటీవల జరిగిన దాడుల గురించి అల్బానీస్ వద్ద మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆస్ట్రేలియాలో ఖలిస్తాన్ మద్దతుదారుల కార్యకలాపాలు పెరుగుతుండడాన్ని గుర్తుచేశారు. క్రీడలు, నవీన ఆవిష్కరణలు, ఆడియో–విజువల్ ప్రొడక్షన్, సౌర విద్యుత్ విషయంలో పరస్పర సహకారానికి సంబంధించి నాలుగు ఒప్పందాలపై భారత్, ఆస్ట్రేలియా ప్రతినిధులు సంతకాలు చేశారు. చర్చల అనంతరం ఆంథోనీ అల్బానీస్‌తో కలిసి నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడారు. "ఆస్ట్రేలియాలోని హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నట్లు గత కొన్ని వారాలుగా మీడియాలో నిత్యం వార్తలు వస్తుండడం నిజంగా విచారకరం. అలాంటి దాడులు భారత్‌లో ప్రతి ఒక్కరికీ సహజంగానే ఆందోళన కలిగిస్తున్నాయి. ఆలయాలపై దాడుల పట్ల మన మనసులు కలత చెందుతున్నాయి. మన మనోభావాలను, ఆందోళనలను ఆస్ట్రేలియా ప్రధానమంత్రికి తెలియజేశా. ఆస్ట్రేలియా సమాజంలో, ఆర్థిక వ్యవస్థలో భారతీయులు గణనీయమైన పాత్ర పోషిస్తున్నారు. ఆస్ట్రేలియాలో నివసిస్తున్న భారతీయుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు అల్బానీస్ నాకు హామీ ఇచ్చారు. భారతీయుల భద్రత విషయంలో ఆస్ట్రేలియా ప్రభుత్వానికి సాధ్యమైనంతవరకూ మా వంతు సహకారం అందిస్తాం" అని పేర్కొన్నారు. భారత్–ఆస్ట్రేలియా మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి ద్వైపాక్షిక భద్రతా సహకారం అత్యంత కీలకమని మూలస్తంభమని మోదీ ఉద్ఘాటించారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో మారిటైమ్ సెక్యూరిటీ, డిఫెన్స్, సెక్యూరిటీ కో–ఆపరేషన్ గురించి తాము చర్చించామని అన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మోదీ, పక్కన అల్బానీస్

త్వరలోనే ఆర్థిక సహకార ఒప్పందం: అల్బానీస్

ఇండియా–ఆస్ట్రేలియా సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందాన్ని(సీఈసీఏ)ను సాధ్యమైనంత త్వరగా కుదుర్చుకోవాలని మోదీ, తాను అంగీకారానికి వచ్చినట్లు ఆంథోనీ అల్బానీస్ తెలిపారు. ఈ ఏడాదిలోనే ఒప్పందాన్ని ఖరారు చేస్తామన్న నమ్మకం ఉందన్నారు. భారత్–ఆస్ట్రేలియా మధ్య ఆర్థిక సహకార వాణిజ్య ఒప్పందం(ఈసీటీఏ) గత ఏడాది ఖరారైన సంగతి తెలిసిందే. గత ఏడాది డిసెంబర్ నుంచే ఇది అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం ఇరు పక్షాలు సీఈసీఏపై కసరత్తు చేస్తున్నాయి. వలసల ఒప్పందం పురోగతిలో ఉందని, దీనివల్ల ఇరు దేశాల విద్యార్థులకు, వృత్తి నిపుణులకు లబ్ధి చేకూరుతుందని అల్బానీస్ తెలిపారు. భారత్‌తో తమకు బహుముఖ సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ ఏడాదిలో మే నెలలో తమ దేశంలో 'క్వాడ్' సదస్సు జరగబోతోందని, మోదీ రాకకోసం ఎదురు చూస్తున్నానని వివరించారు. జీ20 సదస్సులో పాల్గొనడానికి సెప్టెంబర్‌లో భారత్‌కు వస్తానని అన్నారు.

క్లుప్తంగా...

బాబు కులవాద రాజకీయానికి చరమగీతం

- 894వ రోజు రిలే దీక్షల్లో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాజకీయ రంగంతో పాటు నామినేటెడ్ పదవులు, మంత్రులు, ఇతర శాఖల్లో బహుజనులకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్న తరుణంలో బాబు చేస్తున్న కులవాద తప్పుడు రాజకీయాలకు చరమగీతం తప్పదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 894వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. కులవాద రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఏపీని మార్చిన చంద్రబాబు నేడు బహుజనులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించడంతో తట్టుకోలేకపోతున్నాడని మండిపడ్డారు. పేదలకు జగనన్న అందిస్తున్న సంక్షేమం చూసి ప్రతిపక్షాలకు కళ్లు కుడుతున్నాయన్నారు. వికేంద్రీకరణ ప్రాధాన్యత ఏంటో విశాఖ వేదికగా జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో.. దిగ్గజ కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడం ద్వారానే నిరూపితమయిందని చెప్పారు. ఇంతకాలం అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోపిడీకి అలవాటు పడిన ఓ సామాజిక వర్గం బాబును తిరిగి గద్దెనెక్కించేందుకు చేస్తున్న కుటిల యత్నాలు ఎప్పటికీ ఫలించబోవన్నారు. నాయకులు నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఆరోగ్య బీమా కొనసాగించాలి

- సమాచారశాఖ కమిషనర్‌కు ఏపీడబ్ల్యూజేఎఫ్ వినతి

సాక్షి,అమరావతి: జర్నలిస్టుల ఆరోగ్య బీమా పథకం వచ్చే ఏడాది మార్చి 31 వరకూ కొనసాగించాలని, జర్నలిస్టుల సమగ్ర బీమా పథకం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కోరింది. శుక్రవారం విజయవాడలోని సమాచార శాఖ రాష్ట్ర కార్యాలయంలో కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డిని కలిసి నాయకులు వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టుల ఆరోగ్య బీమా పథకం గతంలో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మరుసటి ఏడాది మార్చి 31 వరకూ కొనసాగించేవారని తెలిపారు. ఈ ఏడాది మార్చి వచ్చిన నేపథ్యంలో జర్నలిస్టులందరూ వారి కార్డులను పునరుద్ధరించుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకట్రావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు వాయిదా




సాక్షి, అమరావతి: పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఉద్దేశించిన దేహదారుఢ్య పరీక్షలను పోలీస్ నియామక మండలి వాయిదా వేసింది. రాష్ట్రంలో 6,100 పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రిలిమనరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 14 నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. కానీ రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు, శాసన సభ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఈ దేహదారుఢ్య పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు పోలీస్ నియామక మండలి చైర్మన్ మనీశ్ కుమార్ సిన్హా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

రోజూ 0.4 మి.మి. పెరిగే చిట్టెలుకల కోర పళ్లు

- ఏదో ఒకటి కొరుకుతూ అరగదీయకుంటే.. పెరిగి ప్రాణాలకే ముప్పు
- అందుకే అన్నీ కొరుకుతూ ప్రతిచోటా విధ్వంసం
- ఏడాదికి తినేది 10 కిలోలు.. నష్టపరిచేది 100 కేజీలు
- మూషికాలతో దేశంలో 25 శాతం పంట నష్టం

ఎలుక కష్టం ఎవరికి ఎరుక

కొరికితేనే బతికేది!




సాక్షి, అమరావతి: ఎలుకలు సృష్టించే విధ్వంసం గురించి అందరికీ తెలిసిందే. కనిపించిన ప్రతీదీ కొరికేస్తూ.. బోలెడంత నష్టాన్ని కలిగిస్తుంటాయి. అయితే.. ఈ విధ్వంసం వెనుక ఓ చిన్నపాటి విషాదమూ ఉంది. చిట్టెలుకల్లో ఉండే రెండు కొరుకుడు (ఇన్‌సైజర్స్) దంతాలు రోజూ 0.4 మిల్లీమీటర్ల చొప్పున పెరుగుతాయట. దీని వల్ల ఈ కోరపళ్లను అవి ఎప్పటికప్పుడు అరగదీయాల్సిందే! లేదంటే అవి ఎలుకల దవడలను చీల్చుకుని బయటకు రావడంతో ఆహారం తినలేవట. దీంతో తిండిలేక ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వస్తుందట. అందుకే అవి బతకాలంటే నిరంతరం దేన్నైనా కొరుకుతూ ఉండాలి. అయితే.. దాని వల్ల జరుగుతున్న నష్టం మాత్రం అపారం. తినటానికి పనికిరాకున్నా బలమైన విద్యుత్ తీగలు, ప్లాస్టిక్ వస్తువులను సైతం కొరికేస్తాయి. చిట్టెలుకలు తీసుకునే ఆహారం రోజుకు 28 గ్రాములే.. కానీ అవి కలిగించే నష్టం మనందరికీ తెలిసిందే. అమెరికాలో ఏటా 19 నుంచి 21 బిలియన్ డాలర్ల పంట నష్టం జరుగుతున్నట్లు లెక్కగట్టారు.

- దేశంలో వరి, గోధుమ పంటలకు ఎలుకలు ఏటా 5 నుంచి 15 శాతం నష్టం కలిగిస్తున్నాయి. ఇతర అన్ని పంటలను కలిపితే నష్టం సుమారు 25 శాతం వరకు ఉంటుంది. ఈ నష్టం విలువ దాదాపు రూ.700 కోట్లు ఉంటుందని అంచనా.
- సుమారు ఏడాదిన్నర నుంచి రెండేళ్ల పాటు జీవించే గోధుమ రంగు ఎలుకలు 21 రోజుల్లో 10 నుంచి 14 పిల్లలను పెడుతుంది. ఇవి నాలుగైదు వారాల్లోనే పరిపక్వ దశకు చేరి సంతానోత్పత్తికి సిద్ధమవుతాయి. ఎలుకలు జతకడితే ఏడాదిలో వాటి సంతానం 1,000 దాటిపోతుంది.
- ప్రపంచవ్యాప్తంగా 84 రకాల ఎలుకలున్నా 18 రకాల మూషికాలు పెద్ద ఎత్తున నష్టం కలిగిస్తున్నట్లు ఒడిశా స్టేట్ ఎన్విరాన్‌మెంట్ విభాగం ప్రకటించింది.
- ఎలుకల కారణంగా కాలిఫోర్నియాలో 504 మిలియన్ డాలర్ల పంట నష్టం జరిగినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్–నేషనల్ వైల్డ్‌లైఫ్ రీసెర్చ్ సెంటర్ అంచనా వేసింది.
- ఒడిశాలోని నాలుగు గ్రామాల్లో ఎలుకలు సుమారు 3.60 టన్నుల ఆహార ధాన్యాలను నాశనం చేసినట్లు తేలింది. దుకాణాల్లోని గోడల్లో ఎలుకలు దాచిన ఆహార పదార్థాలను వెలికితీయగా ఒక్కోచోట 16.64 నుంచి 21.5 కిలోలు గుర్తించారు.

ఎలుకలు తమ శరీర బరువులో దాదాపు 20 శాతం వరకు ఆహారంగా తీసుకుంటాయని ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వన్యప్రాణి పరిశోధకుడు డాక్టర్ గ్రాంట్ సింగిల్టన్ తెలిపారు. ఒకేసారి కాకుండా రోజుకు 3-4 సార్లు తింటాయి. ఏడాదిలో 10 కేజీల ఆహారం తీసుకుంటే అది కొరికి నాశనం చేసే పంట తినేదానికి పదిరెట్లు అంటే.. దాదాపు 100 కిలోలు ఉంటుందని అంచనా.

వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఎలుకలతో పంటనష్టం



రీ సర్వే పూర్తి చేయడానికే రాజస్థాన్ నుంచి రాళ్లు

- రాష్ట్రంలో అయ్యే ఖర్చుతో పోలిస్తే అక్కడి రాయికి తక్కువ వ్యయం
- రాష్ట్రంలో సర్వే రాళ్లకు ఫ్యాక్టరీ వద్ద చెల్లించే మొత్తం రూ.300
- ఫ్యాక్టరీలకు ముడి ఖనిజం ఉచితం.. సీనరేజీ ఫీజు మినహాయింపు
- రవాణా, లోడింగ్ అన్‌లోడింగ్ చార్జీలన్నీ కలిపితే రూ.500కు పైగా వ్యయం
- సర్వేకు సరిపడినన్ని రాళ్లు రాష్ట్రంలో తయారవడంలేదు
- అందువల్లే రాజస్థాన్ నుంచి కొనుగోలు.. రాజస్థాన్ నుంచి ఒక్కో రాయి రూ.413కే కొనుగోలు
- సీనరేజీ రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్ వంటి ఖర్చులన్నీ కాంట్రాక్టర్‌వే
- దీనిపైనా ఈనాడు తప్పుడు కథనం
- మైనింగ్ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి

సాక్షి, అమరావతి: రాజస్థాన్ నుంచి సర్వే రాళ్ల కొనడాన్ని వక్రీకరిస్తూ ఈనాడు కథనం ప్రచురించిందని రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో వంద సంవత్సరాల తర్వాత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సమగ్ర భూ సర్వే ప్రక్రియపై అవగాహన లేకుండా 'రాజస్థాన్ నుంచి సర్వే రాళ్లు' శీర్షికతో అర్థ రహితమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కరోనా కారణంగా పనులు లేక కుదేలైన గ్రానైట్ పరిశ్రమలకు ఊతం కల్పించేందుకు సర్వే రాళ్ల తయారీని రాష్ట్రంలోని ఫ్యాక్టరీలకు అప్పగించామని తెలిపారు. వాటికి ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నామన్నారు. ఫ్యాక్టరీలకు క్వారీల నుంచి ముడి ఖనిజాన్ని ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోందని, సీనరేజీ ఫీజు మినహాయింపును కూడా ఇచ్చిందని తెలిపారు. ఫ్యాక్టరీ వద్ద ఒక్కో సర్వే రాయికి రూ.300 చొప్పున చెల్లిస్తున్నామని తెలిపారు.



ఫ్యాక్టరీ నుంచి వాటిని గ్రామాలకు తరలించేందుకు లోడింగ్, అన్ లోడింగ్, రవాణా వ్యయాన్ని అదనంగా ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. ఇవన్నీ కలిపితే ఒక్కో రాయికి ప్రభుత్వం రూ.500కి పైగా చెల్లిస్తోందని వివరించారు. సర్వే రాళ్ల ఆర్డర్‌లతో పలు గ్రానైట్ ఫ్యాక్టరీల్లో పనులు జరుగుతున్నాయని, పెద్ద ఎత్తున స్థానికులకు ఉపాధి కూడా లభిస్తోందని తెలిపారు.

ఇంత చేసినా వేగంగా జరుగుతున్న రీ సర్వేకి అవసరమైన రోజుకు కనీసం లక్ష రాళ్లు రాష్ట్రంలోని ఫ్యాక్టరీల్లో తయారవడంలేదన్నారు. అందుకే రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయడానికి రాజస్థాన్ నుంచి ప్రస్తుత అవసరాల కోసం 20 లక్షల రాళ్లను తెప్పిస్తున్నామన్నారు. ఇందుకోసం ఏపీఎండీసీ ద్వారా టెండర్లు పిలిచామని తెలిపారు. ఈ టెండర్లలో ఒక్కో రాయికి రూ.413 రేటు ఖరారు చేశామన్నారు. రాజస్థాన్ నుంచి మన రాష్ట్రంలోని ఏ గ్రామానికి రాళ్లు అవసరమో అక్కడికి రవాణా చేసే బాధ్యత కాంట్రాక్టర్‌దేనని తెలిపారు. ఆ రాళ్లకు కాంట్రాక్టరే సొంతంగా సీనరేజీ ఫీజు చెల్లించుకోవాలని, లోడింగ్, అన్ లోడింగ్, రవాణా వ్యయాన్ని సైతం కాంట్రాక్టరే భరించాల్సి ఉంటుందని తెలిపారు. అందువల్ల మన రాష్ట్రంలోని ఫ్యాక్టరీ నుంచి తయారై, గ్రామాలకు తరలించే సర్వే రాళ్లకు అయ్యే వ్యయంతో పోలిస్తే రాజస్థాన్ నుంచి వచ్చే రాళ్లకి చెల్లిస్తున్నది తక్కువేనన్నారు.

- రాష్ట్రంలోని ఫ్యాక్టరీలకు సర్వే రాళ్ల కోసం క్వారీల నుంచి నాణ్యమైన బ్లాకులను అందించాలని ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు. కొన్ని చోట్ల గ్రానైట్ ముడి ఖనిజం నాణ్యత సరిగా లేదని, సొంతంగా ముడి ఖనిజాన్ని కొంటామని ఫ్యాక్టరీ నిర్వాహకులు కోరుతున్నారని తెలిపారు. ఇందుకోసం అదనంగా రూ.100 చెల్లించాలని ఇటీవల గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు కోరారని తెలిపారు. ఈ అదనపు చెల్లింపుల వల్ల ఎంత భారం పడుతుందనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఈ విషయాన్ని పట్టించుకోకుండా శాండ్ స్టోన్‌కు మాత్రం ఒక్కో రాయికి రూ.413 చెల్లిస్తోందంటూ ఈనాడు పత్రిక బాధ్యతారహితంగా కథనాన్ని ప్రచురించడంపై వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసంబద్ధ విమర్శలతో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న సర్వే ప్రక్రియపై బురదచల్లేలా కథనాన్ని ప్రచురించడం సరికాదన్నారు.

ఆలస్యంగా వస్తే అనుమతి లేదు

- పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్
- ఉదయం 8.45 గంటల నుంచి 9.30 వరకు పరీక్ష హాల్లోకి అనుమతి
- ఆ తర్వాత ఎవరినీ అనుమతించరు
- 12.45 గంటల తర్వాతే పరీక్ష కేంద్రం నుంచి బయటకు..
- 3 నుంచి 18 వరకు పరీక్షలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏప్రిల్ 3 నుంచి 18 వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులను ఉదయం 8.45 గంటల నుంచి 9.30 గంటల వరకు మాత్రమే పరీక్ష హాల్లోకి అనుమతిస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. 9.30 గంటల తర్వాత ఆలస్యంగా వచ్చిన ఎవరినీ అనుమతించబోమన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సర్క్యులర్ విడుదల చేశారు. www.bse.ap.gov.in లో పదో తరగతి పరీక్షల టైమ్‌టేబుల్‌ను చూడొచ్చన్నారు. అన్ని పరీక్షలను నిర్దేశించిన తేదీల్లో ఉదయం 9:30 గంటల నుంచి 12:45 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు.

విద్యార్థులకు సూచనలు..



- హాల్‌టికెట్లు పొందాక విద్యార్థులంతా తమ పేరు, పుట్టిన తేదీ, ఫొటో వంటి అన్ని వివరాలను సరిచూసుకోవాలి. వాటిలో పొరపాట్లు గమనిస్తే పాఠశాల హెడ్‌మాస్టర్/ప్రిన్సిపాల్‌ని సంప్రదించాలి.
- విద్యార్థులు తప్పనిసరిగా హాల్‌టికెట్‌లను తమతో పాటు పరీక్షకు తీసుకెళ్లాలి. హాల్‌టికెట్ లేకపోతే పరీక్షకు అనుమతించరు.
- పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, స్పీకర్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్, కెమెరాలు, ఇయర్ ఫోన్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకు రాకూడదు. ఎవరైనా వాటిని లోపలకు తీసుకువెళ్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు.
- విద్యార్థులు ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్ ప్రశ్నలను వేర్వేరు సమాధాన పత్రాల్లో రాయాలి. ఈ రెండింటి కోసం వేర్వేరుగా 12 పేజీల సమాధానాల బుక్‌లెట్లు ఇస్తారు.
- విద్యార్థులను అత్యవసర పరిస్థితుల్లో మినహా 12:45 గంటల వరకు పరీక్ష హాల్ నుంచి బయటకు వెళ్లడానికి అనుమతించరు.
- ప్రశ్నపత్రాల లీక్ అని తప్పుడు, నిరాధారమైన పుకార్లకు పాల్పడకూడదు. వదంతులను వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటారు.
- పరీక్ష సమయంలో అక్రమాలకు పాల్పడేవారిపై, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు ఉంటాయి. అలాంటివారిని తదుపరి పరీక్షలు రాయనీయరు.
- విద్యార్థి పేరు, రోల్ నంబర్, ఇతర వివరాలను 24 పేజీల జవాబు బుక్‌లెట్, మ్యాప్ లేదా గ్రాఫ్ షీట్‌లోని ఏ పేజీలోనూ రాయకూడదు.
- కాగా పరీక్షలు జరిగే రోజుల్లో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ల విధులపైనా సూచనలు జారీ చేశారు.

---

15 రోజుల్లో జిల్లాలకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు

పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్

సాక్షి, అమరావతి: నొయిడాలోని ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ ప్రచురణ కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్ శుక్రవారం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న విద్యా కానుక పథకంలో భాగంగా ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు 'ఆక్స్‌ఫర్డ్' డిక్షనరీ అందజేస్తున్న సంగతి తెలిసిందే. వచ్చే విద్యా సంవత్సరం బడులు తెరిచే నాటికి విద్యార్థుల చేతిలో సంపూర్ణ కిట్ ఉండాలన్న లక్ష్యంతో సన్నాహాలు సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీల ముద్రణ పనులను ప్రవీణ్‌ప్రకాశ్ పరిశీలించారు. 80% వరకు ముద్రణ పూర్తయి సిద్ధంగా ఉన్నాయని, 15 రోజుల్లో జిల్లాలకు చేరతాయని తెలిపారు. అనంతరం పీపీ బఫ్నా వెంచర్స్ ప్రైవేటు లిమిటెడ్ నోటు పుస్తకాల ముద్రణ కేంద్రాన్ని కూడా సందర్శించారు.



ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రచురణ కేంద్రంలో డిక్షనరీని పరిశీలిస్తున్న ప్రవీణ్‌ప్రకాశ్

ఆ తర్వాతే నా జీతం తీసుకుంటా..

పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, కుక్ (వంట పనివారు)లకు ప్రతి నెలా జీతాలు అందాకే తన జీతం తీసుకుంటానని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ చెప్పారు. వారి జీతాల బిల్లు అయ్యాకే తన జీతం బిల్లును ప్రాసెస్ చేయాలన్నారు. ఈ మేరకు డీడీవో అయిన ప్రభుత్వ సహాయ కార్యదర్శి కేసీహెచ్ వెంకటేశ్వర్లుకు లేఖ రాశారు.

ప్రజాధనం దోపిడీకే తెరపైకి 'సీమెన్స్'

స్కిల్ స్కామ్‌లో ప్రాజెక్టు వ్యయాన్ని కృత్రిమంగా పెంచారు

- భాస్కర్ ప్రసాద్ రిమాండ్‌పై మేజిస్ట్రేట్ యాంత్రికంగా వ్యవహరించారు
- రిమాండ్ సమయంలోనే మినీ ట్రయల్ విపరీత పరిణామాలకు దారి తీస్తుంది
- దీనిపై హైకోర్టు దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైంది
- హైకోర్టుకు నివేదించిన అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ప్రజాధనాన్ని కొల్లగొట్టాలన్న ముందస్తు పథకంలో భాగంగానే గత సర్కారు పెద్దలు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సీమెన్స్ ఇండస్ట్రీ సాఫ్ట్‌వేర్ ఇండియా లిమిటెడ్‌ను తెరపైకి తెచ్చారని సీఐడీ తరఫున రాష్ట్ర అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్ రెడ్డి హైకోర్టుకు నివేదించారు. ప్రాజెక్టు వ్యయాన్ని రూ.3,356 కోట్లకు కృత్రిమంగా పెంచారని, ఇందులో సీమెన్స్ మాజీ ఉద్యోగి జీవీఎస్ భాస్కర్ ప్రసాద్ కీలక పాత్ర పోషించారని నివేదించారు. ఇలా పెంచిన మొత్తాన్ని పెద్దల అండతో దారి మళ్లించేందుకు భారీ కుట్రకు తెర తీశారని తెలిపారు. అందులో భాగంగానే ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్–సీమెన్స్ మధ్య ఒప్పందం కుదరగానే యూపీలో ఐఏఎస్ అధికారిగా ఉన్న భాస్కర్ ప్రసాద్ భార్య ఊర్మిళను ఇంటర్ కేడర్ డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ సీఈవోగా నియమించారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఇదో భారీ కుంభకోణమని, ఇంత తీవ్రమైన కేసులో మేజిస్ట్రేట్ చాలా యాంత్రికంగా భాస్కర్ ప్రసాద్ రిమాండ్‌ను తిరస్కరించారని తెలిపారు. కింది కోర్టులో ఏం జరుగుతోందో తెలుసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. భాస్కర్ ప్రసాద్‌పై ఐపీసీ సెక్షన్లు 409, 120 (బీ) కింద సీఐడీ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే మేజిస్ట్రేట్ విస్మయకరంగా రిమాండ్ సమయంలోనే మినీ ట్రయల్ నిర్వహించి సెక్షన్ 409 వర్తించదని తేల్చడంతోపాటు భాస్కర్ ప్రసాద్ రిమాండ్‌ను తిరస్కరించారని వివరించారు. ఏ సెక్షన్ వర్తిస్తుంది? ఏ సెక్షన్ వర్తించదు? అనే అంశాలను దర్యాప్తు పూర్తై చార్జిషీట్ దాఖలు చేసిన తరువాత చేపట్టే తుది విచారణలో తేల్చాలే కానీ రిమాండ్ సమయంలో కాదన్నారు. రాష్ట్రంలోని కింది కోర్టుల్లో రిమాండ్ సమయంలోనే ఫలానా సెక్షన్ వర్తించదంటూ రిమాండ్‌ను తిరస్కరించే ట్రెండ్ నడుస్తోందని, దీనిపై హైకోర్టు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన సమయం వచ్చిందని సుధాకర్‌రెడ్డి నివేదించారు. ఈ కుంభకోణం వెనుక దాగిన పెద్దల పాత్ర బహిర్గతం కావాలంటే భాస్కర్ ప్రసాద్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించడం సీఐడీకి అనివార్యమన్నారు. సీఐడీ తరఫున వాదనలు ముగియడంతో భాస్కర్ ప్రసాద్ తరఫు న్యాయవాది వీఆర్ మాచవరం వాదనల నిమిత్తం తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్.భానుమతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీలో వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.1,969 కోట్లు

- కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాల అంతరాన్ని, పంట నష్టాలను తగ్గించేందుకు రాష్ట్రాలకు నిధులు సమకూరుస్తున్నట్టు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఇటీవల పార్లమెంట్‌లో వెల్లడించింది. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి నుంచి దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ ఏడాది జనవరి వరకు 21,380 మౌలిక సదుపాయాల యూనిట్ల ఏర్పాటుకు రూ.15,626 కోట్లను మంజూరు చేసినట్టు వివరించింది. ఇందులో అత్యధికంగా నాలుగు రాష్ట్రాలకు నిధులు మంజూరు చేసినట్టు తెలిపింది. దేశంలో మధ్యప్రదేశ్‌కు అత్యధికంగా నిధులు మంజూరు చేయగా.. ఆ తరువాత ఏపీకి అత్యధిక నిధులు మంజూరు చేసింది. ఆ తరువాత మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలకు అత్యధిక నిధులు మంజూరు చేసింది. మిగతా రాష్ట్రాలకు రూ.వెయ్యి కోట్లలోపు నిధులు మంజూరు చేసినట్టు వివరించింది. కస్టమ్ హైరింగ్ సెంటర్లు, డ్రోన్స్ కొనుగోలు, ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు, సీడ్ ప్రాసెసింగ్ కేంద్రాల వంటి వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు ఇచ్చినట్టు తెలిపింది.

ఏపీకి ప్రాధాన్యత

రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు సకల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్న నేపథ్యంలో ఏపీకి రూ.1,969 కోట్లను కేంద్రం కేటాయించింది. రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగానే రైతులు పండించిన పంటల నిల్వ కోసం గోదాములను ఏపీలో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. రైతులకు 30 రకాల మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగానే కోల్డ్ రూమ్‌లు, డ్రైయింగ్ ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం చేపడుతున్నారు. ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్లు, అసేయింగ్ ఎక్విప్‌మెంట్, ప్రొక్యూర్‌మెంట్ సెంటర్లు, ఈ–మార్కెటింగ్, మెగా కస్టం హైరింగ్ హబ్స్, ఆర్బీకేల స్థాయిలో కస్టమ్ హైరింగ్ సెంటర్లు, వరి పండిస్తున్న జిల్లాల్లో కంబైన్డ్ హార్వెస్టర్లు, ఏఎంసీలు–బీఎంసీలు, ఆక్వా ఇన్‌ఫ్రా, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లు, ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. మరోవైపు పాడి రైతుల కోసం ఇప్పటికే బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల నిర్మాణాన్ని చేపట్టింది. అమూల్‌తో ఒప్పందం చేసుకుని పాడి రైతులు పోసే పాల ధరను పెంచుతోంది.

శ్రీకాంత్ అర్జాను విచారించిన సీఐడీ

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో ఆ సంస్థ మాజీ ఎండీ శ్రీకాంత్ అర్జాను సీఐడీ అధికారులు వరుసగా రెండో రోజు శుక్రవారం కూడా విచారించారు. తాడేపల్లిలోని సీఐడీ కార్యాలయంలో ఆయనను విచారించడంతో పాటు ఓ ప్రశ్నావళిని ఇచ్చినట్టు సమాచారం. ఆ ప్రశ్నావళికి లిఖితపూర్వకంగా సమాధానాలు ఇవ్వాలని, అలాగే మరోసారి విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని కూడా ఆయనకు చెప్పినట్టు తెలుస్తోంది.

సింగపూర్ రూటులో 'స్కిల్' లూటీ!

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) నిధులను టీడీపీ పెద్దలు షెల్ కంపెనీల ద్వారా కొల్లగొట్టినట్లు కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిగ్గు తేల్చింది. ఈ వ్యవహారంలో మాజీ సీఎం చంద్రబాబు పాత్ర ఉన్నట్లు దాదాపుగా నిర్ధారణకు వచ్చింది. టీడీపీ హయాంలో ×ముఖ్య×నేత నలుగురు వ్యక్తుల ద్వారా నల్లధనాన్ని సింగపూర్‌కు తరలించినట్లు ఆధారాలతో గుర్తించింది. సీమెన్స్‌కు సంబంధం లేకపోయినా ఆ సంస్థ పేరిట కాగితాలపై రూ.3,300 కోట్ల ప్రాజెక్టును చూపించి... రూ.370 కోట్లను కాజేసినట్లు తేల్చింది. ఈ అక్రమాలను ఇప్పటికే సీఐడీ అధికారులు నిగ్గు తేల్చారు. ఈడీ కూడా సీమెన్స్‌లో పని చేసి మానేసిన సుమన్ బోస్... ఈ వ్యవహారంలో చంద్రబాబుకు కుడిభుజంగా వ్యవహరించినట్లు తేల్చింది.

నల్లధనం సింగపూర్‌కు చేర్చింది ఆ నలుగురే...

స్కామ్‌లో కాజేసిన సొమ్మును ఈ నలుగురి ద్వారా సింగపూర్‌కు తరలించినట్లు ఈడీ గుర్తించింది. నిందితులు నలుగురికీ అప్పటికే డస్సల్ట్ సిస్టమ్స్ అనే షెల్ కంపెనీతో అనుబంధం ఉంది. సుమన్ బోస్‌ను టీడీపీ పెద్దలు ఈ కుంభకోణంలో కీలక పాత్రధారిగా చేసుకున్నారు. సీమెన్స్ ఇండియా మాజీ హెడ్ కావటంతో... బోస్ జర్మనీలోని తమ ప్రధాన కార్యాలయానికి తెలీకుండానే ఏపీఎస్ఎస్‌డీసీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. టీడీపీ పెద్దలు కాగితాలపై సృష్టించిన రూ.3,300 కోట్ల ప్రాజెక్టుపై తనే సంతకం చేసేశాడు. డిజైన్‌టెక్‌తోపాటు అలైడ్ కంప్యూటర్స్, ఇన్‌వెబ్ సర్వీసెస్, ప్యాట్రిక్ ఇన్ఫో సర్వీసెస్, ఐటీ స్మిత్ సొల్యూషన్స్, ప్రావెస్ట్‌మెంట్ సర్వీసెస్, భారతీయ గ్లోబల్ ఇన్ఫో మీడియా అనే షెల్ కంపెనీలను ఆ ప్రాజెక్టులో భాగస్వాములుగా చూపిస్తూ కథ నడిపించారు. ఒప్పందం ప్రకారం సీమెన్స్–డిజైన్‌టెక్ కంపెనీలు పెట్టుబడి పెట్టాల్సిన 90 శాతం నిధుల్లో ఒక్క రూపాయి కూడా పెట్టకుండానే... ప్రభుత్వ వాటా 10 శాతం కింద రూ.370 కోట్లను డిజైన్‌టెక్‌కు టీడీపీ సర్కారు చెల్లించింది. ఏపీఎస్ఎస్‌డీసీలో కీలక స్థానాల్లో ఉన్న చంద్రబాబు సన్నిహితులు కె.లక్ష్మీనారాయణ, గంటా సుబ్బారావు, అపర్ణ ఛటోపాధ్యాయ అందుకు సహకరించారు. అనంతరం వికాస్ కన్వేల్కర్, ముకుల్ అగర్వాల్, సురేశ్ గోయల్ సహకారంతో సుమన్ బోస్ రూ.241 కోట్లను సింగపూర్‌లోని ఓ బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. అవి హవాలా మార్గంలో రాష్ట్రంలోని టీడీపీ పెద్దలకు చేరినట్లు ఈడీ భావిస్తోంది. అందుకే నిందితులు నలుగురినీ మరింత లోతుగా విచారించేందుకు తమ కస్టడీకి అప్పగించాలని కోర్టును కోరింది. తద్వారా ఈ కేసును కొలిక్కితెచ్చి.. తదుపరి అరెస్టులు చేయాలని భావిస్తోంది.

కస్టడీ కోరిన ఈడీ

చంద్రబాబు కనుసన్నల్లో సాగిన స్కిల్ కుంభకోణంలో నలుగురు షెల్ కంపెనీల ప్రతినిధులను ఈ నెల 4న ఈడీ అరెస్టు చేసి విశాఖలోని పీఎంఎల్ఏ న్యాయస్థానంలో హాజరు పరచడం తెలిసిందే. సౌమ్యాద్రి శేఖర్ బోస్ అలియాస్ సుమన్ బోస్ (సీమెన్స్ ఇండియా మాజీ ఎండీ)తో పాటు వికాస్ కన్విల్కర్ (డిజైన్‌టెక్ కంపెనీ ఎండీ), ముకుల్ చంద్ర అగర్వాల్ (పీవీఎస్పీ ఐటీ స్కిల్స్ సీఈవో), సురేశ్ గోయల్ (చార్టెడ్ అకౌంటెంట్) నలుగురూ విచారణకు ఏమాత్రం సహకరించలేదని, క్షుణ్నంగా ప్రశ్నించేందుకు కస్టడీకి అప్పగించాలని శుక్రవారం ఈడీ అధికారులు కోర్టులో పిటిషన్ వేశారు. వీరిని విచారించాక ఈ కేసులో కీలక సూత్రధారులను అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా...

టీడీపీ హయాంలో రాజధాని నిధులు దుర్వినియోగం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



వెంకటగిరి(తిరుపతి జిల్లా): 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తరపున నరేంద్రమోదీ రూ.10 వేల కోట్లు, వెంకయ్యనాయుడు ప్రత్యేకంగా కృషి చేసి మరో రూ.2,500 కోట్ల నిధులు మంజూరు చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు తెలిపారు. అయితే ఆ నిధులను అప్పటి టీడీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేసి తాత్కాలిక భవనాలతో కాలయాపన చేసిందని విమర్శించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2007లో ప్రారంభించిన స్వర్ణముఖి–సోమశిల లింక్ కెనాల్‌ను తర్వాత వచ్చిన ప్రభుత్వాలేవీ పట్టించుకోకపోవడం సరికాదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పోలవరానికి ఇప్పటివరకు రూ.16 వేల కోట్లకుపైగా నిధులు విడుదల చేసిందని స్పష్టం చేశారు.

రాష్ట్రాలపై బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరి

సీపీఎం కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు



సాక్షి, అమరావతి: ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో వారిని ఇబ్బందులు పెట్టి దెబ్బతీసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ నిరంకుశ వైఖరి అవలంబిస్తోందని సీపీఎం కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావుతో కలిసి విజయవాడ బాలోత్సవ భవన్‌లో శుక్రవారం రాఘవులు మీడియాతో మాట్లాడారు. తప్పు చేశారనుకుంటే కవిత, సిసోడియాపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో అభ్యంతరంలేదని, కానీ బీజేపీకి వ్యతిరేకంగా గట్టిగా విమర్శలు చేస్తున్నారనే కారణంతో వేధించడం దుర్మార్గమన్నారు. బీజేపీ ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా కలిసివచ్చే శక్తులతో దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ప్రకటించారు.

టీచర్లు చైతన్యంతో ఉండాలి: చంద్రబాబు



సాక్షి, అమరావతి: టీచర్లు చైతన్యంతో ఉండాలని, 2024లో వైఎస్సార్‌సీపీ ఓటమికి ఇప్పుడు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలు నాంది కావాలని ప్రతిపక్ష నేత చంద్రబాబు పేర్కొన్నారు. సీబీఎన్ కనెక్ట్ పేరుతో కొందరు టీచర్లు, లాయర్లతో శుక్రవారం ఆయన మంగళగిరి టీడీపీ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో మాట్లాడారు. దొంగసారా కేసులో ఉన్న వ్యక్తిని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టారని విమర్శించారు. పట్టభద్రుల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసిన తర్వాత రెండో ప్రాధాన్య ఓటు పీడీఎఫ్ అభ్యర్థులకు వేయాలని విజ్ఞప్తి చేశారు. పీడీఎఫ్‌కు ఓటు వేసిన వారు తమ రెండవ ప్రాధాన్య ఓటును టీడీపీకి వేయాలన్నారు. న్యాయవాదులకు ఆర్థిక భద్రత, ఇంటిస్థలాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

చేనేతను నిర్వీర్యం చేసింది చంద్రబాబే: గంజి చిరంజీవి



మంగళగిరి: చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేసింది తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబేనని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. లోకజ్ఞానం లేని లోకేశ్ మదనపల్లిలో మాట్లాడుతూ తనను ఉద్దేశించి ఆప్కో చైర్మన్‌గా ఏం పీకాడురా అనడం బీసీలను అవమానపర్చడమేనని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్‌లకు బడుగు, బలహీనవర్గాలను అవమానపర్చడం పరిపాటిగా మారిందన్నారు. తాను పదవీ బాధ్యతలు చేపట్టి 35 రోజులైందని, పురాతన చేనేత సొసైటీలను సందర్శించి వాటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నానని చెప్పారు. 40 ఏళ్ల అనుభవం కలిగిన చంద్రబాబు చేనేతలను ఏం ఉద్ధరించాడని, వారి అభివృద్ధికి ఏం పీకాడని లోకేశ్ ప్రశ్నించాలని సూచించారు.

బీజేపీకి ప్రత్యామ్నాయ శక్తిగా బీఆర్‌ఎస్

ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్



సాక్షి, అమరావతి: దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయ శక్తిగా బీఆర్‌ఎస్ ఆవిర్భవించిందని ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ చెప్పారు. బీజేపీ నియంతృత్వ పోకడలకు కేసీఆర్ అడ్డుకట్ట వేస్తున్నారని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ సీఎం, బీఆర్‌ఎస్ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్ నేతృత్వంలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చిస్తున్నట్లు చెప్పారు. త్వరలో ఏపీలోని ప్రధాన నగరాల్లో బహిరంగ సభలు నిర్వహించేందుకు కేసీఆర్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

అవినాశ్‌పై తొందరపాటు చర్యలొద్దు..

సీబీఐకి తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి అన్ని విచారణ ఫైళ్లను, రికార్డులను న్యాయస్థానం ముందు ఉంచాలని సీబీఐ దర్యాప్తు అధికారిని హైకోర్టు ఆదేశించింది. విచారణ వివరాలను పెన్‌డ్రైవ్ లేదా హార్డ్‌ డిస్క్‌లో పూర్తిగా సీల్డ్ కవర్‌లో సోమవారం కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. వివేకా హత్య జరిగిన చోట లభించిన లేఖ, దానికి సంబంధించిన ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్‌ఎస్‌ఎల్) నివేదికను కూడా సమర్పించాలని సూచించింది. అప్పటి వరకు అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టవద్దని దర్యాప్తు అధికారి (ఐవో)ని ఆదేశించింది. పిటిషనర్ (కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి) 14న ఉదయం 11 గంటలకు సీబీఐ ముందు హాజరు కావాలని సూచించింది. ఆయన వెంట న్యాయవాది వెళ్లొచ్చని చెప్పింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, తదుపరి విచారణను 13వ తేదీకి వాయిదా వేసింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ తనను శుక్రవారం విచారణకు హాజరు కావాలనడంపై స్టే విధించాలని కోరుతూ కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఒకవేళ విచారణ చేపట్టినా.. అదంతా ఆడియో, వీడియో రికార్డింగ్ చేసేలా సీబీఐని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, సీబీఐ తరఫున అనిల్ కొంపెల్లి వాదనలు వినిపించారు.

పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు..

'వైఎస్ వివేకా హత్య కేసులో విచారణ నిమిత్తం సీఆర్‌పీసీ 160 కింద జనవరి 24న హాజరు కావాలని ఒకరోజు ముందు కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి సీబీఐ నోటీసులు జారీ చేసింది. 24న ఎంపీ విచారణకు హాజరయ్యారు. తన విచారణ వీడియో, ఆడియో రికార్డింగ్ చేయాలని, విచారణ సమయంలో తన న్యాయవాదిని అనుమతించాలని కోరుతూ జనవరి 27న దర్యాప్తు అధికారులకు అవినాశ్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. దీన్ని దర్యాప్తు అధికారి అనుమతించలేదు. మళ్లీ ఫిబ్రవరి 24న హాజరు కావాలంటూ ఫిబ్రవరి 16న నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 22న కూడా అవినాశ్‌రెడ్డి వీడియో, ఆడియో రికార్డింగ్‌పై విన్నవించారు. అప్పుడు కూడా అనుమతించలేదు. మరోసారి మార్చి 10న విచారణకు రావాలని మార్చి 5న సీఆర్‌పీసీ 160 కింద మరో నోటీసు ఇచ్చారు. ఈ క్రమంలో విచారణ పారదర్శకంగా సాగడం లేదని, నిష్పక్షపాతంగా సాగేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు' అని నిరంజన్‌రెడ్డి వివరించారు.

విచారణ పేరుతో వేధిస్తున్నారు..

'వివేకా హత్య కేసుకు సంబంధించి సీబీఐ ముందు పిటిషనర్ విచారణ ముగియగానే, మీడియా ఇష్టం వచ్చినట్లు కథనాలు రాస్తూ, ఆయన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగిస్తోంది. వాస్తవాలను పట్టించుకోవడం లేదు. అందువల్లే వీడియో, ఆడియో రికార్డు చేయాలని దర్యాప్తు అధికారులను ఎంపీ కోరారు. అయినా దర్యాప్తు అధికారి దాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. విచారణ సమయంలో పిటిషనర్ చెబుతున్న అంశాలను టైపిస్ట్ టైప్ చేస్తుండగా, దర్యాప్తు అధికారి కంప్యూటర్ మౌస్‌ను పలుమార్లు తన చేతుల్లోకి తీసుకుని కొన్ని లైన్లు తీసివేయాలంటూ టైపిస్ట్‌కు సూచించారు. కంప్యూటర్ స్క్రీన్ దర్యాప్తు అధికారికి, టైపిస్ట్‌కు మాత్రమే కనిపించేలా ఉండటంతో ఏం డెలిట్ చేస్తున్నారో పిటిషనర్ చూడలేకపోయారు. అవినాశ్‌ను విచారణ చేసే సమయంలో నలుగురైదుగురు అధికారులు ఉన్నారు. విచారణ ముగిశాక దీనికి సంబంధించిన ఓ ప్రతిని ఇవ్వమని కోరినా, దర్యాప్తు అధికారి నిరాకరించారు. నిబంధనలు అంగీకరించవని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో పిటిషనర్ వెంట న్యాయవాదిని అనుమతించేలా ఆదేశాలివ్వాలి. ఎఫ్‌ఐఆర్ సహా ఎక్కడా అవినాశ్ పేరు లేదు. అయినా పలుమార్లు విచారణ పేరుతో వేధిస్తున్నారు. దర్యాప్తు అధికారి.. ముందే ఓ ఊహాజనిత స్క్రిప్ట్‌ను సిద్ధం చేసుకుని, ఆ మేరకు కావాల్సిన విధంగా సాక్షులను సిద్ధం చేస్తున్నారు. అవినాశ్‌రెడ్డితోపాటు భాస్కర్‌రెడ్డిని కూడా దోషిగా చూపించే ప్రయత్నం జరుగుతోంది. దస్తగిరిని వారికి అనుకూలంగా మలచుకుని, ఆ మేరకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు' అని వాదనలు వినిపించారు.

వివేకా లేఖను తొక్కిపెట్టారు..

'వివేకా హత్య జరిగిన చోట దొరికిన లేఖను దర్యాప్తు అధికారులు తొక్కి పెడుతున్నారు. వైఎస్ వివేకా అల్లుడే ఆయన్ను హత్య చేశాడని నిందితుడు శివశంకర్‌రెడ్డి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అయితే ఈ కేసు అంశాలను మాత్రం సీబీఐ అధికారులు ఇప్పటి వరకు పట్టించుకోలేదు. సీఆర్‌పీసీలో పేర్కొన్న నిబంధనల మేరకు దర్యాప్తు పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగడం లేదు. సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా పాటించడం లేదు. ఈ నేపథ్యంలో పిటిషనర్ వీడియో, ఆడియో రికార్డు చేసేలా, న్యాయవాదిని విచారణ సమయంలో అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలి' అని పిటిషనర్ న్యాయవాది నివేదించారు.

వీడియో రికార్డింగ్‌తోనే విచారణ

వీడియో, ఆడియో రికార్డింగ్‌పై దర్యాప్తు అధికారి వివరణ తీసుకుని కోర్టుకు తెలియజేయాలని న్యాయమూర్తి.. సీబీఐ న్యాయవాదిని ఆదేశించారు. భోజన విరామం అనంతరం వాదనలు పునః ప్రారంభం కాగా, వీడియో, ఆడియో రికార్డింగ్‌లతోనే పిటిషనర్ విచారణ సాగుతోందని సీబీఐ న్యాయవాది కోర్టుకు నివేదించారు. వివేకా హత్య జరిగిన చోట దొరికిన లేఖను ఫోరెన్సిక్‌కు పంపినట్లు చెప్పారు. లేఖ విషయాన్ని 2021 జనవరి 31 నాటి అనుబంధ చార్జిషీట్‌లో పేర్కొన్నట్లు చెప్పారు. అవినాశ్‌రెడ్డి.. సాక్షినా? లేక నిందితుడా? అని న్యాయమూర్తి ప్రశ్నించగా, అవినాశ్‌రెడ్డికి సీఆర్‌పీసీ 160 కింద నోటీసులు ఇచ్చామని.. అవసరమైతే ఆయన్ను, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొనే అవకాశం ఉందని సీబీఐ న్యాయవాది చెప్పారు. ఈ సందర్భంగా కోర్టుకు హాజరైన సీబీఐ ఎస్పీ.. ఆడియో, వీడియో రికార్డుల హార్డ్‌డిస్క్, కేసు ఫైళ్లను ఇప్పుడే ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సోమవారం సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశిస్తూ న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు. కాగా, ఈ పిటిషన్‌లో వైఎస్ వివేకా కుమార్తె సునీత ఇంప్లీడ్ అయ్యారు. తన వాదనలు కూడా వినాలని కోరారు.

దస్తగిరి ఎందుకు రాలేదు?

- సీబీఐని ప్రశ్నించిన ప్రత్యేక న్యాయస్థానం
- నిందితులంతా హాజరుకావాలని చెప్పాం కదా
- తదుపరి విచారణకు అందరూ రావాలి
- విచారణ 31కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకా హత్య కేసులో ఏ–4గా ఉన్న దస్తగిరి విచారణకు ఎందుకు రాలేదని సీబీఐని ప్రత్యేక న్యాయస్థానం ప్రశ్నించింది. నిందితులంతా హాజరు కావాలని చెప్పాం కదా.. అని అసహనం వ్యక్తం చేసింది. తదుపరి విచారణకు అందరూ రావాలని ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. కేసు విచారణ సందర్భంగా చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిలను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. మరో నిందితుడు ఎర్ర గంగిరెడ్డి కూడా హాజరయ్యారు. సీబీఐ నుంచి వచ్చిన సీల్డ్ కవర్‌లో కొన్ని పేజీలు లేవని, దీంతో దాన్ని తిరిగి పంపిచామని న్యాయమూర్తి వెల్లడించారు. కేసు విచారణను వేగవంతం చేయాలని ఆదేశిస్తూ వాయిదా వేశారు. అనంతరం ముగ్గురు నిందితులను పోలీసులు మళ్లీ చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా ఎంపీ అవినాశ్‌రెడ్డి వెంట వచ్చిన 15 మంది మద్దతుదారులను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జగనన్న స్ఫూర్తితోనే చంద్రగిరి అభివృద్ధి





ఆత్మీయసభలో మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి, పక్కన చెవిరెడ్డి, రెడ్డెప్ప, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి. హాజరైన జనం

ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి

సాక్షి, తిరుపతి: తిరుపతి జిల్లా చంద్రగిరి జన సంద్రమైంది. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆత్మీయసభ పేరుతో శుక్రవారం నిర్వహించిన భారీ బహిరంగ సభకు జనం పోటెత్తారు. వేలాది యువత వెన్నంటి రాగా వందలాది బైక్‌లతో భారీర్యాలీ నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న వచ్చారా అనేంతగా ఈ సభకు భారీ స్థాయిలో ప్రజలు హాజరయ్యారని కొనియాడారు. ప్రజలకే నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శ పాలన అందిస్తున్నారన్నారు. అన్ని రాష్ట్రాలూ ఆయన పాలనను కీర్తిస్తూ, వారి రాష్ట్రాల్లోనూ జగనన్న పథకాలనే అమలు చేస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి కోసం నిరంతరం తపిస్తూ చంద్రగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్న చెవిరెడ్డి నేటి యువ రాజకీయనేతలకు దిక్సూచి వంటివారన్నారు. చెవిరెడ్డి మాట్లాడుతూ తన కుటుంబమెంతో తన ప్రజలు కూడా అంతేనన్నారు. సంపాదించే ప్రతి రూపాయిలో 75 శాతం ప్రజలకే ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజల కోసం ఖర్చు చేయడం తనకు ఓ వ్యసనమన్నారు. సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితో ఎన్నడూ లేనంత నిధులను వెచ్చించి చంద్రగిరిని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సభలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

వివేకాది ఆస్తి కోసం జరిగిన హత్య

- సీబీఐ విచారణ అనంతరం మీడియాతో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి
- హత్యా స్థలి నుంచి లెటర్‌ను మాయం చేశారు
- గుండెపోటని నేను చెప్పలేదు.. అదంతా దుష్ప్రచారం
- ఈ వాస్తవాలన్నీ వదిలి కట్టుకథ ఆధారంగా సీబీఐ దర్యాప్తు
- నేను లంచ్ మోషన్ దాఖలు చేస్తే సునీతమ్మను ఇంప్లీడ్ చేయించారు
- నేను ఏ తప్పూ చేయలేదు.. న్యాయ పోరాటానికి సిద్ధం

తప్పుదోవలో విచారణ

- ఉదయం 10.40–10.45 గంటల మధ్య ఇక్కడికి వచ్చాను. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విచారించారు. ఆ తర్వాత కోర్టు నుంచి పిలుపు వచ్చిందని దర్యాప్తు అధికారి వెళ్లారు. అయినప్పటికీ 3.30 గంటల వరకు అక్కడే కూర్చోమన్నారు. ఆపై సీబీఐ వాళ్లు వచ్చి మీరు వెళ్లండి.. మళ్లీ మేము పిలిచినప్పుడు రండని చెప్పారు.
- విచారణ మొత్తం ఆడియో, వీడియో రికార్డింగ్ కావాలని దర్యాప్తు అధికారిని మొదటి నుంచీ అడుగుతూనే ఉన్నాం. రెండోసారి ఇదే అంశాన్ని సీబీఐ డైరెక్టర్‌నే అడిగాం. ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో మూడోసారి హైకోర్టును ఆశ్రయించాం. విచారణ తప్పుదోవలో వెళ్తుండటంతో ఇలా చేయక తప్పలేదు.
- ఎంపీ టికెట్టే ఈ హత్యకు కారణం అంటే మా జిల్లా వాళ్లు నవ్వుతారు. వివేకం సర్ చనిపోయే రోజు కూడా మైదుకూరు నియోజకవర్గంలోని చాపాడు మండలంలో దాదాపు 300 ఇళ్లు డోర్ టు డోర్ ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా రఘురామిరెడ్డికి.. ఎంపీ అభ్యర్థిగా అవినాశ్‌కు ఓటెయ్యండని ప్రచారం చేశారు. కావాలంటే ఆ ఇళ్లకు వెళ్లి అడగచ్చు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని అడగచ్చు.. వాంగ్మూలం తీసుకోవచ్చు. కానీ వీళ్లు (సీబీఐ) అలా అడగరు. వాంగ్మూలం తీసుకోరు.

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకానందరెడ్డిది మర్డర్ ఫర్ గెయిన్ (ఆస్తి, సొమ్ము కోసం జరిగిన హత్య) అని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. సీబీఐ విచారణ తప్పుదోవలో వెళ్తోందని తాను మొదటి నుంచీ చెబుతూనే ఉన్నానని, అది గూగుల్ టేకౌట్ కాదు టీడీపీ టేకౌట్ అని అన్నారు. తప్పుడు సాక్ష్యాలతో అన్యాయంగా అమాయకులను ఇరికించేలా కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దర్యాప్తులో చాలా కీలక అంశాలను పక్కన పెట్టి, సిల్లీ అంశాలను తెరపైకి తెచ్చి తనకు అంటగట్టే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. సీబీఐ విచారణకు మూడోసారి శుక్రవారం హాజరైన అనంతరం ఆయన బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

వివేకాకు రెండో పెళ్లి.. వారికి ఓ కుమారుడు..

- వివేకం సార్‌కు 2006 నుంచి ఒక యువతితో సంబంధం ఉంది. 2011లో ఆమెను పెళ్లి చేసుకున్నారు. దానికి ఇస్లాం లా ప్రకారం తన పేరు షేక్ మహ్మద్ అక్బర్‌గా మార్చుకున్నారు. పెళ్లి తర్వాత వారికి షేక్ షెహన్‌షా అనే అబ్బాయి కూడా పుట్టాడు. ఆ అబ్బాయినే వారసుడిగా ప్రకటించాలనే తపన, ఆలోచన ఆయనలో ఉండింది.
- హత్య జరగడానికి ముందు ఇల్లంతా డాక్యుమెంట్ల కోసం వెతికారని అప్రూవర్ స్టేట్‌మెంట్‌లోనే ఉంది. హత్య తర్వాత కూడా డాక్యుమెంట్లు వెరిఫై చేసుకుని వెళ్లారని స్పష్టంగా చెప్పారు. నా అనుమానం ఏమిటంటే.. నోటరైజ్డ్ విల్లు అది. ఆమె (వివేకా రెండో భార్య) పేరుతోనో, వారి అబ్బాయి పేరుతోనో ఆస్తిని ఇవ్వాలనుకోవడం.. దీన్ని అడ్డుకోవాలనుకోవడం.. ఇందులో ఆసక్తి ఎవరికి ఉందో తెలియాలి.
- నా అనుమానం ప్రకారం ఇది మర్డర్ ఫర్ గెయిన్. అందులో భాగంగానే వాళ్లు వివేకానందరెడ్డి గారిని ఇలా చేశారు. రాబోయే రోజుల్లోనూ తప్పకుండా న్యాయ పోరాటం చేస్తా. నాకు తెలిసిన ప్రతి వాస్తవాన్నీ కోర్టుతో పాటు మీ ముందు కూడా ఉంచుతా.

ఆ లేఖ ఎందుకు దాచారు?

- నేను గాలి మాటలు మాట్లాడట్లేదు. సొంత కవిత్వాలు చెప్పట్లేదు. రికార్డుల్లో ఉన్నవి, వాటి ద్వారా తెలిసినవే మాట్లాడుతున్నా. నేను వెళ్లే లోపలే సీన్ ఆఫ్ క్రైమ్‌లో ఉన్న లేఖను సునీతమ్మ భర్త రాజశేఖర్ దాచి పెట్టారు. పీఏ కృష్ణారెడ్డికి ఆ లెటర్ విషయం కానీ, అందులో ఉన్న అంశాలు కానీ ఎవరికీ చెప్పొద్దని చెప్పారు. దీంతో పాటు సెల్‌ఫోన్‌ను దాచిపెట్టడం తప్పు కాదా? పోలీసులకు కూడా చెప్పలేదు. ఎక్కడా బాధ్యతాయుతంగా ప్రవర్తించలేదు.
- నన్ను వెళ్లమని చెప్తేనే అక్కడకు వెళ్లాను. లెటర్ ఉన్న విషయం నాకు కూడా చెప్పలేదు. ఆ లెటర్ చాలా కీలక ఆధారం. సరైన సమయానికి దాని విషయం బయటకు చెప్పకపోవడం ఈ కేసులో పెద్ద తప్పు. ఆ విషయంపై దర్యాప్తు చేయాలని కోరుతున్నా.
- నేను ఏ ఒక్కరికీ గుండెపోటని (వివేకా మరణానికి కారణం) చెప్పలేదు. కావాలంటే ఆ రోజు మార్చురీ దగ్గర, మార్చ్ 17న మాట్లాడిన మాటలు చూడండి. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం నేను అలా చెప్పినట్లు చిత్రీకరించింది. నేను బాధ్యతగా ప్రవర్తించాను. కుటుంబీకులు నాకు సమాచారం ఇచ్చాకే ఘటనా స్థలికి వెళ్లా.
- నేను చూసి బయటకు వచ్చి పోలీసులు, కుటుంబీకులు, దగ్గర బంధువులకు ఫోన్ చేసి విషయం చెప్పా. ఇవన్నీ చేయకుంటే తప్పంటారనుకున్నా. చేస్తే తప్పంటారని ఊహించలేదు. న్యాయ పరంగా పోరాటం చేస్తాం. సీబీఐ రికార్డుల్లో ఉన్న అంశాలనే తీసి కోర్టుల దృష్టికి తీసుకువెళ్తాం. మీడియా దృష్టికీ తీసుకువస్తాం. తప్పకుండా న్యాయం, నిజం గెలుస్తుంది.

ముమ్మాటికీ అది కట్టుకథే

- అప్రూవర్ థియరీనే ఓ కట్టుకథ. అందులో ప్రారంభంలోనే గొడవ ప్రస్తావన. రూ.8 కోట్ల డబ్బు రావాల్సి ఉందో, వచ్చిందో వాటి గురించి గొడవ మొదలైందని చెప్తారు. ఆ షేర్ల పంపకం మీద వివేకం సారేమో మొత్తం నాకే కావాలని అన్నట్లు, వీళ్లేమో నువ్వు సగం తీసుకో, నేను సగం తీసుకుంటా అన్నట్లు గొడవ మొదలై ఉండొచ్చంటారు.
- ఇదే సీబీఐ విచారణలో ఆ బెంగళూరు సెటిల్‌మెంట్‌కు సంబంధించి ఎనిమిది మంది సాక్షులు (ఎల్‌డబ్ల్యూ 10 నుంచి మొదలై) చాలా స్పష్టంగా చెప్పారు. ఆ సెటిల్‌మెంట్ ఫెయిల్ అయింది.. ఒక్క రూపాయి డబ్బు కూడా వచ్చే అవకాశం లేదు.. ఆ డాక్యుమెంట్లు అన్నీ ఫోర్జరీ అని చెప్తారు. అంటే రాని, వచ్చే అవకాశమే లేని డబ్బు కోసం ఎవరైనా వాగ్వాదం, గొడవ పెట్టుకుని కొట్టి చంపుకుంటారా? ఇది కట్టు కథ అని చెప్పడానికి ఇది చాలదా?

ఇది కుమ్మక్కు కాదా?

- సుప్రీంకోర్టులో మా సోదరి (సునీత) వైల్డ్ అలిగేషన్స్‌తో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను పూర్తిగా సమర్థిస్తూ సీబీఐ వాళ్లు కౌంటర్ అఫిడవిట్ వేస్తారు. గురువారం లంచ్ మోషన్ మూవ్ చేస్తూ రెస్పాండెంట్స్‌గా సీబీఐ డైరెక్టర్, దర్యాప్తు అధికారిని పెట్టాం. అయితే మధ్యాహ్నం 2 గంటల కల్లా సీబీఐ వారి కంటే ముందు మా సోదరి తరఫు అడ్వకేట్లు వచ్చారు. అంటే వారికి ఎవరు సమాచారం ఇచ్చారు?

అందుకే నోరు విప్పాల్సి వస్తోంది..

- కేవలం కుట్రలకు ఉపయోగపడే వాంగ్మూలాలు తప్ప నిజాలను వెల్లడించే వాంగ్మూలాలు తీసుకోవట్లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేను సరిగ్గా మద్దతు ఇవ్వలేదని ప్రచారం చేశారు. అభియోగాలు మోపారు. దాదాపు 800 పైచిలుకు ఎమ్మెల్సీ ఓటర్లు.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు ఉన్నారు. వారిని పిలిచి అడగండి. అదీ చేయరు. అప్రూవర్ థియరీ.. కట్టుకథను అడ్డం పెట్టుకుని విచారణను ఓ వ్యక్తి టార్గెట్‌గా ముందుకు తీసుకువెళ్తున్నారు.
- దీన్ని ఎవరూ హర్షించరు. దీంతో గళమెత్తడం మొదలుపెట్టాం. ఇప్పటి వరకు ఎన్ని విమర్శలు వచ్చినా, మీడియా ఎన్ని విమర్శలు చేసినా, మా సోదరి సునీతమ్మ సుప్రీంకోర్టులో, ఆంధ్ర హైకోర్టులో నాపై ఎన్ని ఆరోపణలు చేసినా మౌనంగానే ఉన్నా. ఎందుకంటే వివేకం సార్ చనిపోయారు.. ఈమె ఆయన కూతురు అని.. విచారణ జరుగుతున్నప్పుడు విచారణ సంస్థపై నమ్మకం ఉండాలని మౌనంగా ఉన్నాను.
- అయితే విచారణ తప్పుడుదోవలో వెళ్తోందని స్పష్టం కావడంతో నోరు విప్పుతున్నాను. నేను ఎటువంటి తప్పు చేయలేదని ప్రతి ఒక్కరికీ గట్టిగా చెబుతున్నా. ఈ విషయంలో ఎంత దూరమైనా వెళ్లి న్యాయ పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నా.

- సీబీఐ వాళ్లకు నోటీసు వచ్చిన వెంటనే చిటికలో సమాచారం ఇస్తున్నారు. ఆ రోజు సుప్రీంకోర్టులో కుమ్మక్కై పిటిషనర్‌కు అనుకూలంగా కౌంటర్ వేసి కోర్టులను తప్పుదోవ పట్టించారు. లంచ్ మోషన్‌లోనూ ఆమెకు సమాచారం ఇచ్చి ఇంప్లీడ్ చేయిస్తున్నారు. ఇది కుమ్మక్కు కాదా? దీని వెనుక పెద్ద కుట్రలు ఉన్నాయి. ఈ రాజకీయ కుట్రలను తప్పకుండా ఛేదిస్తాం. న్యాయ పోరాటం చేస్తాం. కంచే చేను మేస్తే.. సీబీఐ ఈ రకంగా కుమ్మక్కై విచారణ చేస్తే మాకు ఎవరు దిక్కు?


అవినాశ్‌ను ఇరికించేందుకే గూగుల్ టేకౌట్ కథ

- వివేకా హత్య కేసు దర్యాప్తుపై కడప మేయర్ సురేష్‌బాబు
- వైఎస్ అవినాశ్‌రెడ్డి వ్యక్తం చేసిన అనుమానాలను సీబీఐ పట్టించుకోలేదు
- వివేకా చనిపోయినప్పుడు మొదట చెప్పింది శివప్రకాశ్‌రెడ్డే
- ఆయన్ని ఎందుకు విచారించలేదు?



కడప కార్పొరేషన్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఇరికించేందుకే గూగుల్ టేకౌట్ కథ అల్లుతున్నారని కడప మేయర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు చెప్పారు. అందుకే తాము కోర్టును ఆశ్రయించామే తప్ప సీబీఐకి భయపడి కాదన్నారు. వైఎస్ కుటుంబం ఇలాంటి ఎన్నో కుట్రలను ఎదుర్కొని నిలబడిందన్నారు. వారిది పదిమందికి సాయం చేసే గుణమే తప్ప ద్రోహం చేసే ఆలోచన లేదన్నారు. సురేష్‌బాబు శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీబీఐపై ఉన్న నమ్మకం పోయేలా కేసు దర్యాప్తు సాగుతోందని అన్నారు. తాము లేవనెత్తుతున్న అనుమానాలపై దృష్టి పెట్టకుండా సీబీఐ ఒక కోణంలోనే దర్యాప్తు చేస్తోందని తెలిపారు. అవినాశ్‌రెడ్డి ఆయనకున్న అనుమానాలన్నీ లిఖితపూర్వకంగా ఇచ్చినా సీబీఐ అధికారులు పట్టించుకోలేదన్నారు. న్యాయవాది సమక్షంలో విచారించాలని, వీడియో తీయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. వివేకా చనిపోయినప్పుడు మొదట ఫోన్‌చేసి చెప్పిన శివప్రకాశ్‌రెడ్డిని ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. దస్తగిరి అప్రూవర్‌గా మారడంతో అతడిని స్వేచ్ఛగా వదిలేశారన్నారు. హత్యకు ముందు సునీల్‌యాదవ్ అవినాశ్‌రెడ్డి ఇంట్లో ఉన్నాడని చెప్పడం దారుణమన్నారు. సీబీఐ అధికారులు కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని, ఎల్లో మీడియాకు లీకులిస్తూ అభూత కల్పనలకు తావిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా సీబీఐ అధికారులు వాస్తవాలను వెలికితీసి, నిజమైన దోషులను శిక్షించాలని కోరారు.

దస్తగిరి ఎవరి పేరు చెబితే వారిని విచారిస్తున్నారు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్



వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఇరికించే కుట్ర జరుగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ చెప్పారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఎవరి పేరు చెబితే వారిని చార్జిషీట్‌లో పెట్టి విచారణకు పిలవడం సరికాదన్నారు. ఎంపీ అవినాశ్‌రెడ్డికి వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాలు లేకపోయినా విచారణ పేరిట వేధించి, ఆయన రాజకీయ భవిష్యత్‌ను నాశనం చేయాలనే కుట్ర కనిపిస్తోందన్నారు. సీబీఐ విచారణను బీజేపీలోని టీడీపీ కోవర్టులు ప్రభావితం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయని చెప్పారు.

అధికారంలోకి వస్తే..

2025 జనవరికల్లా జాబ్ కేలండర్

ఉమ్మడి చిత్తూరు అభివృద్ధిపై ఎంపీ మిథున్‌రెడ్డితో చర్చకు సిద్ధం: లోకేశ్



మదనపల్లె: '2024లో గెలిచేది చంద్రబాబే.. 2025 జనవరికల్లా మొదటి జాబ్ కేలండర్ తీసుకువస్తాం. పెండింగ్ పోస్టులు భర్తీ చేస్తాం' అని టీడీపీ నేత లోకేశ్ చెప్పారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో యువగళం పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రంలో అధికారులు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. చంద్రబాబు సీఎం అయితే వారందరిపైనా జ్యుడీషియల్ ఎంక్వైరీ వేసి సర్వీస్ నుంచి తప్పించి శిక్షిస్తారు. మేము కొట్టించుకునే వాళ్లం కాదు. కొట్టేవాళ్లం' అంటూ వ్యాఖ్యానించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అభివృద్ధిపై ఎంపీ మిథున్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నానని, చర్చించేందుకు ఎప్పుడు వచ్చినా సిద్ధమేనన్నారు. పెద్దిరెడ్డి కుటుంబంవల్ల మదనపల్లెకు పరిశ్రమలు రావట్లేదని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే పీలేరు, మదనపల్లె, పుంగనూరు, తంబళ్లపల్లెను కలిపి జిల్లాగా ఏర్పాటు చేసి మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామని లోకేశ్ చెప్పారు. అనంతరం పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా టీడీపీలో చేరారు.

కొనసాగుతున్న హెపటైటిస్ - బీ టీకా పంపిణీ

- ఇప్పటివరకు 54,805 మంది హెచ్‌ఐవీ బాధితులకు తొలి డోసు
- వచ్చే వారంలో హెచ్‌ఐవీ హైరిస్క్ వర్గాలకు ప్రారంభం
- హైరిస్క్‌లో ఉండే 1,45,903 మందికి వ్యాక్సిన్ పంపిణీ లక్ష్యం
- హెచ్‌ఐవీ, హైరిస్క్ వర్గాలకు టీకా ప్రారంభించిన తొలి రాష్ట్రం ఏపీనే



సాక్షి, అమరావతి: హెపటైటిస్ వ్యాధి నియంత్రణ, నివారణ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. హెపటైటిస్–బీ బారిన పడేందుకు ఎక్కువ అవకాశాలున్న హెచ్‌ఐవీ బాధితులకు టీకా పంపిణీని గత నెలలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రారంభించింది. రాష్ట్రంలోని 55 యాంటి రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) కేంద్రాల్లో టీకా అందుబాటులో ఉంచింది. హెచ్‌ఐవీ బాధితులకు స్క్రీనింగ్ నిర్వహించి హెపటైటిస్–బీ నెగెటివ్‌గా నిర్ధారణ అయిన వారికి టీకా వేస్తున్నారు. ఇలా ఇప్పటివరకు 54,805 మందికి తొలి డోసు వేశారు. రెండో డోసు 3,002 మందికి వేశారు. వచ్చే వారంలో హెచ్‌ఐవీ హైరిస్క్ వర్గాలకు టీకా పంపిణీ ప్రారంభిస్తున్నారు. ఏపీ శాక్స్ హై రిస్క్ వర్గాలుగా గుర్తించిన 3,923 మంది ట్రాన్స్‌జెండర్‌లు, 1,16,616 మంది మహిళా సెక్స్ వర్కర్లు, 23,623 మంది పురుష స్వలింగ సంపర్కులు, 1,741 ఇన్‌జెక్టింగ్ డ్రగ్ యూజర్స్.. మొత్తం 1,45,903 మందికి టీకా పంపిణీ లక్ష్యం. ఈ క్రమంలో దేశంలోనే హెచ్‌ఐవీ బాధితులు, హైరిస్క్ వర్గాలకు టీకా ఇస్తున్న తొలి రాష్ట్రంగా ఏపీ నిలుస్తోంది. తొలి డోసు వేసుకున్న నెలకు రెండో డోసు, తరువాత రెండు నెలలకు చివరి డోసు టీకా వేస్తారు. హెపటైటిస్ నియంత్రణలో భాగంగా ఇప్పటికే వైద్యులు, వైద్య సిబ్బందికి వందశాతం టీకా పంపిణీ చేశారు. కొత్తగా విధుల్లో చేరుతున్న వారికి కూడా టీకా వేస్తున్నారు. వైద్యశాఖ అంచనాల ప్రకారం రాష్ట్రంలో 2.3 శాతం జనాభా హెపటైటిస్ - బీ, 0.3 శాతం హెపటైటిస్–సీతో బాధపడుతున్నారు. శృంగారం, రక్తమార్పిడి, సిరంజిలు, టూత్‌బ్రెష్, రేజర్లు వంటి వివిధ రూపాల్లో హెపటైటిస్–బీ ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుంది. హెచ్‌ఐవీ బాధితులు, హైరిస్క్ వర్గాల వారు హెపటైటిస్–బీ బారిన పడటానికి ఎక్కువ అవకాశాలుంటాయని, అందువల్ల వీరు తప్పనిసరిగా టీకా వేయించుకోవాలని రాష్ట్ర హెపటైటిస్ వ్యాధి నియంత్రణ కార్యక్రమం ప్రత్యేకాధికారి డాక్టర్ నీలిమ తెలిపారు. దగ్గరలోని ఏఆర్‌టీ కేంద్రానికి వెళ్లి స్క్రీనింగ్ చేయించుకుని టీకా వేయించుకోవాలన్నారు. హెపటైటిస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారు కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలు చేయించి, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

• తెలంగాణ

నేడు ఈడీ ముందుకు కవిత

- ఢిల్లీ మద్యం కుంభకోణంలో విచారణ
- న్యాయ నిపుణులతో సుదీర్ఘంగా చర్చించిన కవిత
- వాంగ్మూలం వెనక్కి తీసుకుంటానన్న అరుణ్ పిళ్లై

సాక్షి, న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించి శనివారం ఉ.10.30 గంటలకు ఈడీ కార్యాలయంలో జరిగే విచారణకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత హాజరుకానున్నారు. సౌత్ గ్రూపు లావాదేవీలు, ఆప్ నేతలకు రూ.100 కోట్ల ముడుపులు, ఫోన్లు మార్చడం, ఆధారాలు ధ్వంసం చేయడం తదితర ఆరోపణలపై ఆమెను విచారించే అవకాశం ఉంది. హైదరాబాద్ నివాసంలో, ఢిల్లీ ఒబెరాయ్ హోటల్‌లో జరిగినట్లుగా చెబుతున్న సమావేశాలపై కూడా ప్రశ్నించవచ్చని సమాచారం. ఇండో స్పిరిట్స్ ఎల్1 దరఖాస్తుపై సమస్యలు వస్తే అరుణ్ పిళ్లై ద్వారా తనకు తెలియజేస్తే, తన స్థాయిలో పరిష్కరిస్తానని సమీర్ మహేంద్రుకు ఎమ్మెల్సీ కవిత తెలిపారని ఈడీ చార్జిషీట్‌లో ఆరోపించిన నేపథ్యంలో దీనిపైనా విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, జంతర్‌మంతర్ వద్ద దీక్ష అనంతరం కవిత న్యాయ నిపుణులతో సుదీర్ఘంగా చర్చించారు.

ప్రత్యేక కోర్టులో పిళ్లై పిటిషన్

ఇక ఈ కేసులో శుక్రవారం కీలక పరిణామం చోటు చేసుకుంది. తాను ఈడీకి ఇచ్చిన వాంగ్మూలాన్ని వెనక్కి తీసుకోవడానికి అవకాశమివ్వాలని.. కవిత బినామీగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అరుణ్ పిళ్లై విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ఈడీని ప్రత్యేక కోర్టు ఆదేశించింది. లిక్కర్ స్కామ్ కేసులో అరుణ్ పిళ్లైను ఈడీ ఇటీవల అరెస్టుచేసిన విషయం తెలిసిందే.

'కోహినూర్'లో కుట్ర..

మరోవైపు.. ఢిల్లీ మద్యం విధానం అమలు ఎలా? లాభాలేంటి? అనే కీలక అంశాలపై హైదరాబాద్ ఐటీసీ కోహినూర్ హోటల్‌లోనే చర్చ జరిగిందని ఈడీ పేర్కొంది. ఇండో స్పిరిట్స్‌లో ఎమ్మెల్సీ కవితకు 32.5 శాతం, మాగుంట రాఘవకు 32.5 శాతం, పరోక్షంగా సమీర్ మహేంద్రుకు 35 శాతం వాటా ఉందని తెలిపింది. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా రిమాండ్ రిపోర్టులో ఈడీ ఈ మేరకు ఆరోపణలు చేసింది.



వచ్చేనెల నుంచి చిరుధాన్యాల పంపిణీ

పైలట్ ప్రాజెక్టుగా రాయలసీమ జిల్లాల్లో అమలు

- రాగులు అందుబాటులో లేకపోవడంతో కర్ణాటక నుంచి సేకరణ
- ఇప్పటికే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా జొన్నల కొనుగోళ్లు
- రైతులను ప్రోత్సహించేలా కొన్న వెంటనే నగదు చెల్లింపులు

సాక్షి, అమరావతి : బియ్యం కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం చిరుధాన్యాల పంపిణీకి రంగం సిద్ధంచేస్తోంది. తొలిదశలో వచ్చేనెల నుంచి పైలట్ ప్రాజెక్టు కింద రాయలసీమ జిల్లాల్లో అమలుచేయనుంది. లబ్ధిదారులకు ప్రతినెలా ఇచ్చే రేషన్‌లో రెండు కేజీల బియ్యం బదులు రాగులు, జొన్నలు సరఫరా చేస్తుంది. ఇందులో భాగంగా పౌరసరఫరాల సంస్థ తొలిసారిగా చిరుధాన్యాలైన రాగులు, జొన్నలను మద్దతు ధరకు (రాగులు–రూ.3,578.. జొన్నలు రూ.2,970 (హైబ్రిడ్), రూ.2,990 (మల్దండి)) కొనుగోలు చేస్తోంది. రైతులను చిరుధాన్యాల సాగువైపు ప్రోత్సహించేందుకు ఉత్పత్తులను కొనుగోలు చేసిన వెంటనే నగదు చెల్లింపులు చేసే వ్యవస్థను కూడా అందుబాటులోకి తెచ్చింది.

కర్ణాటక నుంచి రాగుల సేకరణ

రాష్ట్రంలో వచ్చే ఖరీఫ్ నుంచి రాగుల ఉత్పత్తులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం పౌరసరఫరాల సంస్థ కర్ణాటక ప్రభుత్వం నుంచి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ద్వారా 25 వేల టన్నుల రాగులను సేకరిస్తోంది. మరోవైపు.. రాయలసీమ జిల్లాల్లో ఇప్పటికే జొన్నల కొనుగోలు నిమిత్తం పౌరసరఫరాల సంస్థ కొనుగోలు కేంద్రాలు తెరిచింది. అయితే, మద్దతు ధర కంటే మార్కెట్ రేటు ఎక్కువగా ఉండటంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకే విక్రయిస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జొన్నల పంపిణీకి వీలుగా, రైతులకు మరింత మేలు చేసేలా మద్దతు ధరను పెంచాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాసింది.

లబ్ధిదారుల ఆసక్తి మేరకు..

ఇక రాయలసీమ జిల్లాల్లోని బియ్యం కార్డుదారుల ఆసక్తి మేరకు ప్రతినెలా ఒక కేజీ నుంచి రెండు కేజీల వరకు రాగులను అందించనున్నారు. ఇప్పటికే జొన్నలు ప్రైవేటు మార్కెట్‌కు తరలిపోవడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సేకరణ నెమ్మదిగా సాగుతోంది. ఇప్పటివరకు 500 టన్నులే సేకరించింది. దీంతో భవిష్యత్తులో రైతులకు మరింత మేలు చేసేందుకు వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల శాఖ సంయుక్తంగా చిరుధాన్యాల సాగు ప్రోత్సాహకానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాయి. రాష్ట్రంలో డిమాండ్, సప్లైకు అనుగుణంగా సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులకు అవగాహన కల్పించనుంది.

పేదలకు బలవర్థకమైన ఆహారం

రాష్ట్రంలో ప్రజలకు బలవర్థకమైన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సీఎం జగన్ సంకల్పానికి అనుగుణంగా వచ్చేనెల నుంచి పేదలకు చిరుధాన్యాలు పంపిణీ చేయనున్నాం. రాష్ట్రంలో రాగుల నిల్వలు అందుబాటులో లేకపోవడంతో కర్ణాటక నుంచి సేకరించి ఇక్కడ పంపిణీ చేస్తాం. ఇప్పటికే జొన్నల సేకరణ చేపట్టాం.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి

విస్తీర్ణం పెంచేలా చర్యలు

రాష్ట్రంలో రేషన్ కింద రాగులు, జొన్నలు పంపిణీ చేయనున్నాం. బియ్యం కార్డుదారుల అవసరానికి అనుగుణంగా పంట ఉత్పత్తులు పెంచేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి రేటు ఉంది. జొన్నలకు పౌల్ట్రీ రంగంలో డిమాండ్ ఉంది. ఈ క్రమంలోనే పౌరసరఫరాల సంస్థ సేకరణ నెమ్మదిగా ఉంది. అందుకే మద్దతు ధర పెంచాలని కేంద్రానికి లేఖ రాశాం.

– హెచ్.అరుణ్‌కుమార్, పౌరసరఫరాల శాఖ కమిషనర్

• తెలంగాణ

ఆమోదించే వరకు పోరాటం

మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్షలో మాట్లాడుతున్న కవిత, చిత్రంలో సీపీఎం నేత సీతారాం ఏచూరి

- కేంద్రం మెడలు వంచే వరకు వెనక్కి తగ్గబోమని స్పష్టీకరణ
- ధరణిలో సగం..ఆకాశంలో సగం.. అవకాశాల్లోనూ సగం కావాలంటూ డిమాండ్
- ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష
- సీతారాం ఏచూరి, నారాయణ సహా పలు పార్టీల నేతలు హాజరు

సాక్షి, న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందే వరకు పోరాటాన్ని ఆపబోమని భారత్ జాగృతి వ్యవస్థాపకురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఈ విషయంలో కేంద్రం మెడలు వంచే వరకు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగే ప్రసక్తే లేదని చెప్పారు. మహిళలకు ధరణిలో సగం, ఆకాశంలో సగం, అవకాశాల్లోనూ సగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదించేందుకు అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కవిత చేపట్టిన ఒకరోజు నిరాహార దీక్షను సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభించారు. సాయంత్రం 4 గంటలకు సీపీఐ కార్యదర్శి నారాయణ, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావులు కవితకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అనేది కేవలం తన సమస్యో, తన రాష్ట్రం సమస్యో కాదని, మొత్తం దేశానికి సంబంధించిన సమస్య అని కవిత చెప్పారు. ఇది రాజకీయ పరమైన అంశం కూడా కాదని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రతిపక్షం సహా అన్ని పార్టీలు మాట్లాడుతున్నాయని, కానీ పార్లమెంటులో ఆమోదం పొందేలా ఏ పార్టీ కృషి చేయడంలేదని విమర్శించారు. మహిళలకు 33% రిజర్వేషన్ల వల్ల ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. పార్లమెంటులో పూర్తి మెజారిటీ ఉన్న బీజేపీ ప్రభుత్వం మహిళా బిల్లును తీసుకురావాలని, ఆ పార్టీ తలుచుకుంటే రెండు గంటల్లో ఈ బిల్లును ఆమోదించవచ్చని కవిత చెప్పారు. పార్లమెంటులో బిల్లుకు మద్దతివ్వడానికి అనేక పార్టీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీక్షకు వచ్చిన మహిళల సంతకాలతో కూడిన లేఖను రాష్ట్రపతి, ప్రధానమంత్రికి పంపిస్తామని వెల్లడించారు.

మహిళా భాగస్వామ్యంతోనే అభివృద్ధి: ఏచూరి

రాజకీయ రంగంలో మహిళా రిజర్వేషన్లు చాలా అవసరమని సీతారాం ఏచూరి అన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలకు సమానత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ విషయమై ప్రధాని మోదీ హామీ ఇచ్చి 9 ఏళ్లు గడిచినా ఇప్పటికీ బిల్లు తేలేదని విమర్శించారు. అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తున్నప్పుడు.. మహిళా బిల్లు ఎందుకు ఆమోదం పొందడంలేదో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ డిమాండ్ చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా ఏ రాజకీయ పార్టీ పోరాడినా దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇంకా చిత్ర సర్వార (ఆప్), నరేష్ గుజ్రాల్ (అకాలీదళ్), అంజుమ్ జావెద్ మిర్జా (పీడీపీ), షమీ ఫిర్దౌజ్ (నేషనల్ కాన్ఫరెన్స్), సుస్మితా దేవ్ (టీఎంసీ), కేసీ త్యాగి (జేడీయూ), సీమా మాలిక్ (ఎన్‌సీపీ), పూజ శుక్లా (ఎస్పీ), శ్యామ్ రజక్ (ఆర్‌ఎల్‌డీ)తో పాటు శివసేన తదితర విపక్ష పార్టీల నేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు. భారత్ కిసాన్ యూనియన్, నేషనల్ క్రిస్టియన్ బోర్డు, తమిళనాడు, కేరళ రైతు సంఘాల ప్రతినిధులు, సింగరేణి కోల్ మైన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాలుపంచుకున్నారు. అలాగే తెలంగాణ మంత్రులు సత్యవతి రాథోడ్, సబిత ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, సంతోష్ కుమార్, వెంకటేశ్ నేత, మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, రేఖా నాయక్, ఎమ్మెల్సీ ఆకుల లలిత, భారత్ జాగృతి నాయకులు పాల్గొన్నారు.

• తెలంగాణ

తెలంగాణలో ముందస్తు ఎన్నికల ప్రసక్తే లేదు

బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో తెలంగాణ సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదని, షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం .. సెప్టెంబర్ త ర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రావచ్చని, సిట్టింగ్ ఎమ్మెల్యేలు ప్రజలతో, కార్య కర్తలతో మమేకమై పనిచేయాలని కేసీఆర్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కక్ష పూరిత వైఖరిని జనం ముందు పెట్టాలని తెలిపారు. ''తెలంగాణ ప్రగతిని బీజేపీ ఓర్వడంలేదు. పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై సీబీఐ, ఐటీ, ఈడీ తప్పుడు ఆరోపణలతో దాడులు చేశాయి. ఇప్పుడు ఎమ్మెల్సీ కవితకు నోటీసులిచ్చారు. కవితను మహా అయితే ఏం చేస్తారు? అరెస్టు చేస్తారు. ఎంత వేధించినా భయపడేది లేదు. బీజేపీలో చేరని వారిని కేసులతో వేధిస్తున్నారు. కవితను కూడా బీజేపీలో చేరాలని అడిగారు. ఏం చేసినా కేంద్రంపై రాజకీయ పోరాటం ఆపేది లేదు. బీజేపీని దేశం నుంచి పారదోలే వరకు పోరాటం కొనసాగు తూనే ఉంటుంది'' అని కేసీఆర్ స్పష్టం చేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో ఏప్రిల్ 27న ఎల్బీ స్టేడియంలో రాష్ట్రస్థాయి ప్రతినిధుల సభ నిర్వహిస్తామన్నారు. అక్టోబర్‌లో వరంగల్‌లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. దళితబంధు లబ్ధిదారుల నుంచి కొందరు నాయకులు లంచాలు తీసుకుంటున్నట్టు తన దృష్టికి వచ్చిందని, అటువంటివి మానుకోవాలని హెచ్చరించారు.

జిల్లా వార్తలు

అరవైలో ఇరవై



నాటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా పతకం అందుకుంటున్న సాయిబాబు (ఫైల్)

నందిగామ: అరవై ఏళ్ల వయసులో ఇరవై ఏళ్ల యువకుడిలా ఉండాలని అందరూ ఆశపడుతుంటారు. నందిగామ పట్టణానికి చెందిన పారేపల్లి సాయిబాబు అరవైలో ఇరవైలా వ్యవహరిస్తున్నారు. అది వయసులో కాదు, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడే రక్తదానం చేయడంలో. ఆయన వయసు ప్రస్తుతం 60 ఏళ్లు. ఇప్పటికి 20 సార్లు రక్తదానం చేసి నలుగురికీ ఆదర్శంగా నిలిచారు.

యుక్త వయసు నుంచే సేవా కార్యక్రమాలు

సాయిబాబు బాల్యంలోనే పోలియో బారినపడ్డారు. టెన్త్ వరకు చదువుకున్న ఆయన వాసవి యువసేన ద్వారా సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. 30 ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదానం చేస్తే ఆపదలో ఉన్నవారి ప్రాణం నిలుస్తుందని భావించి, 1994లో తొలిసారిగా రక్తదానం చేశారు. అప్పటి నుంచి 20 సార్లు రక్తదానం చేశారు. అవయవ లోపం ఉన్నప్పటికీ సాయిబాబు ఎంతో ఆరోగ్యంగా ఉంటారు. ప్రస్తుతం రెడ్ క్రాస్ జిల్లా సభ్యుడిగా సేవలు అందిస్తున్నారు. తన ఆధ్వర్యంలో నందిగామ ప్రాంతంలో ఇప్పటి వరకు 15 సార్లు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయించారు. తమ సొసైటీ ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న 570 మందికి రక్తదానం చేయించి వారిని ఆదుకున్నారు. అంతే కాదు ముగ్గురు గవర్నర్ల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఓ బంగారు పతకాన్ని కూడా సొంతం చేసుకున్నారు. 2009లో అప్పటి గవర్నర్ ఎన్.డి.తివారీ చేతుల మీదుగా విజయవాడలో, 2011లో అప్పటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో, 2014లో అప్పటి తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

యువతలో మార్పు రావాలి

నేటి యువతీయువకులు రక్తదానం చేయాలంటే భయపడుతున్నారు. వాస్తవానికి రక్తదానం చేస్తే ఎదుటి ప్రాణం నిలవడంతో పాటు మన ఆరోగ్యం చాలా బాగుంటుంది. యువత ముందుకొచ్చి రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలు నిలుస్తాయి. నేనైతే ఇప్పటికి 20 సార్లు రక్తదానం చేశాను. షుగర్, బీపీ వంటి వ్యాధులు నా దరికి చేరలేదు.

– పారేపల్లి సాయిబాబు, నందిగామ

నెమలిలో కనుల విందుగా శ్రీ పుష్పయాగం



నెమలిలో స్వామి వారికి శ్రీ పుష్పయాగం

నెమలి(గంపలగూడెం): ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలిలోని శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల చివరి రోజు శుక్రవారం స్వామికి శ్రీ పుష్పయాగం కనుల విందుగా జరిపారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు, అర్చక బృందంచే స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలు నవఫల రసాలతో భక్తి శ్రద్ధలతో అభిషేకం చేశారు. నూతన వస్త్రాలు, సువర్ణ ఆభరణాలు, వివిధ రకాల పూలతో స్వామిని విశేషంగా అలంకరించారు. తదుపరి ఉత్సవ వేడుకలలో భాగంగా స్వామి ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలతో శ్రీ పుష్పయాగం వైభవంగా జరిపారు. వధూవరులైన శ్రీ వేణుగోపాల స్వామి, రుక్మిణీదేవి, సత్యభామలను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఉంచి ఆలయం చుట్టూ ద్వాదశ ప్రదక్షిణలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ప్రదక్షణకు స్వామికి ఒక రకం ఫలాలను వైవేద్యంగా సమర్పించారు. స్వామిని భక్తులు విశేషంగా దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వర ప్రసాదరావు, పాలకవర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు, వెంకటకృష్ణ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

సత్తాచాటిన కృష్ణా జిల్లా ఎడ్లు



ఎడ్ల యజమానులకు నగదు పంపిణీ చేస్తున్న కందుల గౌతమ్ నాగిరెడ్డి

బేస్తవారిపేట: అఖిల భారత జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు గురువారం అర్ధరాత్రి వరకు ఫ్లడ్‌లైట్ల వెలుగులో నిర్వహించారు. స్థానిక బేస్తవారిపేట జంక్షన్‌లో మాజీ ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డి వర్ధంతి సందర్భంగా కందుల ఓబులరెడ్డి వైద్యశాల చైర్మన్ డాక్టర్ కందుల గౌతమ్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేశారు. హోరా హోరీగా జరిగిన పోటీల్లో 19 జతల ఎడ్లు పాల్గొన్నాయి. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరుకు చెందిన డీవీ సుబ్బారావు ఎడ్లు 2,783 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి, వైఎస్సార్ జిల్లా చౌటుపల్లి గ్రామం, ప్రొద్దుటూరుకు చెందిన మార్తాల చంద్ర ఓబులరెడ్డి 2,487 అడుగులతో ద్వితీయ, వైఎస్సార్ జిల్లా బాలుగారిపల్లె, వల్లూరు మండలం ఇందిరెడ్డి రమణారెడ్డి ఎడ్లు 2,400 అడుగులతో తృతీయ, నంద్యాల మండలం బిల్లలాపురానికి చెందిన భూమా గోవర్ధనరెడ్డి ఎడ్లు 2202 అడుగులతో నాలుగో, గిద్దలూరు మండలం కొండపేటకు చెందిన మీనిగె కాశయ్య ఎడ్లు 1953 అడుగులతో ఐదో స్థానం, వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం చెర్లోపల్లికి చెందిన నంద్యాల శివరామిరెడ్డి ఎడ్లు 1815 ఆరో, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం చర్లోపల్లికి చెందిన దప్పిలి అంజిరెడ్డి ఎడ్లు 1814.7 అడుగులతో ఏడోవ, బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారానికి చెందిన లక్కు సాయి సాత్విక్ ఎడ్లు 1814.3 అడుగులతో ఎనిమిదో స్థానంలో నిలిచాయి.

పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరుసగా తొలి నుంచి ఎనిమిదో బహుమతులు రూ.1,01,116, రూ.75,116, రూ.60,116, రూ.50,116, రూ.40,116, రూ.30,116, రూ.20,116, రూ.10,116లను కందుల నాగార్జునరెడ్డి కుమారుడు గౌతం నాగిరెడ్డి అందజేశారు. పోటీల్లో గెలుపొందని 11 జతల ఎడ్ల యజమానులకు ఒక్కొక్కరికి రూ.8,116లను కన్సొలేషన్ బహుమతులుగా పంపిణీ చేశారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- హాల్ టికెట్ ఉన్న వారికి ఆర్టీసీలో ఉచిత ప్రయాణం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షలను విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. జిల్లాలో 154 కేంద్రాల ద్వారా 30,134 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఏప్రిల్ 3న జిల్లాలో నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణపై శుక్రవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18 వరకు పదవ తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించిందన్నారు. జిల్లాలో గుర్తించిన 154 పరీక్ష కేంద్రాల్లో 30,134 మంది పరీక్షలకు హాజరు కానున్నారని, వీరిలో 15,530 మంది బాలురు, 14,604 మంది బాలికలు ఉన్నారన్నారు. వీరిలో 27,329 మంది రెగ్యులర్, 2,805 మంది సప్లమెంటరీ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ప్రశ్నపత్రాలను భద్రపరిచేందుకు 35 పోలీస్ స్టేషన్లను స్టోరేజ్ కేంద్రాలుగా గుర్తించినట్టు చెప్పారు. పరీక్షల నిర్వహణకు ఇద్దరు అదనపు డిపార్టమెంట్ అధికారులు, 5 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, సి కేటగిరి కేంద్రాలకు 14 మంది రూట్ ఆఫీసర్లు, అదనంగా మరో 12 మంది రూట్ ఆఫీసర్లను ఏ, బీ కేంద్రాలకు నియమించామన్నారు. 12 మంది అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లను నియమించడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాలకు 1,354 ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. పరీక్షల అనంతరం 19 నుంచి 26వ తేదీ వరకు స్పాట్ వాల్యూయేషన్ నిర్వహించేందుకు బిషప్ అజరయ్య పాఠశాలను గుర్తించినట్టు కలెక్టర్ వివరించారు. విద్యార్థులు పరీక్షల కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా సమయాలలో అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని, హాల్ టికెట్ కలిగిన విద్యార్థులకు ఉచిత ప్రయాణానికి అనుమతించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో కె. మోహన్‌కుమార్, డీఈఓ సీవీ రేణుక, డీటీసీ పురేంద్ర, నగరపాలక సంస్థ అడిషనల్ కమీషనర్ శ్యామల, ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.వెంకటేశ్వరరావు, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

వారంలోగా బడి మానేసిన పిల్లల వివరాలివ్వండి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్షేత్రస్థాయిలో బడి మానేసిన బడి ఈడు పిల్లల వివరాలను సేకరించి వారం రోజుల లోపు నివేదికలు సమర్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నగరంలోని జిల్లా కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో ఆయన గూగుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జిల్లా వ్యాప్తంగా 5,600 మంది బడిమానేసిన బడిఈడు పిల్లలను గుర్తించామన్నారు. వీరిలో 3,700 మంది ఇతర ప్రదేశాలకు వెళ్లారని, మిగిలిన వారిలో సుమారు 1200 మందికి పైగా తిరిగి బడిలో చేర్పించినట్లు చెప్పారు. సుమారు 500 మంది మాత్రమే బడి ఈడు పిల్లలు బయట ఉన్నట్లుగా నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. మరోసారి బడిమానేసిన పిల్లల పూర్తి సమాచారాన్ని సేకరించి నిర్దిష్టమైన నివేదికలు రూపొందించాలని సూచించారు. వారందరినీ బడిలోకి చేర్పించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీలు వలంటీర్లతో కలిసి వారి పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి పిల్లలను గుర్తించాలన్నారు. బడి మానేయడానికి కారణాలను నమోదు చేసి నివేదికలను వారం రోజుల లోపు సమర్పించాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో డీఈఓ సీవీ రేణుక, ఏపీసీ జి.మహేశ్వరరావు, డిప్యూటీ డీఈఓ కె.రవికుమార్, జిల్లాకు చెందిన యంపిడివో, యంఇవోలు, ఏపీఎంలు సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

గొల్లపూడిలో మహిళా పారిశ్రామిక వేత్తల సదస్సు



పచ్చళ్ల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న వాసిరెడ్డి పద్మ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని టీటీడీసీ భవనంలో శుక్రవారం జాతీయ మహిళా కమిషన్, ఏపీ మహిళా కమిషన్ సంయుక్తంగా ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, వారి జీవితాల్లో మార్పు రావాలని అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత వంటి పథకాలను అందిస్తున్నారని చెప్పారు. ఇంటి యజమాని అంటే మహిళేనన్న సంకేతాన్ని సమాజానికి అందిస్తున్నామని.. మహిళల పేరు మీదనే ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు ఇవ్వడం, చేయూత పథకం ద్వారా 40 నుంచి 50 ఏళ్ల వయసుగల మహిళలకు ఉపాధి కల్పించడం వంటివి అందుకు నిదర్శనాలని చెప్పారు. మహిళలు తయారు చేసిన పచ్చళ్లు, జ్యూట్ బ్యాగులు, పండించిన ఆకుకూరలు తదితర స్టాల్స్‌ను వాసిరెడ్డి పద్మ పరిశీలించి వారిని ప్రశంసించారు.

ఉమెన్ ఫుట్‌బాల్ విజేత కడప

రన్నర్సప్‌గా గుంటూరు, తూర్పుగోదావరి

విశాఖ స్పోర్ట్స్: ఏపీ సీనియర్ మహిళా ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా వైఎస్ఆర్ కడప జట్టు నిలిచింది. ఇక్కడి రైల్వేస్టేడియంలో శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో కడప 6–0గోల్స్ తేడాతో గుంటూరు జిల్లా జట్టుపై విజయం సాధించింది. ఏపీ ఉమ్మడి జిల్లాలు ఈ టోర్నీలో తలపడగా మూడో స్థానానికి జరిగిన పోటీలో విశాఖ జిల్లా జట్టుపై తూర్పుగోదావరి జిల్లా జట్టు విజయం సాధించింది. దీంతో రన్నరప్‌గా గుంటూరు జట్టు నిలవగా, సెకండ్ రన్నరప్‌గా తూర్పుగోదావరి జిల్లా జట్టు నిలిచింది. పోటీల ముగింపు కార్యక్రమంలో ఏపీ ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ విజేతలకు ట్రోఫీలందించారు.

ఓటర్లకు ఆన్‌లైన్‌లో నగదు పంపిణీ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి నిర్వాకం | **సీఎస్‌పీ ద్వారా ఓటర్ల ఖాతాలోకి నగదు మళ్లింపు** | **పోలీసుల అదుపులో సీఎస్‌పీ నిర్వాహకుడు** | **హెచ్‌ఎం, పోస్టుమన్‌పై కేసు.. రూ.1,36,000 నగదు స్వాధీనం**

తాడిపత్రి అర్బన్: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న చామల వెంకట అనిల్‌కుమార్‌రెడ్డి ఉపాధ్యాయుల ఖాతాల్లోకి నేరుగా డబ్బు జమచేసేందుకు యత్నించి పోలీసులకు దొరికిపోయారు. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణ ఎస్‌ఐ ధరణీబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిపత్రి పట్టణంలోని గన్నెవారిపల్లి కాలనీలో ఉన్న లార్డ్ ఆసుపత్రి అధినేత చామల వెంకట అనిల్‌కుమార్‌రెడ్డి పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. అయితే, ఓటమి ఖాయమని భావించిన ఆయన కొత్త పద్ధతుల్లో డబ్బు పంపిణీకి శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల మండలం కోడిగుడ్లపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబశివారెడ్డి, యల్లనూరుకు చెందిన పోస్టుమన్ నగేష్ ద్వారా తాడిపత్రి పోలీస్‌స్టేషన్ సమీపంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ సర్వీస్ పాయింట్ (సీఎస్‌పీ)లో శుక్రవారం 28 మంది ఉపాధ్యాయ ఓటర్ల ఖాతాల్లోకి నేరుగా రూ.49



సీఎస్‌పీ నిర్వాహకుణ్ణి విచారిస్తున్న పోలీసులు

వేల నగదు బదిలీ చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పట్టణ, రూరల్ పోలీసులు దాడులు నిర్వహించి కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వాహకుడు శివశంకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. సాంబశివారెడ్డి, నగేష్ ప్రోద్బలంతో నగదు బదిలీ చేసినట్లు అతను అంగీకరించాడు. అతని నుంచి రూ.1,36,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. అతనితో పాటు హెచ్‌ఎం సాంబశివారెడ్డి, పోస్టుమన్ నగేష్‌పై కేసు నమోదు చేశారు. మరోవైపు.. అనిల్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా కొండేపల్లికి చెందిన ఉపాధ్యాయులు వజ్రగిరి, వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం బెంజి అనంతపురానికి చెందిన ఉపాధ్యాయుడు బత్తల రాజు, పి. నరసింహులుతో పాటు మరికొందరు కూడా శుక్రవారం తాడిపత్రిలో ఓటర్లకు నగదు పంపిణీ చేపట్టినట్లు పోలీసు విచారణలో తేలింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 11 । మార్చి । 2023



గుణదల పోలీసుస్టేషన్ ప్రారంభం

మధురానగర్: విజయవాడ నగరంలోని గుణదల లో నూతన పోలీస్ స్టేషన్‌ను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా శుక్రవారం ప్రారంభించారు.



మహిళా పారిశ్రామిక వేత్తల సదస్సు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని టీటీడీసీ భవనంలో శుక్రవారం జాతీయ మహిళా కమిషన్, ఏపీ మహిళా కమిషన్ సంయుక్తంగా ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు నిర్వహించారు.

ఫైర్ డీజీగా పీవీ సునీల్‌కుమార్

ఫైర్ డీజీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పీవీ సునీల్‌కుమార్‌ను అగ్నిమాపకశాఖ అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.



న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానానికి తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన భక్తులు శుక్రవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. అల్లం దుర్గారావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి రూ. 1,11,111 విరాళాన్ని అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం తర్వాత దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు ఇచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

విజయవాడ స్పోర్ట్స్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి రోడ్డు భద్రతకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ పి.సురేష్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. నగరంలో ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న 256 మందిని ఈ నెల 9వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. వీరికి ట్రాఫిక్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడం రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుందని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ సీఐ మహేంద్ర పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికకు సత్కారం



చిలకలపూడి(మచిలీపట్నం): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికను న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. సంస్థ ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా మహిళా న్యాయమూర్తుల దినోత్సవం సైతం నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తితో పాటు పలువురు మహిళా జడ్జిలు, సిబ్బందిని సన్మానించారు. న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య, సూపరింటిండెంట్ సీహెచ్ జయశ్రీ, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీలతో ఆలోచనలకు పదును

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు పోటీల్లో పాల్గొనటం ద్వారా ఆలోచనలకు పదును పెట్టవచ్చని కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు తెలిపారు. ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే పూర్వ పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల ప్రాంతీయ స్థాయి క్విజ్ చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం తరగతి గదులకే పరిమితమైతే అనుకున్న లక్ష్యాలను సాధించలేరని తెలిపారు. తమలోని భావవ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. నైపుణ్యాలకు క్విజ్, వక్తృత్వ పోటీలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు అండగా ఉంటాయన్నారు. ఉన్నత విద్యామండలి ప్రతినిధి ఎ.నగేష్‌బాబు మాట్లాడుతూ రాయలసీమ రీజియన్‌కు సంబంధించి తిరుపతిలో, అమరావతి రీజియన్‌కు విజయవాడలో, విశాఖపట్నం రీజియన్ పోటీలు విశాఖలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, అధ్యాపకులు హేమంత్‌కుమార్, వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

మహిళా నైపుణ్యంపై యూనియన్ బ్యాంక్ దృష్టి

సాక్షి, అమరావతి:మహిళల్లో నైపుణ్యం పెంచడంపై యూనియన్ బ్యాంక్ దృష్టి సారించింది. ఇందుకోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా - ఎంపవర్ హర్ కమిటీ పేరుతో ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించింది. యూనియన్ బ్యాంక్ ఎండీ, సీఈవో మనిమేకలై విజయవాడ పర్యటనలో భాగంగా గుణదలలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా మహిళల్లో నైపుణ్యం పెంచడానికి తమ బ్యాంకు దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం బీసీ హాస్టల్‌కు సీఎస్ఆర్ కార్యక్రమం కింద 180 లీటర్ల వాటర్ కూలర్, సీలింగ్ ఫ్యాన్లు, విద్యార్థినులకు స్కూల్ బ్యాగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ నవనీత్ కుమార్, గుణదల బ్రాంచ్ హెడ్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

పుట్టింటి పసుపు-కుంకుమ



తిరుపతమ్మ తల్లి చిన్న తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడు నుంచి పసుపు-కుంకుమల బండ్లు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలయానికి చేరుకున్నాయి. భక్తులు చేతులు జోడించి అమ్మవారికి నమస్కరించి పరవశించారు. పసుపు-కుంకుమలు తీసుకొచ్చిన అమ్మవారి వంశీకులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా ఉన్న ఆలయం చుట్టూ పసుపు-కుంకుమల బండ్లు చేసిన ప్రదక్షిణలో వేలాది మంది పాల్గొన్నారు. 90 అడుగుల దివ్య ప్రభోత్సవం కనులపండువగా సాగింది.

– పెనుగంచిప్రోలు



పేదల గూడులో వెలుగులు

■ వాంబే ఇళ్ల రిజిస్ట్రేషన్లకు పచ్చజెండా ■ నామమాత్రపు ఫీజులతోనే ప్రక్రియ ■ శాశ్వత హక్కు కల్పించేలా ఆదేశాలు ■ నగరంలో 20 వేల మంది పేదలకు ప్రయోజనం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: నగరంలో దశాబ్దాలుగా ఇళ్ల రిజిస్ట్రేషన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదల ఆశలు నెరవేరే రోజు ఆసన్నమైంది. ఇల్లు ఉందని చెప్పుకోవడానికి మాత్రమే తప్ప తమ ఆపదలో ఆదుకునేందుకు అక్కరకు రాని ఆ ఇళ్లను చూసుకొని తల్లడిల్లిన ప్రతి పేదవాడికి గుండె 'గూడు'లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన వెలుగులు నింపనున్నారు. కృష్ణానది , కెనాల్‌బండ్, రోడ్ల మార్జిన్‌లు, జవహర్ బస్ టెర్మినల్ తదితర ప్రాంతాల్లో ఉన్న అక్రమణలు తొలగించి, వారికి పునరావసం కింద అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో స్థలాలు కొని వీఎంసీ పట్టాలు ఇచ్చింది. 1970–80 నుంచి ఉన్న ఆక్రమణలు తొలగించి 13 వేల మందికి పైగా పట్టాలు ఇచ్చారు. అయితే వారు ఆ పట్టాలను బ్యాంకు లోనులు, వారి తదనంతరం అనువంశికంగా పిల్లలు మాత్రమే అనుభవించే హక్కు కల్పించారు. అయితే ప్రభుత్వం ఓటీఎస్ పథకం కింద పేదలకు రిజిస్ట్రేషన్లు చేయడంతోపాటు వారు అమ్ముకొనే అవకాశం కల్పించింది. దీనిని దృష్టిలో ఉంచుకొని స్థానిక ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌లు పునరావాసం కింద వీఎంసీ పరిధిలో పేదలకు ఇచ్చిన ప్లాట్లు అన్నింటినీ 22ఏ నుంచి తొలగించి శాశ్వత హక్కు కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన సీఎం, క్యాబినెట్ అమోదం తెలిపి 22ఏ జాబితా నుంచి తొలగించి, వారికి శాశ్వత హక్కు కల్పించేలా జీవో 04ను జారీ చేశారు.



పాయకాపురంలో ఇళ్లు

వాంబే పథకం ద్వారా...

వాంబే పథకం ద్వారా 2001లో 57వ డివిజన్‌లోని న్యూరాజరాజేశ్వరీపేట, 60వ డివిజన్‌లోని వాంబేకాలనీలో 6625 ఇళ్లను నిర్మించారు. వీటికి కేవలం నాడు పట్టాలు మాత్రమే ఇవ్వడం, రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో ఈ ఇళ్లల్లో నివసిస్తున్న లబ్ధిదారులకు ఆపద సమయంలో అవి అక్కరకు రాకుండా పోతున్నాయి. తమ ఇళ్లకు రిజిస్ట్రేషన్ల సౌకర్యం కల్పించాలంటూ స్థానిక ప్రజలు గత రెండు దశాబ్దాల నుంచి ఎంతోమంది నాయకులకు, నాటి టీడీపీ ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినతులు సమర్పించినా వారి గోడు పట్టించుకున్న నాథుడే లేడు. గత ఎన్నికల ముందు సెంట్రల్ నియోజకవర్గంలోని ఈ ఇళ్ల రిజిస్ట్రేషన్ల కోసం టీడీపీ ప్రభుత్వం దరఖాస్తుల కోసమని రూ.500, ఇంటి పట్టాదారుకు రూ.4వేలు, వారి దగ్గర కొనుగోలు చేసుకున్న వారికి రూ.8 వేలంటూ అధికారికంగా లెక్కలు చూపించి ఆ సాకుతో దొంగచాటున లక్షల రూపాయలను తమ జేబుల్లో నింపుకున్నారు. ఎన్నికల ముందు కేవలం మూడు నెలల సమయానికి మాత్రమే కాలపరిమితి ఉన్న జీఓ నెంబర్ 74ను తూతూమంత్రంగా తీసుకువచ్చారు. వీటికి 431 మంది డబ్బులు కట్టగా కేవలం 126 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్లు చేయించి ఎన్నికల కోడ్ అంటూ చేతులు దులుపుకున్నారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నగర ప్రజలకు నూతన సంవత్సరం, సంక్రాంతి కానుకగా జనవరి 3, 30 తేదీలలో జీవో నెంబర్ 4, 32 లను విడుదల చేసింది. దీని ద్వారా 6625లో మిగిలిన 6499 ఇళ్లకు చదరపు గజానికి రూ.100 చొప్పున కట్టించుకొని ఏడాది లోపు రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం కల్పించారు.

పాత ఇళ్లకు రిజిస్ట్రేషన్లు విడుదల

నగర శివారు ప్రాంతాల్లోని పాయకాపురం కాలనీలుగా పేరుగాంచిన పటేల్‌నగర్, ప్రకాష్‌నగర్, సుందరయ్యనగర్, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ కాలనీ, రాధానగర్, రాజీవ్‌నగర్, వడ్డెరకాలనీ, కుందావారి కండ్రిక పరిసర ప్రాంతాల్లో మున్సిపల్ కార్పొరేషన్ గతంలో 13915 ఇళ్లను నిర్మించగా వీటిలో 13204 మంది మాత్రమే నాడు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. మిగిలిన 711 ఇళ్లకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో ఈ ప్రాంతాల్లో ఆ నివాసితులంతా దశాబ్దాలుగా తమ ఇళ్ల రిజిస్ట్రేషన్ల కోసం గత టీడీపీ పాలకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం శూన్యం. వీరి బాధలను తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జీవో నెంబర్ 22ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాలోకి వెళ్లిన వాటిపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి వాటికి రీ రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించింది.

పట్టలేనంత సంతోషం



రెండు దశాబ్దాల నుంచి మా ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేయిస్తారేమోనని ఎదురుచూస్తూనే ఉన్నాం. రిజిస్ట్రేషన్లు లేకపోవడం వల్ల మా పిల్లల పెళ్లిళ్లు, అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైన సమయంలో ఇంటి కాగితాలు పెట్టుకొని డబ్బులు తెచ్చుకుందామంటే వీటిపై ఒక్కరు కూడా డబ్బులు ఇచ్చేవారు కాదు. చెప్పుకోవడానికి, ఉండడానికి మాత్రమే తప్ప ఆపద వేళల్లో ఇవి అక్కరకు వచ్చేవి కాదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా లాంటి పేదలందరి కన్నీళ్లు తుడిచేందుకు మంచి జీవోను తీసుకువచ్చారు. ఏళ్ల తరబడి ఉన్న మా రిజిస్ట్రేషన్ కల నెరవేరుతుందంటే పట్టలేనంత సంతోషంగా ఉంది.

– ఎరుబోతు చిట్టెమ్మ (న్యూరాజరాజేశ్వరీపేట)

చారిత్రాత్మక నిర్ణయం



పేదల మనసు ఎరిగిన ముఖ్యమంత్రి మన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నగరంలో పేద ప్రజల ఇళ్ల రిజిస్ట్రేష్ల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే సానుకూలంగా స్పందించారు. పేదల బతుకులు మార్చే చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. పేదల జీవన ముఖ చిత్రం పూర్తిగా మారిపోతుంది. అలానే నగరంలో పాకిస్తాన్ కాలనీ, బర్మాకాలనీల వంటి పలు ప్రాంతాల్లో ఇంటి పట్టాలు లేని వారికి కూడా అతి త్వరలో సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా ఇంటి పట్టాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాము.

– మల్లాది విష్ణు, ఎమ్మెల్యే

నెలరోజుల లోపు రిజిస్ట్రేషన్లు



విజయవాడ కార్పొరేషన్‌లో పునరావసకాలనీల్లో పేదలకు ఇచ్చిన పట్టాలకు సంబంధించి శాశ్వత హక్కు కల్పించే విధంగా ప్రభుత్వం జీవో జారీ చేసింది. వాటిని త్వరిత గతిని అమలు చేసి, పేదలకు మేలు జరిగే విధంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. రిజిస్ట్రేషన్లు చేయాలని నగర కమిషనర్‌తోపాటు, జిల్లా రిజిస్ట్రార్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. దీని ద్వారా నగరంలో 20 వేల మంది పేద కుటుంబాలకు లబ్ధి కలగనుంది.

– ఢిల్లీరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

ఎస్ఐ, కానిస్టేబుళ్లకు అరెస్ట్ వారెంట్లు

జగ్గయ్యపేట అర్బన్: ఓ కేసుకు సంబంధించి 2017లో జగ్గయ్యపేట పట్టణ ఎస్ఐగా పనిచేసిన పి.ప్రియకుమార్, కానిస్టేబుళ్లు ఎస్.చిరంజీవి, పి.హరిబాబుకు జగ్గయ్యపేట కోర్టు శుక్రవారం అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. పట్టణానికి చెందిన నూకల సాంబశివరావును పోలీసులు అక్రమంగా బంధించి తీవ్రంగా కొట్టి గాయపరిచారని పేర్కొంటూ అతని భార్య నూకల అస్మా 2017లో జగ్గయ్యపేట న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. సమన్లు జారీ చేసినప్పటికీ కోర్టుకు హాజరుకానందున ఎస్ఐ ప్రియకుమార్, కానిస్టేబుళ్లు చిరంజీవి, హరిబాబుకు కోర్టు అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. ఈ కేసులో నిందితులైన అప్పటి సీఐ వై.వి.ఎల్.నాయుడు, కానిస్టేబుల్ నాగరాజు ఈ నెల 27వ తేదీన కోర్టుకు హాజరుకావాలని అడిషినల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ ఎం.శోభారాణి ఉత్తర్వులు జారీ చేశారు.

యార్డులో 98,213 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 91,483 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 98,213 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,500 వరకు ధర దక్కింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 78,010 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సేవే సంకల్పం.. నేత్రదానంపై ప్రోత్సాహం

- నేత్రదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన
- నేత్ర వైద్య శిబిరాల ద్వారా కంటి ఆపరేషన్లు
- వేడుకల్లో మిగిలిన భోజనాలు పేదలకు పంపిణీ
- ఆదర్శంగా నిలుస్తున్న సుదర్శి మానవతా సేవా సంస్థ

నాగాయలంక(అవనిగడ్డ):చూపులేని వారు ఎందరికో చూపునిస్తున్నారు. ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులకు ఆకలి తీరుస్తున్నారు. తమ కళ్ల ముందు జరిగిన కొన్ని ఘటనలు వారిని సేవా కార్యక్రమాల వైపు మళ్లేలా చేశాయి. నాగాయలంక కేంద్రంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ నేత్రదానానికి ప్రోత్సహిస్తున్నారు. వేడుకల్లో మిగిలిన విందు భోజనాలను తీసుకెళ్లి ఎందరికో ఆకలి తీరుస్తున్నారు. తోటి వారికి తమ వంతు సేవ చేయాలనే ఈ యువకుల సంకల్పం పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

తన కుటుంబం నుంచే తొలి నేత్రదానం....

నాగాయలంకకు చెందిన యువ మత్స్య పారిశ్రామికవేత్త తలశిల రఘుశేఖర్‌కు శ్మశానవాటికకు వెళ్లే దారిలో రొయ్యల కంపెనీ ఉంది. ఎవరైనా చనిపోయినపుడు ఈ దారిన మృతదేహాలను శ్మశానవాటికకు తీసుకెళ్లేటప్పుడల్లా ఆయన మదిలో నేత్రదానం చేయించాలనే ఆలోచన వచ్చేది. ఇదే విషయాన్ని తన మిత్రుడు కనిగంటి నారాయణతో చెప్పడంతో తాను సంసిద్ధత వ్యక్తం చేశారు. 2009 మే 27 రఘుశేఖర్ తాతయ్య (తల్లికి తండ్రి) ఉప్పల వెంకయ్య చనిపోగా మన నుంచే నేత్రదానం ప్రారంభించాలనుకుని కుటుంబ సభ్యులతో చెప్పి ఒప్పించారు. అలా తొలి నేత్రదానంను రఘుశేఖర్ తన ఇంటి నుంచే శ్రీకారం చుట్టారు. ఈ మంచి కార్యక్రమాన్ని ఓ సంస్థ ద్వారా చేపడితే బాగుంటుందని భావించి సుదర్శి మానవతా సేవా సంస్థని ఏర్పాటు చేశారు. నారాయణ కూడా తన 12 ఏళ్ల కుమార్తె చనిపోగా ఆమె నేత్రాలను దానం చేశారు.



సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం (ఫైల్)

172 జతల కార్నియా సేకరణ..

ఎవరైనా చనిపోయిన విషయం తెలుసుకున్న వెంటనే తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణ అక్కడికి చేరుకుని నేత్రదానం పట్ల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి నేత్రదానంకు ఒప్పిస్తారు. గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన శంకర నేత్రాలయం, విజయవాడకు చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల ద్వారా ఇప్పటివరకూ వీరు 172 మంది నేత్రాల నుంచి కార్నియాలను సేకరించడం ద్వారా జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పటివరకూ 25 వైద్య శిబిరాల ద్వారా 4500 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు చేయించారు.

అన్నార్తుల ఆకలి తీరుస్తున్నారు

అన్న ప్రసాదసేవ పేరుతో రఘుశేఖర్, నారాయణతో పాటు చోడవరం గ్రామానికి చెందిన మత్తి శివ కలసి విందు భోజనాల్లో మిగిలిన పోయిన ఆహార పదార్థాలను సేకరించి అన్నార్తుల ఆకలి తీరుస్తున్నారు. కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్ వద్ద తమ ఫోన్ నెంబర్లు ఏర్పాటుచేసి ఆహార పదార్థాలు మిగిలితే వృథాగా పారేయకుండా ఫోన్ చేయాలని చెబుతారు. ఫోన్ చేసిన వెంటనే అక్కడకు వెళ్లి మిగిలిన భోజనాలను తీసుకొచ్చి వృద్ధాశ్రమం, పేదలకు అందజేస్తారు. ఇప్పటివరకూ నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ మండలాల నుంచి 246 సార్లు ఆహారాన్ని సేకరించి ఎందరికో కడుపు నింపారు.



సేకరించిన ఆహార పదార్థాలతో అన్నప్రసాద సేవ బృందం

ప్రతి సబ్జెక్టుపై పట్టు

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- మెరుగైన ఫలితాలకు పక్కా ప్రణాళిక
- రోజూ నాలుగు సబ్జెక్టులలో ప్రిపరేషన్, పరీక్షలు నిర్వహణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్‌కు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 13,461 మంది పదవ తరగతి విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు ప్రాక్టీసు చేయిస్తున్నారు. రైటింగ్ స్కిల్స్ పెంచుకునేలా తీర్చిదిద్దుతున్నారు. పరీక్షల ఒత్తిడిని అధిగమించేలా అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, అదనపు తరగతులు ఏర్పాటుచేసి పాఠాలపై పూర్తిస్థాయి పట్టు సాధించేలా చర్యలు తీసుకుంటున్నారు. చదువులో వెనుకబడిన వారిని గుర్తించి శిక్షణ ఇస్తున్నారు. అంతిమంగా అత్యుత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం చివరి పిరియడ్ మాత్రం గంట చొప్పున నిర్వహిస్తూ , మధ్యలో రెండు పిరియడ్‌లు కలిపి ఒక సబ్జెక్టుపై దృష్టి పెడుతున్నారు. అందులో 45 నిమిషాల పాటు ప్రిపరేషన్, మరో 45 నిమిషాలు పరీక్ష నిర్వహిస్తున్నారు.

ఒత్తిడిని అధిగమించేలా...

పబ్లిక్ పరీక్షలు రాయడమంటే విద్యార్థుల్లో ఎంతో కొంత ఆందోళన, ఒత్తిడి ఉంటుంది. దాని నుంచి ఉపశమనం పొందేలా మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాసేలా సూచనలు ఇస్తున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కొంత మందిని దత్తత తీసుకుని తర్ఫీదు ఇస్తున్నారు.

ప్రతి విద్యార్థిపై దృష్టి



పదవ తరగతి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దుతున్నాం. రోజూ నాలుగు సబ్జెక్టులలో పరీక్షలు నిర్వహిస్తున్నాం. వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు ఏర్పాటుచేస్తున్నాం.

– సీవీ రేణుక, జిల్లా విద్యాశాఖాధికారి

జ్వరాల నియంత్రణకు డ్రైడే పాటించాలి

డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రామిరెడ్డి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ రామిరెడ్డి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జ్వరాల నియంత్రణకు డ్రైడే పాటించడం తప్పనిసరి అని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సంచాలకుడు (డీహెచ్) డాక్టర్ వి.రామిరెడ్డి అన్నారు. మలేరియా కేసులు తగ్గుముఖం పట్టినప్పటికీ డెంగీ కేసులు అక్కడక్కడా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. వాటి నియంత్రణకు తప్పనిసరిగా డ్రైడే పాటించాలని ఆదేశించారు. గొల్లపూడి సచివాలయం–4 పరిధిలోని నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో డీహెచ్ డాక్టర్ రామిరెడ్డి ఆయనే పాల్గొని పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క శుక్రవారమే కాకుండా మిగిలిన రోజుల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య విద్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను నిర్మూలించాలని, పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, వినియోగించిన ప్లాస్టిక్ గ్లాసులు, కూలర్లు, ఫ్లవర్ వాజ్‌లతో నీటి నిల్వలు లేకుండా పొడిగా ఉంచుకోవాలని సూచించారు. ఏఎన్ఎంలు రోజూ వెక్టార్ హైజీన్ యాప్‌లో ఇష్యూలు పెట్టాలని, వాటిని పరిష్కరించడం ద్వారా పరిసరాల పరిశుభ్రత, దోమలు నియంత్రణ జరిగి జ్వరాలు అదుపులో ఉంటాయన్నారు. జాతీయ కీటకజనిత వ్యాధులు నియంత్రణ కార్యక్రమం రాష్ట్ర సమన్వయకర్త శ్రీకాంత్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు, కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆర్.పద్మావతి, ఏఎంఓ సూర్య కుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.జి. అప్పారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీరంగం, బయాలజిస్ట్ సూర్యకుమార్, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పుట్టు వెంట్రుకలకు రూ.1,500!

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఓ చిన్నారికి పుట్టు వెంట్రుకలు తీసినందుకు తాంబూలం పేరుతో దుర్గగుడి కేశఖండన శాల సిబ్బంది రూ.1500 వసూలు చేసిన ఘటనపై ఆలయ అధికారులకు ఫిర్యాదు అందింది. విశాఖపట్నానికి చెందిన మీసాల రవీంద్ర తన మనవరాలికి పుట్టు వెంట్రుకలు తీయించేందుకు కుటుంబ సభ్యులతో గురువారం దుర్గగుడి కేశఖండన శాలకు వచ్చారు. తలనీలాలు టికెట్ కొని, పుట్టు వెంట్రుకలు తీయాలని కోరగా సిబ్బంది రూ.500 అడిగారు. తాము రూ.200 ఇవ్వగలమని చెప్పగా, అవి కూడా వద్దులే ఉచితంగానే తలనీలాలు తీస్తామన్నారు. పుట్టు వెంట్రుకలు తీసే వారికి తాంబూలం ఇవ్వడం సంప్రదాయం కనుక రవీంద్ర కుటుంబ సభ్యులు రూ.200 ఇవ్వబోయారు. తొలుత అవి కూడా వద్దని, ఆ తరువాత మేనమామ, తల్లిదండ్రులు, అమ్మమ్మతాతయ్య నుంచి రూ.500 చొప్పున రూ.1500 వసూలు చేశారు. అనంతరం రవీంద్ర కుటుంబ సభ్యులు ఇంద్రకీలాద్రికి చేరుకుని దుర్గమ్మ దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయ అధికారులకు కేశఖండన శాల సిబ్బందిపై ఫిర్యాదు చేశారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయండి
- కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. తన చాంబర్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో ఆయన శుక్రవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ.. ఏప్రిల్ మూడు నుంచి 18వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పించాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పది రూట్లు ఏర్పాటు చేసి పోలీస్ బందోబస్తు ద్వారా ప్రశ్న పత్రాలను కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. మాల్‌ప్రాక్టీస్ జరగకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయాలని, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరయ్యేందుకు అవసరమైన ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. బస్సుల్లో హాల్ టికెట్ చూపితే ఉచితంగా ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ముందుగా సమావేశం నిర్వహించి తగిన సూచనలు జారీ చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు, విధుల్లో ఉన్న సిబ్బంది మొబైల్ ఫోన్లు వినియోగించకుండా చూడాలని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, డీఈఓ తాహెరాసుల్తానా, డీఎంహెచ్ఓ గీతాబాయి, బందరు డీఎస్పీ మాసూంబాషా, ఆర్టీసీ డిపో మేనేజర్ పి.పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లకు పోలీసులకు చిక్కిన గంజాయి స్మగ్లర్


గంజాయి అక్రమ రవాణా నిందితుడితో సీఐ నాగేంద్రకుమార్, పోలీసు సిబ్బంది

కంచికచర్ల(నందిగామ): గంజాయి తరలింపు కేసులో మూడేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని కంచికచర్ల పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నందిగామ రూరల్ సర్కిల్ సీఐ ఐ.వి.నాగేంద్రకుమార్ శుక్రవారం కార్యాలయంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. మూడేళ్ల క్రితం నలుగురు వ్యక్తులు విశాఖపట్నం ప్రాంతం నుంచి కారులో 334 కేజీల గంజాయిని హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తుండగా మండలంలోని కీసర టోల్‌ప్లాజా వద్ద పోలీసులు ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. నాలుగో నిందితుడు చీపురుపల్లి సింహాచలం నాయుడు పరారయ్యాడు. అప్పటి నుంచి అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. అతను విశాఖపట్నం ప్రాంతంలో సంచరిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో రెండు పోలీసు బృందాలు వెళ్లి పెందుర్తి మండలం వేపగుంట గ్రామంలో సింహాచలం నాయుడును పట్టుకున్నారు. నిందితుడిని నందిగామ కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి


ప్రసంగిస్తున్న శివ మకుటం

పెనమలూరు: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని కేంద్ర ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ బీఈఎంఎల్ డైరెక్టర్ శివ ముకుటం అన్నారు. కానూరు పీవీపీ సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం జాతీయ స్థాయిలో సితార్–2023 కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్ అలవర్చుకుని మల్టీ డిసిప్లినరీ ప్రాజెక్టులలో భాగస్వాములు కావాలని సూచించారు. సితార్‌లో వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు రెండు వేల మంది విద్యార్థులు పాల్గొని ప్రాజెక్టులు ప్రదర్శించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.నాగేశ్వరరావు, పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ వి.నాగభూషణం, ప్రిన్సిపాల్ కొండపల్లి శివాజీబాబు, కార్యక్రమ కన్వీనర్లు రాజు, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు. టీవీ రియాల్టీ షో సరిగమప నిర్వహించారు.

మునేరు వద్ద వృద్ధురాలు మృతి


బ్రహ్మేశ్వరి మృతదేహం

పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు వద్ద వృద్ధురాలు మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. గుంటూరుకు చెందిన దార్ల బ్రహ్మేశ్వరి(70) రెండు రోజుల క్రితం శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్లకు వచ్చింది. గురువారం రాత్రి మునేరు వద్ద ఆమె నిద్రించింది. శుక్రవారం ఉదయం అచేతనంగా పడివున్న ఆమెను భక్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి దగ్గర దొరికిన మందుల చీటీ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. మృతురాలి కుమారుడు దార్ల వెంకటేశ్వరరావు తన తల్లి అనారోగ్యంతో మృతి చెందిందని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా తెలిపారు. ఎస్ఐ హరిప్రసాద్ సమక్షంలో వృద్ధురాలి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎడ్ల పూటీ లాగుడు పోటీల విజేత కొత్తమాజేరు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న వినయ్‌కుమార్, రామకృష్ణ

గంపలగూడెం(తిరువూరు): శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నెమలి గ్రామంలో నిర్వహించిన పూటీ లాగుడు పోటీలు సీనియర్ విభాగంలో గురువారం రాత్రి ముగిశాయి. ఉత్కంఠంగా సాగిన ఈ పోటీల్లో 21 జతల ఎడ్లు పాల్గొన్నాయి. 8 నిమిషాల వ్యవధిలో క్వింటాన్నర బరువులో పూటీ లాగుడు పోటీలు నిర్వహించారు. చల్లపల్లి మండలం కొత్తమాజేరుకు చెందిన రైతు తుమ్మల వెంకట్రావు ఎడ్లు 2,600 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. కోడూరు మండలం విశ్వనాథపల్లికి చెందిన రైతు వెలిశెట్టి ఉమామహేశ్వరరావు ఎడ్లు 2,469.5 అడుగుల దూరం లాగి రెండో స్థానం, ఎమిలేనివారిపాలెంనకు చెందిన మోహన నాగరాజు, వెంకట గోపాలకృష్ణకు చెందిన ఎడ్లు 2,345.11 అడుగుల దూరం లాగి మూడు, ఇబ్రహీంపట్నంనకు చెందిన పి.వెంకటేశ్వరరావు ఎడ్లు 2,068.3 అడుగుల దూరం లాగి నాలుగు, ఉంగుటూరుకు చెందిన జి.నవీన్ ఎడ్లు 1,863.4 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో నిలిచాయని కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విజేత ఎడ్ల యజమానులకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.8 వేలు, రూ.5 వేల నగదు బహుమతులను దాతల సహకారంతో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు కావూరి వినయ్‌కుమార్, సర్పంచ్ దుబ్బాకుల రామకృష్ణ అందజేశారు. కమిటీ సభ్యులు కూరాకుల వెంకటకృష్ణ, తోటకూర వీరప్రసాద్, కుంభగిరి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని


ఆల్బెండజోల్ మేళాను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14న జిల్లాలోని ఏడాది నుంచి 19 ఏళ్ల పిల్లలందరూ నులిపురుగు నివారణ మాత్రలు(ఆల్బెండజోల్) తీసుకునేలా చూడాలని వైద్యులు, వైద్య సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆల్బెండజోన్ సరఫరా మేళాలను శుక్రవారం నిర్వహించారు. ఇబ్రహీంపట్నంతో పాటు, విజయవాడ రూరల్ మండలం, నగర పాలక సంస్థ పరిధిలోని చల్లపల్లి బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన ఆల్బెండజోల్ సరఫరా మేళాను డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని అర్హులైన చిన్నారులందరూ మాత్రలు వేసుకునేలా ప్రేరణ కలిగించాలన్నారు. ఈ నెల 14న పిల్లలందరూ డీ–వార్మింగ్ జరిగేలా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ నివారణ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం అధికారి డాక్టర్ మాధవి, డాక్టర్ సుధా ప్రసూజ, డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కళ్లజోళ్ల సరఫరాకు సీల్ టెండర్ల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన కళ్లజోళ్ల కోసం సీల్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి శుక్రవారం తెలిపారు. ఈ సీల్ టెండర్లను ఈ నెల 14వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు జిల్లా అంధత్వ నివారణ సంఘం పేరున రూ.1000 డీడీ తీసి జతచేయాలని పేర్కొన్నారు. సీల్ టెండర్లను ఈ నెల 17న ఉదయం 11 గంటలకు జిల్లా జాయింట్ కలెక్టర్ సమక్షంలో పరిశీలిస్తామని తెలిపారు.

డ్రెయిన్‌లోకి బైక్ దూసుకెళ్లి యువకుడి మృతి


రిషి మృతదేహం

పెనమలూరు: మండలంలోని కానూరు వంద అడుగుల రోడ్డులో డ్రెయిన్‌లోకి బైక్ దూసుకెళ్లి యువకుడు మృతి చెందిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ గోవిందరాజు కథనం మేరకు.. నిడమానూరుకు చెందిన కొండపనేని రిషి(25) గతంలో బెంగళూరులో ఉండేవాడు. ఐదు నెలల క్రితం నిడమానూరు వచ్చి అమ్మమ్మ ఇంట్లో సోదరుడు తేజతో కలిసి ఉంటున్నాడు. గురువారం రాత్రి బైక్‌పై బెంజిసర్కిల్ వద్ద ఉన్న బావ అవినాష్ వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి అర్ధరాత్రి రెండు గంటలకు ద్విచక్రవాహనంపై నిడమానూరు బయలు దేరాడు. కానూరు వంద అడుగుల రోడ్డులో కామినేని ఆస్పత్రి దాటిన తరువాత బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న డ్రెయిన్‌లోకి దూసుకెళ్లింది. డ్రెయిన్‌లో రుషి, అతనిపై బుల్లెట్ పడిపోవటంతో మృతిచెందాడు. శుక్రవారం వేకువజామున డ్రెయిన్‌లో రుషి, అతనిపై బైక్ పడివుండటాన్ని ఆ మార్గంలో మార్నింగ్ వాక్‌చేసే వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, 108 వాహనం ఘటనాస్థలి వద్దకు వచ్చి పరీక్షించగా అప్పటికే రుషి చనిపోయినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

5.5 కిలోల గంజాయి పట్టివేత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గొల్లపూడి ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని భవానీపురం పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద 5.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. గొల్లపూడి ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు శుక్రవారం మధ్యాహ్నం ఎస్ఐ లాలం ప్రసాద్‌కు సమాచారం అందింది. ఆయన పోలీసు సిబ్బందితో అక్కడకు వెళ్లగా బొడ సందేశ్, పెద్దడి అశోక్, మాచర్ల గుణ శివ శంకర్ కుమార్, సయ్యద్ ఆసిఫ్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులో తీసుకుని తనిఖీ చేయగా 5.5 కిలోల గంజాయి లభించింది. ఆ నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా, వారికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

గుణదల(విజయవాడ తూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా గుణదలలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుణదల గాంధీజీ కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శనివారం ఉదయం మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మురళీనగర్, ఎస్ఎల్‌వీ ఏరియా, గుణదల రైల్వేస్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.
మొగల్రాజపురం(విజయవాడతూర్పు): రింగ్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు జయప్రకాష్ నగర్, ఫిల్మ్ కాలనీ, ఎల్‌ఐసీ కాలనీ, వరలక్ష్మి నగర్, ప్రశాంతినగర్, రమేష్ ఆస్పత్రి రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదని గుణదల డివిజన్ ఈఈ పి.హరిబాబు ప్రకటనలో తెలిపారు.

దేవినేని మురళికి నివాళి



గుణదల (విజయవాడ తూర్పు): పేద విద్యార్థులకు అండగా నిలిచిన దేవినేని మురళి ఆదర్శప్రాయుడని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం దేవినేని మురళి 35వ వర్ధంతి జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు అంబేద్కర్, ప్రవల్లిక, నిర్మలకుమారి, వెంకటసత్యనారాయణ, సీనియర్ నేత కడియాల బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.
– స్థానిక నాలుగో డివిజన్‌లో చీరల పంపిణీ చేశారు. 5వ డివిజన్ క్రీస్తురాజపురంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన నేత కొరివి చైతన్య, రాజ్‌కమల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
పటమట(విజయవాడతూర్పు): స్థానిక 7, 9, 10, 11, 12, 14 డివిజన్లలో మురళి వర్ధంతి నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

సిద్ధార్థ మహిళా కళాశాలలో ఆటల పోటీలు



విజయవాడ స్పోర్ట్స్: మహిళా దినోత్సవం పురస్కరించుకుని విజయవాడ సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఆదేశాలతో ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పోటీలను నిర్వహించింది. షటిల్ బ్యాడ్మింటన్, 100 మీటర్ల స్పీడ్ వాక్, మ్యూజికల్ చైర్ పోటీల్లో విద్యార్థినులు పాల్గొన్నారు. పోటీలను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి ప్రారంభించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ యు.శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ ఎస్ఏ అజీజ్ పర్యవేక్షించారు.

బాలుడు కనిపించడం లేదని ఫిర్యాదు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పాఠశాలకు వెళ్లలేదని తల్లి మందలించడంతో కుమారుడు కనిపించకుండా పోయిన ఘటనపై కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణలంక రణదీవె నగర్ కరకట్ట ప్రాంతానికి చెందిన కోసూరి వెంకటేశ్వర్లు శ్రీ పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో మూడు రోజులుగా పాఠశాలకు వెళ్లకపోవడంతో గురువారం ఉదయం అతన్ని తల్లి దుర్గ మందలించింది. పాఠశాలకు వెళ్తున్నానని తల్లికి చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెదికినా ఆచూకీ లభించలేదు. తన కుమారుడు కనిపించడం లేదని శుక్రవారం తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా బాబా మందిర వార్షికోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరం 35వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం 5 గంటలకు గణపతి పూజతో వేడుకలు ప్రారంభమయ్యాయి. మండపారాధన, పుణ్యాహవచనం, సహస్రకలశ ఆహ్వానం చేశారు. మందిరం గౌరవాధ్యక్షులు గౌతంరెడ్డి ప్రత్యేక పూజలు చేసి కలశాభిషేకం ప్రారంభించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం పల్లకీ సేవ జరిగింది. కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కోదండరాముడి వార్షిక బ్రహ్మోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయం సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. సాయంత్రం స్వామివారు గజవాహనంలో ముత్యాలంపాడు, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాలమీదుగా నగరోత్సవం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

చకచకా అభివృద్ధి పనులు

- రామలింగేశ్వరనగర్‌లో రూ.10 కోట్లతో సౌకర్యాలు
- పనుల పురోగతిని పరుగులు పెట్టిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



రామలింగేశ్వరనగర్‌లో ఇటీవల పూర్తయిన వెలగపూడి సుబ్బారావు రోడ్డు

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్థానిక 15వ డివిజన్‌లో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. మౌలిక వసతుల కల్పనే ప్రథమ ప్రాధాన్యంగా పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వం పరుగులు పెట్టిస్తోంది. అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేస్తుండటంతో రోడ్లు, డ్రెయిన్లు, వాటర్ ట్యాంక్ నిర్మాణం, పార్కులు ఇతర సౌకర్యాల పనులు వేగంగా చేస్తున్నారు. డివిజన్‌లో రామలింగేశ్వరనగర్ సింహభాగం ఉంది. ఇక్కడ 11,836 మంది జనాభా నివసిస్తున్నారు. డివిజన్‌లో సుమారు రూ. 4 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లను నిర్మించారు. మరో రూ.7కోట్లతో రెండు నెలలుగా ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో డివిజన్‌లో రుద్రభూమి ఎదుట రూ.4కోట్లతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెండు నెలల నుంచి పనులు జరుగుతున్నాయి.

మెరిసిపోతున్న రోడ్లు

డివిజన్‌లో రోడ్లకు కొత్త కళ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు కూడా శరవేగంగా చేస్తుండటంతో గతుకుల రోడ్లన్నీ మెరిసిపోతున్నాయి. డివిజన్‌లోని రూ.35.5 లక్షలతో ఎర్రపోతువారి వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం, రూ.29.4కోట్లతో సాయిరామ్ కట్ పీసెస్ రోడ్డును అభివృద్ధి చేశారు. అలాగే రూ.33.24 లక్షలతో నీలవేణి రోడ్డును, రూ.30.50 లక్షలతో వీఎంఆర్ రోడ్డును, రూ. 30.10 లక్షలతో శివశంకర్‌రోడ్డు, 24.16 లక్షలతో కృష్ణవేణి రోడ్డు, వెలగపూడి సుబ్బారావు, ఇతర వీధుల రూపరేఖలు మార్చివేశారు.

ఇతర అభివృద్ధి పనులు

డివిజన్‌లో రోడ్లు, కాల్వలతోపాటు ఇతర వసతుల కల్పనపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించారు. క్రైస్తవ శ్మశానవాటికలో రూ.39.96 లక్షలతో మౌలిక వసతులు కల్పించారు. అభివృద్ధి చేసిన రోడ్లకు రెండు వైపులా రూ.25.22 లక్షలతో పాదచారులు వెళ్లడానికి పార్కింగ్ బ్రిక్స్ వేశారు. డ్రెయిన్ల వద్ద రక్షణగా ఐరన్ గ్రిల్స్ ఏర్పాటుచేశారు. గాయత్రి రోడ్డులోని వీఎంసీ రౌండ్ టేబుల్ స్కూలును రూ.69 లక్షలతో అభివృద్ధి చేశారు. సాయిరామ్ కట్ పీసెస్ రోడ్డులో రూ.45.59 లక్షలతో మురుగు పోవడానికి లాక్ సిస్టం నిర్మించారు. 71వ సచివాలయ పరిధిలో ఇబ్బందికరంగా ఉన్న డ్రెయిన్లకు మరమ్మతులు చేశారు. దీనికి రూ.2.23 లక్షలు వెచ్చించారు. డివిజన్‌లో మంచినీటి ఇబ్బందులను పూర్తిస్థాయిలో తొలగించడానికి పైప్‌లైన్ ఏర్పాటుచేశారు. రూ.20.05 లక్షలతో పైప్‌లైన్ అమర్చారు. ఈ ప్రాంతంలో వీటితోపాటు మరికొన్ని అభివృద్ధి పనులు చేస్తున్నారు.



రుద్రభూమి ఎదురు ఖాళీ స్థలంలో మంచినీటి ట్యాంక్ నిర్మాణం

మరో రూ.7కోట్లతో అభివృద్ధి



కార్పొరేషన్ ఎన్నికల్లో స్థానికులకు ఇచ్చిన మాట ప్రకారం ఇక్కడ అభివృద్ధి చేస్తున్నా. సుమారు రూ.4 కోట్లతో అభివృద్ధి చేశాను. మరో రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇవి వివిధ దశల్లో ఉన్నాయి. టీడీపీ హయాంలో పైసా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు. ఇక్కడి ప్రజలు వైఎస్సార్ సీపీ వెంట ఉన్నారు.
– బెల్లం దుర్గ, డిప్యూటీ మేయర్

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మహిళలు అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో రాణించాలని గోదావరి అర్బన్ బ్యాంక్ మేనేజర్ వి.భవాని, నేషనల్ లోక్ అదాలత్ బెంచ్ మేనేజర్ జి.సుజాత, అజయ్ స్కూల్ ప్రిన్సిపాల్ అపర్ణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం సింగ్‌నగర్ నందమూరినగర్‌లోని నిరుపేదలకు నిత్యవసర సరుకుల పంపిణీ, ఆర్థిక సాయం అందజేత కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సృష్టికి మూలమే మహిళలని, వారిని గౌరవించాల్సిన సమాజంలో ఆది నుంచి దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. మహిళా శక్తి గొప్పదని, ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా వాటిని సహించి విజయాలను సాధిస్తున్నారని చెప్పారు. వంటింటికి మాత్రమే పరిమితమైన స్థితి నుంచి నేడు గగనతలంలోకి పయనించే స్థాయి మహిళలు ఎదిగారన్నారు. మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటూ నిరుపేదలకు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. ధ్యాన మందిర్ యోగా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు గడి ఝాన్సీ, ఎం.రత్నమాలలు యోగా, ధ్యానం విశిష్టతను స్థానికులకు వివరించి అవగాహన కల్పించారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు.



పేదలకు నిత్యవసరాలు అందిస్తున్న అతిథులు

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుంటున్న మహిళలదే సమాజ నిర్మాణంలో కీలక పాత్ర అని విజయవాడ రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో శుక్రవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినులు సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమారి మాట్లాడుతూ చదువుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లి ఏదైనా సాధించగలరని పేర్కొన్నారు. అటువంటి చదువు నేర్పే ఉపాధ్యాయినులు తనను సత్కరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. చిన్నారులకు విద్య బోధిస్తూనే కుటుంబ బాధ్యతలు నెరవేరుస్తున్న ఉపాధ్యాయినులు అభినందనీయులన్నారు. మండల విద్యాశాఖాధికారి ఆదూరి వెంకటరత్నం మాట్లాడుతూ ప్రపంచంలో పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను గౌరవించడం ప్రతి పౌరుని బాధ్యతన్నారు. బిడ్డ పుట్టిన నాటి నుంచి ఎదిగే వరకు అహర్నిశలు కృషి చేసే అమ్మ ఆదిగురువని చెప్పారు. తాను ఈ స్థాయికి చేరుకోవడానికి కారణమైన అమ్మకు రుణపడి ఉంటానన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు యూసఫ్ మాట్లాడుతూ మహిళా శక్తి ముందు ఎవరైనా తల వంచక తప్పదన్నారు. కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు కె.నెహ్రూ నిర్వహించారు.



రూరల్ ఎంపీపీ ప్రసన్నకుమారిని సత్కరిస్తున్న ఎంఈఓ వెంకటరత్నం తదితరులు

ముస్లింలకు ప్రభుత్వం మేలు చేస్తోంది

ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ గౌస్ మొహిద్దీన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజల్లోకి తీసుకువెళ్లటమే తన ధ్యేయమని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ గౌస్ మొహిద్దీన్ తెలిపారు. జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన గౌస్ మొహిద్దీన్, సభ్యులు షేక్ హబీబుల్లా, షేక్ షకీల్‌ను భవానీపురంలోని హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ బాబా దర్గాలో కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మొహిద్దీన్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తామని చెప్పారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి అందజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ముస్లిం మైనార్టీలకు చేసిన మోసాన్ని వెల్లడిస్తానన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రెహమాన్ (దిల్‌దార్), మైనార్టీ నాయకులు అబ్దుల్ సత్తార్, మొహమ్మద్ అల్తాఫ్, ఎండీ ఇషాక్, నాయబ్ రసూల్, ఎండీ నసీమ్ తదితరులు పాల్గొన్నారు.



గౌస్ మొహిద్దీన్, షకీల్, హబీబుల్లాను సత్కరిస్తున్న దర్గా కమిటీ సభ్యులు

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

- 140 కేసుల నమోదు..
- రూ.4.46 లక్షల జరిమానా

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ టౌన్ డివిజన్ పరిధిలోని ముత్యాలంపాడు సెక్షన్‌లో శుక్రవారం విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 140 కేసులు నమోదు చేసి రూ. 4.46లక్షలు అపరాధ రుసుం విధించారు. మొత్తం 44 బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. ఇందులో అధికంగా వాడుకుంటున్న విద్యుత్ లోడ్ గుర్తించి క్రమబద్ధీకరణకు నోటీసులు జారీచేశారు. ఈ దాడుల్లో టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వి.సుధాకర్ పర్యవేక్షణలో విజిలెన్స్ ఏడీఈ బి.నవీన్ కుమార్, ఏడీఈ నాగసాయి, ముత్యాలంపాడు ఏఈ బి.వెంకట స్వామి, విజిలెన్స్ ఏఈ లు, టౌన్ డివిజన్ ఏడీఈలు, ఏఈలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తొలుత దాడులకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో డివిజన్‌లోని ఎనర్జీ అసిస్టెంట్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లకు వారి విధులు, బాధ్యతలు వివరించారు. అలాగే ఫీల్డ్‌లో లైన్ల మీద పని చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పారు.



ఎనర్జీ అసిస్టెంట్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్‌లకు సూచనలు చేస్తున్న అధికారులు

బుద్దా వారి గుడి వద్ద తాచుపాము కలకలం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బ్రాహ్మణవీధిలోని బుద్దా వారి గుడి వద్ద శుక్రవారం తాచు పాము కనిపించడంతో స్థానికంగా కలకలం రేగింది. బుద్దా వారి గుడి పక్కనే ఉన్న స్క్రాప్ షాపు షట్టర్ వద్ద సుమారు 6 అడుగుల తాచు పాము ఉండటాన్ని అక్కడే టీ తాగేందుకు వచ్చిన కొంత మంది గమనించి కేకలు వేశారు. జనం కేకలు, బైక్ హారన్ మోతలతో పాము చుట్టలుగా చుట్టేసుకుంది. పెద్ద ఎత్తున జనం అక్కడే ఆగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఇంతలో పాము విషయాన్ని స్థానికులు కార్పొరేషన్ సిబ్బందికి సమాచారం అందించారు.

ప్రమాదాల నివారణపై ముగిసిన శిక్షణ



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో వారం రోజులుగా జరిగిన ప్రమాదాల నివారణ శిక్షణ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా చీఫ్ వర్క్ మేనేజర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది రోజువారీ పనుల్లో జరిగే ప్రమాదాల నివారణపై కార్మికులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన తక్షణ చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. గ్యాస్ లీకైతే తీసుకోవాల్సి జాగ్రత్తలు, వ్యక్తులు గాయపడితే ఎటువంటి చర్యలు చేపట్టాలి. అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే పద్ధతులు, సీపీఆర్ చేసే పద్ధతిని మాక్‌డ్రిల్ ద్వారా వివరించారు. డెప్యూటీ సీఎంఈ రవీంద్ర, పలువురు అధికారులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

ఇబ్రహీంపట్నం: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించి, ప్రమాదాలు నివారించాలని కర్మాగారాల ఉప తనిఖీ అధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. 45వ జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక ఎన్టీటీపీఎస్‌లో ప్రమాదాల నివారణపై కార్మికులు, ఉద్యోగులకు అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాల తోనే ప్రమాదాలు జరుగుతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రమాదాల నివారణ జీరో స్థాయికి తీసుకురావాలని చెప్పారు. వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

కొండప్రాంతంలో స్పెషల్ డ్రైవ్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ఆవరణలో ఉన్న నీటి తొట్టెలు, డబ్బాలను ప్రతి శుక్రవారం కడిగి శుభ్రం చేసుకుని ఒక రోజంతా పొడిగా ఉంచాలని మలేరియా ఇన్‌స్పెక్టర్ రాంబాబు చెప్పారు. చిట్టినగర్‌లోని సొరంగం కొండ ప్రాంతంలో శుక్రవారం మలేరియా సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సాధుజాన్ వీధి, రాయప్పరాజు వీధి, సమాధి స్కూల్ పరిసరాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి నీరు నిల్వ ఉన్న తొట్టెలను పరిశీలించారు. ప్లాస్టిక్ డబ్బాల్లో ఉన్న నీటిలో దోమల లార్వాను గుర్తించిన సిబ్బంది మహిళలకు అవగాహన కల్పించారు. సిబ్బంది యాంటీ లార్వా ఆపరేషన్ పనులు చేశారు. జ్వరపీడితులు మలేరియా రక్త పరీక్ష చేయించుకుని మందులను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మరింత చేరువగా పోలీస్ సేవలు

సీపీ టీకే రాణా



గుణదల పీఎస్‌ను ప్రారంభిస్తున్న సీపీ టీకే రాణా చిత్రంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, అవినాష్

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుణదల పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో క్రైం రేటు తగ్గుతుందని, ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడానికి నూతన పోలీస్‌స్టేషన్లు దోహద పడతాయని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా అన్నారు. మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో శుక్రవారం కొత్తగా ఏర్పాటు చేసిన గుణదల పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథి సీపీ టీకే రాణా, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారు ప్రాంతాలపై నేరాల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. డీజీపీ ఆదేశాల మేరకు నగరాన్ని గంజాయి రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడానికి మూడు నెలల నుంచి యాంటీ గంజాయి కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. చింతపల్లి, పాడేరు ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఇక్కడకు తీసుకువచ్చి గంజాయి సరఫరా చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు.
ఎన్టీఆర్ కమిషనరేట్‌లో ఇప్పటి వరకు 80 కేసులు నమోదు చేసి 230 మందిని అరెస్ట్ చేశామన్నారు. యాంటీ గంజాయి కార్యక్రమంలో పోలీసులతో పాటు ఎస్ఈబీ కూడా పని చేయడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ క్రైం రేట్ తగ్గించటం ద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందులో భాగంగా తమ ప్రభుత్వం గుణదల పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిందన్నారు.
ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో నేరాలు తగ్గించడానికి కృషి చేయాలని సూచించారు, అవినాష్ మాట్లాడుతూ అందరికీ నాణ్యమైన పోలీసు సేవలు అందించడానికి నూతన పోలీస్ స్టేషన్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, డీసీపీ విశాల్ గున్ని, ఏఆర్ ఏడీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ ఖాదర్ బాషా, రవికిరణ్, గుణదల సీఐ కృష్ణమోహన్, పటమట సీఐ కాశీవిశ్వనాథ్, మాచవరం సీఐ గుణరామ్, కృష్ణలంక సీఐ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

షేక్ షిరీన్ బేగంకు ఐపీఎస్ హోదా

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఏపీ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ షిరీన్ బేగంకు కేంద్ర ప్రభుత్వం ఐపీఎస్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. మైనారిటీ అయిన షేక్ షిరీన్ బేగంకు ఐపీఎస్ హోదా రావడంపై రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్‌తో పాటు పలువురు అధికారులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించి మంచి పేరు పొందాలని ఆకాంక్షించారు. 2000.. గ్రూప్–1 ఆఫీసర్ అయిన షేక్ షిరీన్‌బేగం ఒకేసారి రెండు బాధ్యతలు సర్వే కమిషనర్ ఆఫ్ వక్ఫ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీగా పనిచేస్తూ అందరి మన్ననలు పొందుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో పది మందికి హోదా రాగా, వారిలో సీనియారిటీలో మొదటి వ్యక్తిగా షిరీన్ బేగం ఐపీఎస్ హోదా పొందడం హర్షణీయమని వారు పేర్కొన్నారు.



షేక్ షిరీన్ బేగం

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అల్ మునీర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, పేదలకు వైద్య పరీక్షలు చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. లబ్బీపేటలోని ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం అవినాష్ లాంఛనంగా వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మునీర్ అహ్మద్ షేక్ మాట్లాడుతూ మానవ సేవే మాధవసేవగా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్డియాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్ వ్యాధులకు సంబంధించి 200 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు చేశారు. కార్డియాలజిస్టు డాక్టర్ తబిష్ సయ్యద్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ షణ్ముక్ తుమాటి, గైనకాలజిస్టు డాక్టర్ రజియ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మందులు ఇస్తున్న అవినాష్

మహిళా విద్యతో సమాజాభివృద్ధి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళా విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్న సావిత్రిబాయి పూలే ఆ దిశగా బాలికల కోసం పాఠశాలను స్థాపించి విద్యను నేర్పించారని ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరిరావు అన్నారు. సంఘ సంస్కర్త, దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతీరావు పూలే అడుగుజాడల్లో నాటి సమాజంలో మహిళలు అభివృద్ధి చెందాలంటే ఆధునిక విద్య ద్వారానే సాధ్యమని గుర్తించిన మహిళ సావిత్రిబాయి పూలే అన్నారు. ఆమె చేసిన పోరాటాలతో నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మాదాల తిరుపతిరావు, ఏపీ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ యశోద, పార్వతి, రాజేశ్వరి, ఎస్ చెంచులక్ష్మి, ఎ.నాగమణి, జిల్లా అధ్యక్షులు పూర్ణయ్య, పిచ్చుక లింగారావు తదితరులు పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శేషగిరిరావు తదితరులు

దాడి ఘటనపై కేసు నమోదు

పెనమలూరు: ఆస్తి తగాదాల కారణంగా భార్య, అత్తింటివారు భర్తపై దాడి చేయటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా చిగురువలసకు చెందిన నేతింటి రామకృష్ణకు కొద్ది సంవత్సరాల క్రితం యనమలకుదురుకు చెందిన కె.భారతితో వివాహమైంది. రామకృష్ణ చైన్నైలో రైల్వేలో టీసీగా పని చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య విభేదాలు రావటంతో భారతి పుట్టింటికి వచ్చి ఉంటోంది. వారి మధ్య ఆస్తి తగాదాలు రావటంతో రామకృష్ణ యనమలకుదురులో ఉన్న భార్య వద్దకు వచ్చాడు. తన భార్య భారతి, మరదలు హారతి, అత్త సరస్వతి తనపై దాడి చేశారని రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

గంజాయి విక్రేత అరెస్టు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గంజాయిని విక్రయిస్తున్న ఓ కేడీ షీటర్‌ను అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం న్యూరాజరాజేశ్వరిపేటలోని ఆంజనేయస్వామి గుడి వద్ద కోరగాటి హోసన్న అనే వ్యక్తి బ్యాగు పట్టుకొని అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అతన్ని అదుపులోకి తీసుకొని బ్యాగును తనిఖీ చేశారు. అందులో 2 కేజీల గంజాయి లభించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి బిజినెస్

శనివారం
11-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	671	59,135
నిఫ్టీ ▽	177	17,413

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,233	▽ 105
డోజోన్స్	32,093	▽ 161
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,748	▽ 132
డాక్స్	15,428	▽ 205
షాంఘై	3,230	▽ 46
నికాయ్	28,144	▽ 479

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారెట్)	55,669 △ 383
బంగారం (22 క్యారెట్)	55,446 △ 381
వెండి (కిలో)	61,791 ▽ 2

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎపి	81.38	83.05
£	బ్రిటన్ పౌండ్	ఎపి	96.38	99.64
€	యూరో	ఎపి	85.60	88.64
¥	జపాన్ ఎన్ (100)	ఎపి	59.23	61.15
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎపి	52.93	55.28
S$	సింగపూర్ డాలర్	ఎపి	59.68	61.62
SAR	సౌదీ రియాల్	క్యాష్	20.88	22.55
UAE D	యూఏఈ దిర్హామ్	క్యాష్	21.44	23.23
¥	చైనా యువాన్	క్యాష్	10.69	12.76

హెచ్‌యూఎల్ ఎండీగా రోహిత్ జావా

న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) నూతన ఎండీ, సీఈవోగా రోహిత్ జావా నియమితులయ్యారు. దశాబ్ద కాలంపాటు నాయకత్వం వహించి పదవీ విరమణ చెందుతున్న సంజీవ్ మెహతా స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు.



ప్రస్తుతం లండన్‌లో యూనిలీవర్ ట్రాన్స్‌ఫర్మేషన్ చీఫ్‌గా జావా ఉన్నారు. అయిదేళ్ల కాలానికిగాను ఎండీ, సీఈవోగా 2023 జూన్ 27న బాధ్యతలు స్వీకరిస్తారు. అలాగే ఈ ఏడాది ఏప్రిల్ 1న కంపెనీ శాశ్వత డైరెక్టర్‌గా హెచ్‌యూఎల్ బోర్డులో చేరనున్నారు. యూనిలీవర్ సౌత్ ఏషియా ప్రెసిడెంట్‌గానూ ఆశీనులు కానున్నారు.

సెమీకండక్టర్ల రంగంలో మరింత సహకారం

భారత్, అమెరికా మధ్య ఎంవోయూ



సంయుక్త విలేకరుల సమావేశంలో భారత్ అమెరికా వాణిజ్య మంత్రులు

న్యూఢిల్లీ: సెమీకండక్టర్ల రంగంలో సహకారాన్ని మరింత పెంచుకునే దిశగా భారత్, అమెరికా శుక్రవారం ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. భారత్–అమెరికా వాణిజ్య చర్చల్లో భాగంగా కుదుర్చుకున్న ఈ ఒప్పందం.. సెమీకండక్టర్ల సరఫరా వ్యవస్థ ఏర్పాటు, ఆవిష్కరణల అంశాల్లో కలిసి పనిచేసేందుకు తోడ్పడనుంది. దాదాపు మూడేళ్ల విరామం తర్వాత ఈ చర్చలు జరిగాయి. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులపరమైన సంబంధాలను మెరుగుపర్చుకునే మార్గాలపై ఈ సమావేశంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, అమెరికా వాణిజ్య మంత్రి జినా రైమొండో చర్చించారు. ఎలక్ట్రానిక్స్ సరఫరా వ్యవస్థలో కీలకంగా ఎదగాలన్న భారత్ ఆకాంక్షలకు ఈ ఎంవోయూ ద్వారా తోడ్పాటు లభించగలదని అమెరికా భావిస్తున్నట్లు రైమొండో తెలిపారు. పటిష్టమైన సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేందుకు, పరస్పర సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఇది ఉపయోగపడగలదని గోయల్ వివరించారు.

పారిశ్రామిక ఉత్పత్తి ఓకే!

- జనవరిలో ఐఐపీ 5.2 శాతం అప్
- విద్యుత్, తయారీలు బాగున్నాయ్

న్యూఢిల్లీ: భారత్ పారిశ్రామిక ఉత్పత్తి 2023 జనవరిలో మంచి పనితీరును కనబరిచింది. ఇందుకు సంబంధించిన సూచీ (ఐఐపీ) 5.2 శాతం పెరిగింది.



2022 డిసెంబర్‌లో సూచీ పెరుగుదల రేటు 4.7 శాతంగా ఉంది. ఇక 2022 జనవరిలో ఐఐపీ వృద్ధి రేటు కేవలం 2 శాతం. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన గణాంకాల ప్రకారం విద్యుత్, తయారీ రంగాలు చక్కటి పనితీరును ప్రదర్శించాయి.

రంగాల వారీగా ఉత్పత్తి గణాంకాలు (శాతాల్లో)

	2023 జనవరి	2022 డిసెంబర్
తయారీ	3.7	2.6
మైనింగ్	8.8	9.8
విద్యుత్	12.7	10.4
క్యాపిటల్ గూడ్స్	11.0	7.6
కన్జూమర్ డ్యూరబుల్స్	- 7.5	- 10.4
కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్	6.2	7.2
ఇన్‌ఫ్రా/నిర్మాణం	8.1	8.2
ప్రైమరీ గూడ్స్	- 9.6	8.3
ఇంటర్మీడియట్ గూడ్స్	-0.1	-0.3

ఏప్రిల్ నుంచి జనవరి వరకూ ఆర్థిక సంవత్సరం 10 నెలల కాలంలో ఐఐపీ వృద్ధి రేటు 5.4 శాతంకాగా, 2021-22 ఇదే కాలంలో ఈ రేటు 13.7 శాతం.

అంబుజాలో అదానీ 4.5 శాతం వాటాల విక్రయం

న్యూఢిల్లీ: అనుబంధ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా గ్రూప్ రుణభారాన్ని తగ్గించుకోవడంపై అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ దృష్టి పెడుతున్నారు. ఇందులో భాగంగా అంబుజా సిమెంట్స్‌లో 4.5 శాతం వాటాను విక్రయించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని విలువ సుమారు 450 మిలియన్ డాలర్లుగా (దాదాపు రూ.3,380) ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.



ఇందుకు సంబంధించి ఆర్థిక సంస్థలను కూడా సంప్రదించినట్లు పేర్కొన్నాయి. గతేడాది కొనుగోలు చేసిన అంబుజా సిమెంట్‌లో అదానీకి 63 శాతం వాటాలు ఉన్నాయి. ప్రస్తుతం అదానీ గ్రూప్ రుణ భారం దాదాపు 24 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికన్ షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో గ్రూప్ కంపెనీల షేర్లు ఇటీవల భారీగా పతనమైన సంగతి తెలిసిందే. అయితే, మళ్లీ కొన్ని క్రమంగా కోలుకుంటున్నాయి.

ఐపీవోకు టాటా టెక్నాలజీస్

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కార్పొరేట్ దిగ్గజం టాటా గ్రూప్ నుంచి మరో కంపెనీ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. గ్లోబల్ ఇంజినీరింగ్ సర్వీసెస్ అందించే టాటా టెక్నాలజీస్ ఐపీవో సన్నాహాలు ప్రారంభించింది. సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది.



ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్‌కు ఇది అనుబంధ సంస్థకాగా.. ఇంతక్రితం ఐటీ సేవల నంబర్ వన్ కంపెనీ టీసీఎస్ 2004లో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యింది. ఐపీవోలో భాగంగా టాటా టెక్నాలజీస్ 9.57 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది.

గ్లోబల్ సర్ఫేసెస్ @ రూ. 133-140

నేచురల్ స్టోన్స్ ప్రాసెసింగ్, ఇంజినీర్డ్ క్వార్ట్జ్ తయారీ కంపెనీ గ్లోబల్ సర్ఫేసెస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ సోమవారం(13న) ప్రారంభం కానుంది. బుధవారం (15న) ముగియనున్న ఇష్యూకి షేరుకి రూ. 133–140 ధరల శ్రేణిని కంపెనీ ప్రకటించింది. తద్వారా రూ. 155 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఐపీవోలో భాగంగా 85.2 లక్షల షేర్లను తాజాగా జారీ చేయనుంది.

మార్కెట్లకు గ్లోబల్ షాక్



- రెండో రోజూ భారీ అమ్మకాలు
- సెన్సెక్స్ 671 పాయింట్లు డౌన్
- 59,135 వద్ద ముగింపు
- 177 నష్టంతో 17,413కు నిఫ్టీ

ముంబై: యూఎస్‌కు చెందిన ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్ నిధుల సంక్షోభాన్ని ఎదుర్కోవడంతో ప్రపంచవ్యాప్తంగా సెంటిమెంటుకు దెబ్బ తగిలింది. దీంతో వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. సెన్సెక్స్ 671 పాయింట్లు కోల్పోయి 59,135 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 177 పాయింట్లు క్షీణించి 17,413 వద్ద నిలిచింది. రోజంతా అమ్మకాలదే పైచేయి కావడంతో మార్కెట్లు నష్టాల మధ్యే కదిలాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 58,885ను తాకింది. ఒక్క రోజులోనే బీఎస్‌ఈ మార్కెట్ విలువలో రూ. 1.36 లక్షల కోట్లు ఆవిరైంది. రూ. 2,62,94,724 కోట్లకు చేరింది.

బ్యాంకింగ్‌కు దెబ్బ

అంచనాలకు మించి వడ్డీ రేట్లు పెరగవచ్చన్న యూఎస్ ఫెడ్ చైర్మన్ పావెల్ వ్యాఖ్యలు, ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్‌పై ఆందోళనలు ఇన్వెస్టర్లలో భయాలకు కారణమయ్యాయి. దీంతో దేశీయంగా బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాలు ఊపందుకున్నాయి. ఎన్‌ఎస్‌ఈలో బ్యాంకింగ్, మీడియా, రియల్టీ, మెటల్, ఐటీ 2–1 శాతం నీరసించాయి. ఎఫ్‌ఎంసీజీ, కన్జూమర్ డ్యురబుల్స్ స్వల్పంగా బలపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, అపోలో హాస్పిటల్స్, ఇండస్ఇండ్, ఎస్‌బీఐ, యాక్సిస్, బజాజ్ ఫిన్, ఎంఅండ్ఎం, ఐసీఐసీఐ, ఎల్అండ్‌టీఆర్‌ఐఎల్, కొటక్ బ్యాంక్ 3–1 శాతం మధ్య క్షీణించాయి. టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ, మారుతీ, బ్రిటానియా, పవర్‌గ్రిడ్, టైటన్ 1–0.4 శాతం మధ్య బలపడ్డాయి.

మూతబడిన సిలికాన్ వ్యాలీ బ్యాంక్

న్యూయార్క్: ఇన్సూర్డ్ డిపాజిట్ల రక్షణకు వీలుగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న సిలికాన్ వ్యాలీ బ్యాంక్(ఎస్‌వీబీ)ని మూసివేసినట్లు కాలిఫోర్నియా ఆర్థిక పరిరక్షణ శాఖ పేర్కొంది. అంతేకాకుండా ఫైనాన్షియల్ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఐసీ చేతికి అప్పగించినట్లు శుక్రవారం వెల్లడించింది. ప్రధానంగా సిలికాన్ వ్యాలీ, టెక్ స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్ ఆర్థిక సంక్షోభంలో పడింది. బ్యాంక్ పోర్ట్‌ఫోలియోలో భారీ నష్టాలు నమోదుకావడంతో నిధుల సమీకరణకు తెరతీసింది. బాండ్ల పోర్ట్‌ఫోలియోలో నష్టాలు నమోదు చేస్తున్న 21 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 1,72,000 కోట్లు) విలువైన బాండ్లను విక్రయించినట్లు ఎస్‌వీబీ వెల్లడించింది. దీంతో 1.8 బిలియన్ డాలర్ల చిల్లు పడినట్లు తెలియజేసింది. ఫలితంగా బ్యాలన్స్‌షీట్ పటిష్టత కోసం 2.25 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను విక్రయించనున్నట్లు తెలియజేసింది. ఈ నేపథ్యంలో నికర వడ్డీ ఆదాయం భారీగా క్షీణించవచ్చని బ్యాంక్ అంచనా వేసింది. యూఎస్ వెంచర్ క్యాపిటల్(వీసీ) దన్నున్న మొత్తం స్టార్టప్‌లలో సగానికిపైగా ఎస్‌వీబీ ఫైనాన్షియల్ సేవలందిస్తోంది. కస్టమర్లలో గతేడాది ఐపీవోకు వెళ్లిన 44 శాతం టెక్, హెల్త్‌కేర్ కంపెనీలుండటం గమనార్హం! జాబితాలో పింటెరెస్ట్ ఇంక్, షాపిఫై ఇంక్, సైబర్ సెక్యూరిటీ సంస్థ క్రౌడ్‌స్ట్రైక్ హోల్డింగ్స్ తదితరాలున్నాయి. వెరసి పలు వీసీ సంస్థలు ఎస్‌వీబీతో పోర్ట్‌ఫోలియో బిజినెస్‌లను తగ్గించుకోవడంతోపాటు నగదును వెనక్కి తీసుకునే యోచనలో పడినట్లు తెలుస్తోంది. దీంతో బ్యాంక్‌పట్ల విశ్వాసం ఉంచవలసిందిగా క్లయింట్లు, వీసీ ఇన్వెస్టర్లను ఎస్‌వీబీ సీఈవో గ్రెగ్ బెకర్ అభ్యర్థించారు.

బ్యాంక్ షేర్లకు సెగ

ఎస్‌వీబీ ఆర్థిక సంక్షోభ ఆందోళనలకుతోడు సిల్వర్‌గేట్ క్యాపిటల్ కార్ప్ మూతపడటంతో ఇన్వెస్టర్లలో భయాలు అధికమయ్యాయి. ఇటీవలే ఫెడ్ చైర్మన్ పావెల్ వడ్డీ రేట్ల పెంపు సంకేతాలివ్వడం దీనికి జత కలిసింది. ఫలితంగా గురువారం కేబీడబ్ల్యూ బ్యాంక్ ఇండెక్స్ 8% కుప్పకూలింది. యూఎస్ దిగ్గజాలు బ్యాంక్ ఆఫ్ అమెరికా, వెల్స్ ఫార్గో, జేపీ మోర్గాన్ షేర్లు 5%స్థాయిలో పతనమయ్యాయి.

కనెక్ట్ స్మార్ట్ సన్‌గ్లాసెస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ కనెక్ట్ గ్యాడ్జెట్స్ రిథమ్ పేరుతో బ్లూటూత్ కాలింగ్ స్మార్ట్ సన్‌గ్లాసెస్‌ను ఆవిష్కరించింది.



ఎండ నుంచి రక్షణతోపాటు ఫోన్ కాల్స్ అందుకోవచ్చు. పాటలు వినొచ్చు. స్పెషల్ లాంచ్ ఆఫర్ ధర రూ. 1,999. నాలుగు గంటల ప్లేబ్యాక్ టైమ్ అందిస్తుంది. మార్కెట్లోకి విడుదల చేసిన 3 రోజుల్లోనే 20,000 యూనిట్లు విక్రయించామని కంపెనీ కో–ఫౌండర్ ప్రదీప్ యెర్రగుంట్ల తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-3-2023	
విశాఖ	430–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	423–00
విజయవాడ	423–00
రిటైల్ ధర (డజను)	66.00
10-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	415–00
వరంగల్	417–00
రిటైల్ ధర	4.75

సాక్షి స్పోర్ట్స్

జర్మనీపై భారత్ విజయం

ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్ హాకీ టోర్నీలో భారత్ ఖాతాలో కీలక గెలుపు చేరింది. రూర్కెలాలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3–2 గోల్స్ తేడాతో ప్రపంచ చాంపియన్ జర్మనీపై సంచలన విజయం సాధించింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్ (30వ నిమిషం) పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ సాధించగా... సుఖ్‌జీత్ సింగ్ రెండు ఫీల్డ్ గోల్స్ (31వ ని., 42వ ని.) నమోదు చేశాడు. జర్మనీ నుంచి రెండూ ఫీల్డ్ గోల్స్ వచ్చాయి. 44వ నిమిషంలో కాఫ్‌మన్ పాల్ ఫిలిప్, 57వ నిమిషంలో స్ట్రత్‌ఆఫ్ మైకేల్ గోల్స్ కొట్టారు. మూడో క్వార్టర్ ముగిసే సరికి భారత్ 3–1తో ఆధిక్యంలో నిలిచినా... చివరి క్వార్టర్‌లో జర్మనీ గోల్ చేసి ఆధిక్యాన్ని తగ్గించగలిగింది. తమకు లభించిన ఏకైక పెనాల్టీని భారత్ సద్వినియోగం చేసుకోగలిగింది. భారత్ తమ తర్వాతి పోరులో ఆదివారం ఆస్ట్రేలియాతో తలపడుతుంది.



మన బ్యాటర్లపైనే భారం



అశ్విన్

భారత్, ఆస్ట్రేలియా ఆఖరి టెస్టు పరుగుల బాట పట్టింది. గ్రీన్ శతకం సహాయంతో కంగారూలు భారీ స్కోరు నమోదు చేశారు. ఒక ఇన్నింగ్స్‌లో రెండు శతకాలు రావడం ఈ సిరీస్‌లో ఇదే మొదటిసారి. ఇక మన జట్టు ఎన్ని పరుగులు సాధిస్తుందనేది ఆసక్తికరం. ఆడిన పది ఓవర్లలో చక్కటి షాట్లతో ఎలాంటి ప్రమాదం లేకుండా రెండో రోజును ముగించిన టీమిండియా... మూడో రోజూ బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై చెలరేగాల్సి ఉంది.

- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 36/0
- ఆస్ట్రేలియా 480 ఆలౌట్
- కామెరాన్ గ్రీన్ సెంచరీ

అహ్మదాబాద్: ఈ సిరీస్‌లో స్పిన్ మాయలో, వికెట్ల వేటలో విజయవంతమైన బౌలర్లకు చివరి టెస్టు కఠినమైన సవాల్ విసురుతోంది. బ్యాటర్లకు స్వర్గధామంగా కనిపించిన మోదీ మైదానంలో రెండో రోజూ పరుగుల జోరు కొనసాగింది. అశ్విన్ (6/91) ఆరు వికెట్లతో ఆకట్టుకోగా... అప్పటికే పర్యాటక ఆసీస్ భారీ స్కోరు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 167.2 ఓవర్లలో 480 పరుగుల వద్ద ఆలౌటైంది. ఉస్మాన్ ఖాజా (422 బంతుల్లో 180; 21 ఫోర్లు) డబుల్ సెంచరీ అవకాశం కోల్పోగా, కామెరాన్ గ్రీన్ (170 బంతుల్లో 114; 18 ఫోర్లు) టెస్టు కెరీర్‌లో తొలి శతకం బాదాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ పది ఓవర్లు ఆడి వికెట్ కోల్పోకుండా 36 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (17 బ్యాటింగ్; 2 ఫోర్లు), శుబ్‌మన్ గిల్ (18 బ్యాటింగ్; 1 ఫోర్, 1 సిక్స్) క్రీజులో ఉన్నారు.

ద్విశతక భాగస్వామ్యం...

రెండో రోజు తొలి సెషన్‌లో కూడా ఆస్ట్రేలియా ఆధిపత్యమే కొనసాగింది. 255/4 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన ఉస్మాన్ ఖాజా– గ్రీన్ జోడీ భారత బౌలింగ్‌పై పైచేయి సాధించింది. దీంతో జట్టు స్కోరు 300 పరుగులు దాటింది. లంచ్ బ్రేక్‌కు ముందే ఖాజా 150 మార్క్‌ను దాటగా, గ్రీన్ సెంచరీకి 5 పరుగుల దూరంలో నిలిచాడు. 347/4 స్కోరు వద్ద తొలి సెషన్ ముగియగా, రెండో సెషన్ మొదలైన కాసేపటికే గ్రీన్ టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీని సాధించాడు. ఐదో వికెట్‌కు ఉస్మాన్ ఖాజా, గ్రీన్ 208 పరుగులు జోడించారు. 1979 తర్వాత భారత్ గడ్డపై ఆస్ట్రేలియా జోడీ నమోదు చేసిన ద్విశతక భాగస్వామ్యం ఇదే! ఆతిథ్య జట్టును అష్టకష్టాలు పెట్టిన ఈ జోడీని ఎట్టకేలకు అశ్విన్ విడగొట్టాడు. గ్రీన్‌ను అవుట్ చేయడంతో భారీ భాగస్వామ్యానికి తెరపడింది. అదే ఓవర్ ఆఖరి బంతికి క్యారీ (0)ని కూడా పెవిలియన్ చేర్చాడు. స్వల్ప వ్యవధిలో స్టార్క్ (6)ను అశ్విన్ బోల్తా కొట్టించాడు. మరోవైపు ఆస్ట్రేలియా ఈ పర్యటనలో తొలిసారి 400 పరుగుల మైలురాయిని చేరుకోగా, 409/7 వద్ద టీ విరామానికి వెళ్లారు.

విసిగించిన మర్ఫీ, లయన్

ఆఖరి సెషన్లో డబుల్ సెంచరీ దిశగా సాగుతున్న ఖాజాకు అక్షర్ పటేల్ చెక్ పెట్టాడు. ఇంకేం మిగతా రెండు వికెట్లను కూల్చేయడం సులభమే అనుకున్న భారత్‌కు టెయిలెండర్లు టాడ్ మర్ఫీ (61 బంతుల్లో 41; 5 ఫోర్లు), లయన్ (96 బంతుల్లో 34; 6 ఫోర్లు) చెమటలు పట్టించారు. ఇద్దరు 19.2 ఓవర్లు ఆడటంతో ఆతిథ్య బౌలర్లు శ్రమించక తప్పలేదు. బ్యాటింగ్‌కు కలిసొచ్చిన పిచ్‌పై ఈ స్పెషలిస్టు బౌలర్లు చక్కగా బ్యాటింగ్ చేశారు. వీలుచిక్కిన బంతిని బౌండరీలకు తరలించారు. ఇక ఒక దశలో 500 పరుగులు దాటిస్తారనిపించింది. వీరిద్దరు తొమ్మిదో వికెట్‌కు 70 పరుగులు జోడించారు. అయితే అశ్విన్ వరుస ఓవర్లలో మర్ఫీ, లయన్‌ను అవుట్ చేయడంతో ఆసీస్ ఆలౌటైంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: హెడ్ (సి) జడేజా (బి) అశ్విన్ 32; ఖాజా (ఎల్బీ) (బి) అక్షర్ 180; లబుషేన్ (బి) షమీ 3; స్మిత్ (బి) జడేజా 38; హ్యాండ్స్‌కాంబ్ (బి) షమీ 17; గ్రీన్ (సి) భరత్ (బి) అశ్విన్ 114; క్యారీ (సి) అక్షర్ (బి) అశ్విన్ 0; స్టార్క్ (సి) అయ్యర్ (బి) అశ్విన్ 6; లయన్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 34; మర్ఫీ (ఎల్బీ) (బి) అశ్విన్ 41; కునెమన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (167.2 ఓవర్లలో ఆలౌట్) 480. వికెట్ల పతనం:** 1-61, 2-72, 3-151, 4-170, 5-378, 6-378, 7-387, 8-409, 9-479, 10-480. **బౌలింగ్:** షమీ 31-3-134-2, ఉమేశ్ 25-2-105-0, అశ్విన్ 47.2-15-91-6, జడేజా 35-5-89-1, అక్షర్ 28-8-47-1, అయ్యర్ 1-0-2-0.

భారత్ తొలి ఇన్నింగ్స్: రోహిత్ బ్యాటింగ్ 17; గిల్ బ్యాటింగ్ 18; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా)** 36. **బౌలింగ్:** స్టార్క్ 3-1-7-0, గ్రీన్ 2-0-11-0, లయన్ 3-0-14-0, కునెమన్ 2-0-3-0.



గ్రీన్

611 ఖాజా బ్యాటింగ్ చేసిన నిమిషాలు. భారత్‌లో ఒక ఆసీస్ బ్యాటర్ సుదీర్ఘ ఇన్నింగ్స్ ఇదే. ఆసీస్ తరఫున బంతులపరంగా (422) కూడా ఖాజాదే రికార్డు. గతంలో ముగ్గురు విదేశీ ఆటగాళ్లు (యూనిస్‌ఖాన్, ఆమ్లా, జయవర్ధనే) మాత్రమే భారత్‌లో 10 గంటలకు పైగా బ్యాటింగ్ చేయగలిగారు.

32 ఇన్నింగ్స్‌లో అశ్విన్ 5 వికెట్లు పడగొట్టడం ఇది 32వ సారి. భారత గడ్డపై కుంబ్లే (25 సార్లు) పేరిట ఉన్న రికార్డును అతను (26) అధిగమించాడు. ఆసీస్‌పై అత్యధిక వికెట్లు (113) తీసిన భారత బౌలర్‌గా కూడా కుంబ్లే (111) రికార్డును అశ్విన్ సవరించాడు.

కమిన్స్ ఇంట్లో విషాదం

సిడ్నీ: ఆస్ట్రేలియా టీమ్ రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తల్లి మారియా కన్నుమూసింది. చాలా ఏళ్లుగా ఆమె క్యాన్సర్‌తో బాధపడుతోంది. అయితే రెండు వారాల క్రితం మారియా ఆరోగ్య పరిస్థితి మరింత విషమించింది. దాంతో తల్లిని చూసుకునేందుకు కమిన్స్ భారత్‌తో రెండో టెస్టు ముగిసిన తర్వాత స్వదేశం తిరిగి వెళ్లాడు. ఆమె కోలుకోక పోవడంతో అక్కడే ఉండిపోయాడు. మారియా మృతి పట్ల ఇరు దేశాల క్రికెట్ బోర్డులు సంతాపం ప్రకటించగా...ఆస్ట్రేలియా క్రికెటర్లు సంతాపసూచకంగా శుక్రవారం భుజాలకు నల్ల బ్యాండ్‌లు ధరించి మైదానంలోకి దిగారు.

బెంగళూరుకు నాలుగో ఓటమి

- 10 వికెట్లతో యూపీ జయభేరి
- చెలరేగిన ఎకిల్‌స్టోన్, హీలీ
- డబ్ల్యూపీఎల్



హీలీ

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఇంకా బోణీకొట్టని బెంగళూరు వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ నిరాశపరిచింది. శుక్రవారం జరిగిన పోరులో అలీసా హీలీ (47 బంతుల్లో 96 నాటౌట్; 18 ఫోర్లు, 1 సిక్స్) బౌండరీల విధ్వంసంతో యూపీ వారియర్స్ 10 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన బెంగళూరు 19.3 ఓవర్లలో 138 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ స్మృతి మంధాన (4) నిరాశపర్చగా, సోఫీ డివైన్ (24 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్), ఎలైస్ పెర్రీ (39 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. వీళ్లిద్దరు రెండో వికెట్‌కు 44 పరుగులు జత చేశారు. అయితే జట్టు స్కోరు 73 పరుగుల వద్ద సోఫీ అవుటయ్యాక పరిస్థితి మారింది. పెర్రీ క్రీజులో ఉన్నప్పటికీ అవతలి వైపు నిలబడే బ్యాటరే కరువయ్యారు. కనిక (8), హీథెర్ నైట్ (2), శ్రేయాంక (15), బరేస్ (12) ఇలా అంతా మూకుమ్మడిగా విఫలమయ్యారు. వారియర్స్ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ 4, దీప్తి శర్మ 3 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన యూపీ 13 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 139 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్, కెప్టెన్ అలీసా హీలీ, దేవిక వైద్య (31 బంతుల్లో 36 నాటౌట్; 5 ఫోర్లు) ఇంకా 7 ఓవర్లు మిగిలుండగానే అజేయంగా ముగించారు.



ఎకిల్‌స్టోన్

డబ్ల్యూపీఎల్‌లో నేడు

గుజరాత్ జెయింట్స్ X ఢిల్లీ క్యాపిటల్స్
రాత్రి గం. 7:30 నుంచి
స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

న్యూజిలాండ్ 162/5

క్రైస్ట్‌చర్చ్: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ కష్టాల్లో పడింది. మ్యాచ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ తమ తొలి ఇన్నింగ్స్ 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. టామ్ లాథమ్ (67) అర్ధ సెంచరీ సాధించగా... డరైల్ మిచెల్ (40 బ్యాటింగ్), కాన్వే (30) రాణించారు. కుమార, అసిత చెరో 2 వికెట్లు పడగొట్టారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 305/6తో ఆట కొనసాగించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 355 పరుగులకు ఆలౌటైంది. సౌతీ 5, హెన్రీ 4 వికెట్లు తీశారు. ప్రస్తుతం కివీస్ మరో 193 పరుగులు వెనుకబడి ఉంది.

దక్షిణాఫ్రికా 287/7

జొహన్నెస్‌బర్గ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 287 పరుగులు చేసింది. కెప్టెన్ తెంబా బవుమా (275 బంతుల్లో 171 బ్యాటింగ్; 20 ఫోర్లు) భారీ సెంచరీతో చెలరేగగా...ముల్డర్ (42) రాణించాడు. 8 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన సఫారీ టీమ్‌ను బవుమా ఒంటి చేత్తో ఆదుకున్నాడు. బవుమా, ముల్డర్ ఆరో వికెట్‌కు 103 పరుగులు జోడించారు. విండీస్ బౌలర్లలో మేయర్స్, అల్జారి జోసెఫ్ చెరో 2 వికెట్లు తీశారు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా ఓవరాల్‌గా 356 పరుగుల ఆధిక్యంలో ఉంది.